THE

# MANORAMA.

A MONTHLY TELUGU MAGAZINE.

(Published in the third week of every month.)

EDITED BY

CHILAKAMARTHI LAKSHMINARASIMHAM.

Vol. 1. } RAJAHMUNDRY. AUGUST 1906. { No. 8.

CONTENTS.

| | | PAGE. |
|---|---|---|
| 1. | REVIEWS. ... | 429. |
| 2. | COMPLIMENTARY VERSES. ... ... | 431. |
| 3. | TIT-BITS. ... ... ... ... | 433. |
| 4. | TALES OF RAJASTAN. ... ... | 437. |
| 5. | KRISHNADAS PAUL. ... ... | 449. |
| 6. | HARICHANDRA MUKARJI. ... ... | 454. |
| 7. | VIDDHASALABHANJIKA. By J. Venkatramayya. | 457. |
| 8. | SELF-HELP.—By Mr. Ch. Veerabhadra Rao. | 573. |
| 9. | KARPURAMANJARI (A Novel). ... ... | 581. |

Rajahmundry:

PRINTED AND PUBLISHED BY

*Messrs S. GUNNESWARA ROW BROS.*

AT THEIR CHINTAMANI PRESS.

1906.

పత్రికాధిపతి—చిలకమర్తి లక్ష్మీనరసింహము,
రాజమహేంద్రవరము.

## విషయసూచిక.


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్రనాటకములలోని యుత్తరరంగములు. | 429 |
| 2. | పద్యములు | 431. |
| 3. | వినోదములు. | 433. |
| 4. | రాజస్థానకథావళి. | 437. |
| 5. | కృష్ణదాసుపాలు. | 449. |
| 6. | హరిచంద్రముఖర్జి. | 454. |
| 7. | విద్ధసాలభంజిక.—జనమంచి వెంకటరామయ్యగారు. | 457. |
| 8. | స్వయంసహాయము—చిలుకూరి వీరభద్రరావుగారు. | 573. |
| 9. | కర్పూరమంజరి. | 581. |


## THE MANORAMA.

RATES OF SUBSCRIPTION (*Including Postage*)

| | |
|---|---|
| For Patrons. | Rs. 25-0-0 |
| For one year (*in advance*). | ,, 3-0-0 |
| Single Copy. | ,, 0-4-6 |

### చందానిర్ణయము. (అంచెకూలితోడ)

పోషకులకు సంవత్సరమునకు రు. 25- 0- 0

సంవత్సరమునకు (ముందుగా చెల్లించిన) రు. 3- 0- 0. విడిప్రతియొకటికి 0- 4- 6.

పత్రికను గోరువారు తత్పత్రికాధిపతి గారికి వ్రాసికొనవలయును.

శ్రీ

# మనోరమ

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము. 1. | రాజమహేంద్రవరము. అగస్టునెల 1906. | సంచిక 8.

## ఆంధ్రనాటకములలోని యుత్తరరంగములు.

అను శీర్షికగల యాంధ్రగ్రంథము మాకందినది. ఇది బ్రహ్మశ్రీ మ- రా- శ్రీ- ధర్మవరం రామకృష్ణమాచార్యులవారిచే రచియింపఁబడిన యనేకాంధ్రనాటకముల యందలి కడపటి యంకములలోని యుత్తరరంగము లను పేరుగల చివరభాగములు గలిపి యెంతయు హృదయరంజకముగా నున్నది.

రామకృష్ణమాచార్యులువారు ప్రతినాటకమందు నుత్తరరంగ మొకటికల్పించి యానాటకమువలన ప్రజలు నేర్చుకొనవలసిన నీతిసారమునంతయు నందుఁజెప్పుదురు. ఈ యుత్తరరంగములలో ననేకవిషయము లగునీతి బోధింపఁబడియున్నది. అందు ప్రమీలార్జున నాటకమునందలి యుత్తరరంగమున స్త్రీలకు స్వాతంత్ర్యమియ్యకపోవుట చదువు చెప్పింపకపోవుట గొప్పతప్పులనియు విషాదసారంగధరనాటకమున జరుగఁగ కార్యగతులు విచారింపక స్త్రీలమాటలచే నృపతుఁడు తప్పక చెడిపోవుననియుఁ బద్యరూపముగను ద్విపదరూపముగను హితోపదేశము చేయఁబడినది. "జగ మెఱుంగు బ్రాహ్మణునకు జందెమేల" యనునట్లు తెలుఁగునాటకము లనేకములు రచియించి యాంధ్రదేశము నందంతట విశేషవిఖ్యాతిగాంచిన శ్రీ ధర్మవరం రామకృష్ణమాచార్యులవారి కవిత్వము లలితముగ మనోహరముగ నున్నదని మేమిచ్చట వేరుగఁ జెప్పనక్కరలేదు. ఈ చిన్నపొత్తము రామకృష్ణమాచార్యులవారికి చిరమిత్రులునుఁ జెన్నపురి నివాసులునగు మ- రా- శ్రీ. విసుమలపాటి వెంకటసుబ్బరామయ్య శెట్టిగారిచే నచ్చు వేయింపఁబడినది. దీనివెల నాలుగణాలు మాత్రమే. పలయుపాటి

చెన్నపురిలోనున్న పైవారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును. వారి కవిత్వశైలి దెలుపుట కిందు కొన్నిపద్యము లుదాహరించుచున్నాము.

ప్రమిలార్జుననాటకముయొక్క యుత్తరరంగమునందలి పద్యములు.

సీ. సతులకించుకయేని స్వాతంత్ర్యమిచ్చుటతరముగాదను పుణ్యపురుషులార
స్త్రీలకు విద్య నేర్పించిన లోకముల్ మునుఁగునంచను ధీరమనుజులార
పాటింపఁగూడ దెచ్చోటఁ గాంతలబుద్ధి ప్రళయాంతకంబను భవ్యులార
సుతులఁగాంచుటకంటె సతులకు నింకొక్క పనిలేదనెడు మహాప్రభువులార
ఆలకించితిరే ప్రమీలార్జునంబు
నరసితిరే వీరపురుషులనాఁడు భంగి
యెందిచూడంగ నాశ్చర్య మేమికలదు
బలముగలవారె యెయ్యెడ ప్రబలుగాదె.

విషాద సారంగధరనాటకముయొక్క యుత్తరరంగమునందలి ద్విపద.

ద్విపద. నాచరిత్రంబు మనంబున నరయ
వైచిత్రియింతని వాకొనఁదరమె
యింతిమాటలనమ్మి యిదమిత్థమంచు
జింతింపఁజాలక సిలుగులఁబడితి
నాతురతను నిక్కమరయకపోతిఁ
బ్రీతియెల్లనుమాని పెంపుగోల్పడితి
తప్పక యిదికల్ల తగదంచుహితము
చెప్పువారలమాటఁ జెవిఁబెట్టనైతి
నామానినీమణి నామోహనాంగి
నాముద్దుపగలాడి నాపూవుఁబోఁడి
చెల్లఁబోయెందైనఁ జిత్రాంగి తెలిసి
కల్లలాడునెయంచు కడునమ్మిచెడితి
ననయంబునన్ను సహోదరబుద్ధిఁ
దనదైవముని ప్రేమ దైనారఁబలికె
నామాట యించుకైనను జవఁదాఁట
కేమారకాంచి యేవేళ నడిపె.

రాజవోలు గ్రామవాసులగు మహారాజశ్రీ పొన్నాడ కృష్ణమూర్తిగారీక్రింది పద్యములను మాకుబంపి పత్రికయందు ప్రకటింపుమని కోరిరి.

ఉ. శ్రీనవనీతపేశలరుచిం దనరారు కవిత్వకాంత యె
వ్వానికి మాటమాత్ర వశవర్తినియై చరియించు నెవ్వఁ డిం
తైనను గర్వ మంచెఱుఁగఁ డట్టిమహాత్ముఁడు చిల్కమర్తి ల
క్ష్మీనరసింహమూర్తి కవిశేఖరు సన్నిధికిం బ్రియంబునన్. 1.

క. విన్నపమిదె కైకొనుఁడీ
పొన్నాడాన్వయుఁడ కృష్ణమూర్తియనెడువాఁ
డన్నరినాథుని భక్తుఁడ
మన్నించుఁడు నాకుఁదోఁచు మాటలువ్రాతున్. 2.

ఉ. చక్కెర మెక్కినట్టులను, చక్కని చిక్కనిపాలు గ్రోలిన
ట్లుక్కెర దిన్నయట్టుల మహోత్సుకతం దగఁదేనెఁ ద్రావి న
ట్లొక్కొక్కదానికన్న మఱియొక్కటి మేల్రుచు లూరుచుండుఁ జెం
పెక్కిన నీదుకబ్బము లహీనరసాస్పదముల్ మనోజ్ఞముల్. 3.

మ. నవలల్వ్రాయరొ యాంగిలేయకవి గ్రంథంబుల్వెసన్జూచి స
త్కవులీనాడును నెంత వింతలగు మార్గంబుల్ఘటింపించినన్
అవియొందు న్భవదీయనోవెలులచాయంబోల్చ నేమోదమున్
దవులంజేయునె ప్రోడుపారు మదికిం దైన్యంబునుం బాపునే. 4.

క. ధైర్యము ఘటించు నతిచా
తుర్యంబునుఁ గలుగఁజేయు దుఃఖమణచు నా
శ్వర్యమగు భక్తినిడు సౌం
దర్యతిలకవంటి నవల ధరణింగలదే ?. 5.

క. తేనియరుచి నొప్పుటనెం
తేనియు నామోదమిడుట నిలనుబుధాళిన్
దానెపు డాకర్షించెడు
జానుగ భవదీయ పారిజాతం బహహా! 6.

చ. నవకవిపుంగవుల్వివిధ నాటకము ల్రచియించినారు య
య్యవి రసవత్తరంబులగు నైనను చింపవు నీప్రసన్నయా
దవ మను నాటకంబువలె తథ్యముగా విననింకనున్ వినం
డివిరెడు నామనంబవుర దీనికి నెయ్యది సాటివచ్చెడున్. 7.

# మనోరమ.

క. హరిశ్లాఘాంకితమైన కావ్యము సువర్ణాంభోజహంసావళీ
సురుచిభ్రాజితమైన మానస సరస్స్ఫూర్తి న్విడంబించు శ్రీ
హరినామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమై యుండదయోగ్య ధూర్తద నటత్కాకోల గర్తాకృతిన్.
క. అని భాగవతముపల్కెడు 8.
గననీ భాగ్యంబు నీకు ఘటియించెనిహం
బును పరముఁ జూరగొంటివి
నిను మెచ్చగవచ్చుఁ ధన్యునిగ కవులందున్.
గీ. పిట్టకథ లల్లి యితరుల దిట్టినట్టి 9.
పట్టిప్రహసనములు వ్రాసి ఇట్టి కాల
మట్టె యూరడి కాతుండ దిట్టవగుచు
గుట్టుగను చిట్టికృష్ణుని పట్టినావు
నెట్టన న్నిన్నుతించక యెట్టులుందు ?.
సీ. అదియేమి భాగ్యమో యతిమార్దవమురుచుల్ గనిపించుఁగాదె నీగ్రంథములను. 10.
అదియేమదృష్టమో యఖిలజనానంద సంధాయియగును నీగ్రంథవితతి
అదియేమిపుణ్యమో యాంధ్రంబునం దేరఁగననట్టి ప్రఖ్యాతిగలిగెమీకు
అదియేమిచిత్రమో వదలబుద్ధిజనింప దొకమారువినిన నీసుకవితంబు.
గీ. అహహ చరితార్థుఁడవు నీవె యాంధ్రకాళి
దాసనఁగ నీకుఁ జెల్లును, తగ దటన్న
నీ నగును, ధన్యుఁడవు నీవు ధీసమేత
చిలకమర్తి లక్ష్మీనరసింహమూర్తి.
గీ. అల జరాసంధు నోడించినట్టివాఁడు 11.
సత్యభామహిమోదంబు సలుపువాఁడు
ముర నరక రక్కసులఁ గూల్చఁ బుట్టినాఁడు
యట్టి మావాఁడు మిముఁ బ్రోచు ననవరతము.
గీ. అతని కిడఁగరాని దంచు నున్నదె యెందు 12.
భక్తవరులపాలి పారిజాత
మగును గాదె పూర్వమా ధృతరాష్ట్రున
కిడఁగ లేదె దివ్యదృష్టి సఖుఁడ.
గీ. తీరుబడియును విద్యయుం దెల్వి లేక 13.
చనువుచే వ్రాసినట్టి యీజాబునందు
తప్పులున్నను మన్నించి దయను
చిత్తగించవలయును.

పొన్నాడ కృష్ణమూర్తి.

72. తెలుఁగుదేశస్థుఁ డగునొక వైదికబ్రాహ్మణుఁడు కన్నడదేశమునకుఁ బోయి యొక శుద్ధగృహస్థునియింట భోజనమునకు వెళ్లెను. అక్కడ భోజనమునకువచ్చినవా రందఱు కన్నడభాషనే మాటలాడిరి. ఆభాషలో సాకు అనఁగా చాలుననియు, బేకు అనఁగా వేయుమనియు నర్థము. తెలుఁగుబ్రాహ్మణునకు కన్నడము రాకపోవుటచే నేమాట కేయర్థమో తిన్నఁగ దెలియలేక సాకు అనఁగా వడ్డించుమని యర్థ మనుకొని వడ్డనబ్రాహ్మణుఁడు వచ్చినప్పుడు సాకు సాకు యని యారంభించెను. వడ్డనచేయువారు వాని కేవస్తువు లక్కఱలేదు కాబోలు ననుకొని వడ్డింపకయే పోయిరి. కడుపులో నాకలి మిక్కుటముగా నగుటయు విస్తరిలో నేవస్తువు లేకపోవుటయు గని, పెట్టి యాబ్రాహ్మణుఁడు, ప్రాణము విసుగుటచే వడ్డనబ్రాహ్మణుని జూచి "ఓరీ! నీసాకు చట్టుబండలు గాను రెండు బేకులు బేకరా కడుపు మండుచున్నది." అని పలికెను. ఇంటి యజమానుఁడు వాని యమాయకత్వము నెఱిఁగి కడుపునిండ వానికి భోజనము పెట్టించెను.

73. తండ్రి కొడుకు నగునిద్దఱు శూద్రు లన్నములేక బ్రాహ్మణవేషములు వేసికొని సత్రములలోను సంతర్పణములలోను యథేచ్ఛముగా భోజనము చేయుచుండిరి. ఒకనాఁ డొకసంతర్పణకు వారిరువురుఁ బోయియుండఁ దండ్రి గంధము తెమ్మని కొడుకును బంపెను. కొడుకు గంధము దీయుబ్రాహ్మణునియొద్దకుఁ బోయి గంధ మిమ్మని యెడమచేయి జాఁపెను. శూద్రుఁ డగుటచే మొగమునఁ బెట్టుకొను గంధ మెప్పుడు కుడిచేతితోనే యందుకొనవలయు ననుమాట యతఁ డెఱుఁగఁడు. గంధము దీయుబ్రాహ్మణుఁ డాకుఱ్ఱవానిని జూచి 'ఓయా! నీవు శూద్రవాఁడవా యేమి? గంధమున కెడమచేయిఁ బట్టుచున్నా వని మాటవరుస కనెను. తనగుట్టు బ్రాహ్మణుఁడు తెలిసికొన్నాఁడు కాబోలు ననుకొని యక్కడనుండి గట్టిగా కేకవేసి యోరీ నాయనా! ఈబాపనోడు మనగుట్టు కనుక్కున్నాఁడురో యని తండ్రితో చెప్పెను. ఆపలుకులు విని యచ్చటి బ్రాహ్మణు లందఱు మీగుట్లేమిటని వారిని తరచితరచి యడిగి వారు శూద్రులని యెఱింగి చావ గొట్టి యావలకుఁ బంపిరి.

74. ఒకమాలవాని కొడుకు తండ్రి చెప్పినమాట వినక తన కులవిద్య లగు చెప్పులు కుట్టుట డప్పు కొట్టుట మొదలగు పనులను మాని యల్లరిపిల్లవాఁడై తిరుగుచుండెను. తండ్రి వానిపై గోపఁబడి యిట్లనియె. ఓరీ చెప్పకుట్టక డప్పు కొట్టక బోడిబాపన వానివలె బిచ్చమెత్తుకొని బ్రతికెదవా యని యడిగెనఁట.

75. ఒకసాలెవాఁడు ప్రతిదినము కోడిపందెములు గట్టుచు నాపని నిమిత్తము పెక్కుకోళ్ళను బెంచుచుండెను. ఒకమారు వాని యింటనున్న కోళ్ళన్నియు పందె

ములకుఁ జచ్చిపోవుట సంభవించెను. అప్పు డాపండెగాడు కోళ్లులేక తనయిల్లు చిన్నబోయి కళాహీనమై వెలవెలబోవుట కంతయుఁ జింతించి "అయ్యో! నాయిల్లు కోడికూత యన్నమాటలేక బోడిబాపనకొంపలాగ పాడుపడి యున్నదోయి నాయనా" యని మిత్రులతో చెప్పుకొని పెద్దపెట్టున నేడ్చెను.

76. ఒకవైష్ణవునకు గ్రామములో నే యత్తవారియిల్లుండెను. అందుచేత నతఁడు ప్రతిదినము భోజనానంతరమున నచ్చటికిఁ బోయి సాయంకాలమువఱకు కూరుచుండును. వైష్ణవు లుదయమునందు సాపాటు చేయకముందే తిరుమణి తిరుచూర్ణములు పెట్టుకొను వాడుకగలవారగుట నావైష్ణవుఁ డొకనాఁడు నామము దిద్దుకొని భోజనము చేయకయే యత్తవారియింటికి వెళ్ళెను. అల్లుఁడు భోజనము చేసియే వచ్చెననుకొని యత్తమామలు వానిని దిండికి బిలువరైరి. అత్తవారు బిలువక తనంతటఁ దాను భోజనమునకుఁ బోవుట లాఘవమని యల్లుఁడు భోజనమునకు లేవడయ్యె. తనయింటికి మరల భోజనమునకుఁ బోవుదమన్న వేళ మించినదని సందేహము గలిగె. అందుచేత నాయల్లుఁడు దిన మంతయు మలమల మాడి దీపాలవేళ నత్తవారి యింటివాకటిలో మంచము వేసికొని భూపాళరాగము మీఁద మేలుకొలుపులు పాడ నారంభించెను. అప్పుడు వాని మరది వచ్చి యేమోయి! బావా తెల్లవారగట్ల పాడవలసిన భూపాళరాగము సాయంకాలము పాడుచున్నావేమని యడిగెను. పరగడుపున నెప్పుడు పాడిన నేమని మరదికి బావ ప్రత్యుత్తరము చెప్పెను. అయ్యో! ప్రొద్దుటినుండియు నీ వన్నమే తినలేదా యని యాశ్చర్యపడి మరది యడుగ నాయనా? నామము నాకొంప తీసినదోయి యని బావ బదులు చెప్పెను. అప్పుడు మరది తల్లిదండ్రుల కామాట చెప్పి త్వరగా వంట చేయించి శోష రాకుండ బావను కాపాడెను.

77. తుంగభద్రాతీరమునందలి విజయనగరమును బరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు మిక్కిలి బలవంతుఁడు సద్గుణవంతుఁడు పండితపక్షపాతి యగుటచే ననేకు లాయనను కృష్ణుని యవతారమని కొనియాడుచు వచ్చిరి. ఒకనాఁడు కృష్ణదేవరాయలు నిండుకొలువుండి పండితులతో ప్రసంగించుచు ధర్మరాజు తమ్ములు మంచివారా శ్రీరాముని తమ్ములు మంచివారా యని యడిగెను. సభలో నున్నవారిలో కొందఱు రాముని తమ్ములు మంచివారనియుఁ గొందఱు ధర్మరాజుతమ్ములు మంచివారనియు పరిపరివిధములఁ జెప్పిరి. వారు చెప్పినమాటలు సహేతుకములుగ లేకపోవుటచే ధర్మసందేహము తానే నిర్ణయింపఁ దలఁచి కృష్ణరాయ లిట్లనియె. "రామునికంటె రాముని తమ్ములు బలహీనులు. అందుచేత వారు తమ యన్నగారిమాట విని తీరవలయును. బలహీనులయి బలవంతునిమాట

పనులలో నేమిగొప్ప యున్నది: ఇంక ధర్మరాజు తమ్ములమాట యన్ననో ధర్మరాజు కంటె నతని తమ్ములు బలవంతులు ప్రయోజకులు. విశేషించి పాండవుల కన్నికష్టములు ధర్మరాజు మూలముననే వచ్చినవి. అన్నగారికంటె తాము బలవంతులయ్యు నతని మూలమున నన్ని నీచదశలు ననుభవించియు భీమార్జున నకుల సహదేవులు ధర్మరాజు మాట జవదాటక నిలిచిరి. ప్రయోజకులగువా రప్రయోజకునిమాట శిరసావహించుట గొప్పకాదా? అందుచేత ధర్మరాజు తమ్ములే మంచివారని నా యభిప్రాయము.'' అని రాయలు పలుక సభలో నొకపండితుఁడు లేచి ''అయ్యా! మీ కాయవతారమునందే గాక ఈయవతారమునందుఁ గూడ పాండవ పక్షపాతమే యున్నదిగదా యని పలికి రాజును సంతోషపరచెను.

78. పూర్వకాలమునం దొకరాజు నాశ్రయించి నిరుపేద యగునొక క్షత్రియుఁడు బ్రతుకుచుండెను. ఆక్షత్రియుఁడు మహాశూరుఁడు బలశాలి యగుటచే వాని నందఱు మన్నించుచు మిక్కిలి కోపిష్ఠి యగుటచే వానిజోలి కెవరును బోవుటకు వెఱచుచువచ్చిరి. అతఁ డొకనాఁడు రాజుగారి బావమఱదితో చదరంగమాడి ఆటలో నిద్దఱకు వివాదము గలిగినందున రాజుగారి మఱదిని నఱకివేసెను. ఆమాట వినినతోడనే రాజు కోపోద్దీపితుఁడై వానిని తక్షణము జంపివేయవలసినదని యానతిచ్చెను. బుద్ధిమంతుఁడగు నారాజుమంత్రి యాబీదక్షత్రియుని తనవద్దకు బిలుపించి రాజు సెలవుప్రకారము వానిని జంపక దూరమున నొకకోటలో నుంచి పలువిధముల నతనిని గాపాడుచు వచ్చెను. ఆమాట విని రాజు వాని నెందుకు జంపింపలేదనియడుగ మంత్రి ''అతనివలన మన కెంతైన నుపయోగ మున్నది. అతఁడు మనరాజ్యమునకు మహోపకారము చేయఁ గలఁడు. ఇంతకోపిష్ఠి యెవ్వఁడైన దొరకునా యని నేను వెదకుచున్నా'' నని బదులు చెప్పెను. మంత్రిమాట యెంతవఱకు నిజమో చూడవలయునని రా జూరకొనెను. అంతలో నీరాజుగారిని లోబరుచుకొని యప్పటివఱకు కప్పము గ్రహించుచున్న తురక నవాబు వీరి పట్టణమునకు వచ్చి కప్పము చెల్లింపవలసిన దనియడిగెను. దగ్గర పైక ముండియు మంత్రి రేపు బంపెద మాపు బంపెద మని జరపుచువచ్చెను. నవాబు మహా కోపముచేత మండిపడుచు పైకము పుచ్చుకొని యాలస్యమునకు వారిని శిక్షింపవలయు నని తలంచుచుండెను. అట్లు కొన్నినాళ్ళు జరపి మంత్రి యెట్టకేలకు వెనుకటి పేద క్షత్రియుని బిలిచి నవాబున కీవలసిన రొక్కము కావళ్ళ గట్టించి యాపైకము తీసికొనిపోయి తురక కిచ్చిరమ్మని వానిని బంపెను. అతఁడు సరే యని కత్తి చేతఁబూని గుఱ్ఱముపై నెక్కి సొమ్ము పట్టించుకొని నవాబువద్దకుఁ బోయి నిలిచి సలాముచేసి రాజు

గాను పయికమును బంపినారని విన్నవించెను. నవాబు హుక్కా త్రాగుచు వానిని గూర్చుండు మనకరయే యంతయాలస్యము చేసినందుకు మహాకోపముతో సొమ్ము బంపిన రాజును తెచ్చిన క్షత్రియుని బూతులు తిట్టెను. ఆటలోనైన మాటబడనొల్లక రాజు గారి మరదియంతవాని నవలీలగా నరకిన యాశూరశిఖామణి తురకవాఁడు బూతులు తిట్టినతోడనే చేతిలోనికత్తిఁ దీసికొని తల కొబ్బరిపుచ్చివలె రెండుగురునట్లు నరకెను. తోడనే నవాబు బంట్లువచ్చి క్షత్రియుని ముక్కలు ముక్కలుక్రింద నరకి తమ దొర మృతినొందుటచే నక్కడ నుండలేమని చెల్లాచెదరై పారిపోయిరి. మంత్రి యుక్తి వలన నిజవలె కేలిబాటికనివలె తమ్ము పీడించుచున్న నవాబును తన మఱఁది జంపిన క్షత్రియుఁడుఁ గూడ నేకకాలములోనే హతులైరని విని రాజు మిక్కిలి సంతసించి మంత్రికి బహుమానము చేసెను.

79. ఒకయూరిలో నిద్దఱు దాయవారపు బ్రాహ్మణు లుండిరి. ఒకఁడు దైవాధీనమని బిచ్చ మెత్తుకొనుచుండెను. ఒకఁడు రాజాధీనమని యాయవారము చేసికొనుచుండెను. ఆయూరి రాజు రాజాధీనమ్మను బ్రాహ్మణుఁడు తనను మిక్కిలి గౌరవించుచున్నాఁడని వానియందు మిక్కిలి దయగలిగి యొక్క గుమ్మడికాయ తెప్పించి తొలఁగొట్టించి లోపలిగుంజును చమత్కారముగ దీయించి యందులో నూరువరహాలు పోయించి యానవాలైన దెలియకుండ మరలపయిముక్క యతిగించి యాబ్రాహ్మణుని బిలిచియందు ధనమున్నమాట చెప్పకయే యాగుమ్మడికాయ దాన మిచ్చెను. ఆబ్రాహ్మణుఁడు దానము గ్రహించి పోవుచు దనలో మాయింటినిండ గుమ్మడికాయ లున్నవి. ఇప్పు డీకాయ నేనేమి చేసికొనను. ఇది యమ్ముకొన్నచో రెండణాల డబ్బులైన వచ్చునని యొకకోమటికి కాగుమ్మడికాయను రెండణాలకు విక్రయించెను. ఆకోమటి యాగుమ్మడికాయను మంచి బ్రాహ్మణునకెవ్వరికైన దానము చేసికొనవలయునని తలఁచి దైవాధీనమ్మను బ్రాహ్మణుని బిలిచి యిచ్చెను. ఆబ్రాహ్మణుఁ డాకాయ నింటికి తీసికొనిపోయి పగులఁగొట్టి యందు వరహాలఁ జూచి దైవము తనయందలి కరుణచే నట్లిప్పించెనని సంతసించెను. రాజు రాజాధీనమ్మను బ్రాహ్మణుని మరునాఁడు బిలిచి గుమ్మడికాయ యెట్లున్న దని యడుగ విక్రయించినట్లు చెప్పినచో నేమి మూడునో యని భయపడి కాయ పెద్దది ముక్క తియ్యగా బెల్లములా గున్నది. గింజ లేనోర్చె యున్నవని యబద్ధ మాడెను. కాయలో వరహా లున్నసంగతి బ్రాహ్మణుఁడు చెప్పనందున నతఁ డాకాయ పగులఁగొట్టి తినలేదని యనుమానించి రాజు గట్టిగా నిరోధించి యడుగ బ్రాహ్మణుఁడు నిజ మొప్పుకొనెను. రాజు కోమటిని బిలిపించి కాయయేమి చేసితివని యడుగ నతఁడు దైవాధీనబ్రాహ్మణునకు దాన మిచ్చితినని పలికెను. అప్పుడు రాజు బుద్ధి తెచ్చుకొని దైవమును నమ్మినవాఁడే బాగుపడును గాని మనుష్యుని నమ్మినవాఁడు బాగుపడడని తెలిసికొనెను.

# రాణాసంగుఁడు.

పదునాఱవశతాబ్ద ప్రారంభమునందు మీవారు సంస్థానమునం దొకమారుమూల నొక గ్రామమున బీదకాఁప కుటుంబ మొకటి యుండెను. ఒకచిన్న మేఁకలమంద నాలుగు కాళ్ళ పశువులు కట్టుకొను ముతకగుడ్డలు మొదలగునవి దక్క వారి కితర సొత్తేమియు లేదు. ప్రపంచమునం దెంతటి దరిద్రు లున్నను వారికన్న దరిద్రులు కొందఱు కనఁబడుచునే యుందురు. ఆకుటుంబ యజమాని యొకనాఁడు పొలమునుండి వచ్చుచుండ దారిలో చినుగుగుడ్డలు కట్టుకొని యన్నము లేక మలమల మాడుచున్న యొక క్రొత్తమనుష్యుఁడు వాని కగపడెను. పశువులఁ గాచుట కెవనినైన నొక సేవకునిఁ బెట్టుకొనుట కదివఱకే యోచించుచుండుటచే నతఁడీ క్రొత్తవాని నాపనియందు నియోగించెను. ఆకాఁపువాని భార్య యీసేవకుని దెచ్చుట కిష్టపడక కొంచెము సణుగుకొని యిట్లనియె. "బ్రాహ్మణులకు బిచ్చగాండ్రకు నన్నము పెట్టుట పుణ్యము గాని తక్కినవాండ్రకు దానము చేసిన నేమి లాభము. దేశములో దుర్మార్గులనేకులు పనిపాటలు మాని తిరుగుచుందురు. ఈమహానుభావుఁ డెంతటివాఁడో మన మేమెఱుఁగుదుము? అదిగాక పశువులను మేపుటమాత్ర మంత పైపై నున్నదా? ఆపని యందఱుఁ జేయఁగలరా? చిన్నప్పటినుండియు యలవాటుపడిన కుఱ్ఱవాండ్రకె లొంగును గాని పశువులు క్రొత్తవానిని దరికిఁ జేరనిచ్చునా? ఈమనుష్యునివలన మనపని యగునని తోఁచదు."

భార్య పలుకులు పెనిమిటి మొదట సరకు సేయలేదు గాని పిమ్మటఁ గొన్నినాళ్ళకవియే నిశ్చయము లయ్యెను. ఏలయన సరిగా నడువనైన లేనికుఱ్ఱవాండ్రు కఱ్ఱపుచ్చుకొని యదలించినంత మాత్రమున గడగడవడకి దారినిఁ బోయి దారిని వచ్చు మోటపశువులా క్రొత్తకాపరిని లక్ష్యము సేయక విజృంభించి తిరుగఁజొచ్చెను. యజమానుఁ డాసేవకుని తెలివితేటలు గనిపెట్టి యతఁ డెందుకు పనికిరాఁడని యాపనిలోనుండి తప్పించి యింటిపనులు సేయు మనివానిని నియోగించెను. అతని దురదృష్ట మేమోకాని యాతఁడింటిపనులకుం బనికిరాఁడయ్యె. ఒకనాఁడు యజమానుని భార్య రొట్టెలు కాల్చుచుతా నేదో మఱియొక పనిమీఁద లోనికిం బోయి యవి మాడిపోకుండఁ జూచుచుండుమని సేవకున కానతిచ్చెను. సేవకుఁడు సరే యని యామాట మఱచిపోయి పరధ్యానముగా నుండునప్పటి కంతలో రొట్టెలు మాడి బొగ్గు లయ్యెను. ఆపూట భోజనము బుద్ధి

లేని సోమరిపోతు మూలమున నిష్కారణముగఁ జెడిపోయెగదా యని యజమానుని భార్యయే గాక యింటిలోనున్నవా రందఱు వానిపై మండిపడి ''రొట్టెలు కష్టగా వేఁగినప్పుడు పొట్ట బద్దలగునట్లు తినుటకు నీవు నోరు తెరవఁగలవు గాని యవి మాడిపోవుచున్న వేమో చూచుటకుఁ గన్నులు తెరవలేవు. నీవు మా కక్కఱలేదు. నీ యిష్టము వచ్చిన చోటికిఁ బో'' మ్మని చెప్పిరి.

ఆమందభాగ్యుఁ డామాటలుపడి బదులు చెప్పక యా యిల్లు విడిచి వెల్లఁగ నవతలను నడచెను. పశువులకాఁపరిగను వంటవాఁడుగను పనికిరాకున్న నతఁడు తెలివితేటలు లేనివాఁడు కాఁడు. అతని శరీరము సుందరమయ్యు దృఢమయి చాకచక్యము గలదియు కష్టమున కోర్చునదియునై యుండెను. రాజపుత్రదేశమందు బుట్టినవాఁ డెవ్వఁడు చేత నాయుధములు లేక సంచరింపఁడు. ఈపురుషుఁడు నిరాయుధుఁ డగుటయే గాక నిర్భాగ్యుఁడై దారిద్ర్యమును వెళ్ళఁబోయుచుండెను. ధగధగలాడు నతని శరీరచ్ఛాయనుబట్టి యతఁడు కాఁపువాఁ డనుకొనుటకు వీలులేదు.

రాయమల్లుని జ్యేష్ఠకుమారుఁ డగుసంగుడు నాఁడట్లాకమఠమువద్ద నొక రాజపుత్రవీరుని సహాయమువలన నెట్టెటో ప్రాణములు దక్కించుకొని యావలకుఁ దాటి మహారాజకుమారునికొఱకెవ్వఱును పశువులకాపరులయిండ్లు వెదక రనినమ్మి గొల్లవాండ్రతోఁ గలసి మెలసి కాలక్షేపముఁ జేయుచుండెను. తాను నమ్మిన గొల్లలే తన్ను లేవఁగొట్టినప్పుడు పట్టుట కాయుధము తినుట కన్నము తలఁ దాఁచుకొనుటకు పంచకష్టసుఖములు జెప్పుకొనుటకుమిత్రుఁడులేనివిదేశములోనిక నెట్లుబ్రతుకుదునాయనిసంగుఁడువిచారింప జొచ్చెను. అట్లు విచారించుచు నతఁ డేమియుఁ దోఁచక నడవులఁ దిరుగుచుండ నొక నాఁడు కొందఱుగుఱ్ఱపురౌతులు వాని కగపడి వెంటనే గుఱ్ఱములనుండి దిగి వినయమున వాని పాదములపైఁ బడి నమస్కరించిరి. శరీరమునకు గాయపుమచ్చలు కొంతమార్పు తెచ్చినను ఆ విశాలలోచనములు ఆ చక్కఁదనము నొకమాఱు చూచినవా రెవ్వ రతనిని మరచిపోరు. అందుచేతనే కనఁబడిన రాజపుత్రవీరులు అతఁడు తమకు ముందు రాజగునని గ్రహించి సంగుని గౌరవించి ''అయ్యా! మీరు బ్రతికియున్నవార్త పృథ్వీరాజు విన్నపక్షమున మీ కపాయము గలుగును గనుక మేము మీరహస్యమును వెలిపుచ్చము; కాని మేము మిమ్ము విడువక సేవించుచుందుము. ఈప్రాంతములకు సింహస్వప్నముగా నున్న శ్రీనగరరాజుయొక్క కొలువులో మే మున్నాము. మీరుకూడ నారాజును కొలుతురేని మీకుఁ గావలసిన యాయుధములు గుఱ్ఱము నిప్పించెదము.'' అని వారు పలుకుటయుఁ దాను బాగుపడుట కింతకన్న మంచిసమయము దొరకదని నిశ్చయించి

సంగుఁడు శ్రీనగరరాజు కొలువు నంగీకరించి రాజపుత్రవీరులు విశ్వాసము గలిగి తన్ను సేవింప దినము లొకతరబడిగా పుచ్చుచుండెను.

ఒకనాఁడు శ్రీనగరరాజు పరివారసమేతుఁడై ప్రయాణమున నలసి సొలసి మిట్ట మధ్యాహ్నమున యెండ కోర్వలేక యొక పెద్దమఱ్ఱిచెట్టుక్రింద పండుకొనెను. సంగునకు వంటయందు నేర్పు కుదురనందున దక్కినవా రందఱు వండుకొనుచుండ నతఁడు వంట మాని యాచెట్టుక్రింద చల్లగఁ బండుకొనెను. అన్నము వండి వాని మిత్రులు దెచ్చునప్పటికి సంగుఁడు కత్తి తలక్రిందఁ బెట్టుకొని గాఢముగ నిదురించెను. ఆమఱ్ఱిచెట్టు తొఱ్ఱలో నుండి యొకమహాసర్పము వచ్చి సంగుని తలవద్ద నిలిచి పడగ విప్పి వానితల కెండ సోకకుండ గొడుగు పట్టినట్లాడుచుండెను. ఆపాము పడగమీఁద చిత్రవర్ణములుగల యొక పక్షి యవ్యక్తమధురముగాఁ గూఁయుచుండెను. ఆసమయమున నొక వెఱ్ఱిగొల్లఁ డా దారినిఁ బోవుచు నిది యేమివింత చెప్పుమా యని నోరు తెరచి రెప్ప వేయక చూచుచుండెను. తక్కిన రాజపుత్రులు వాని దగ్గఱకు రాఁగానే సంగుఁడు మేల్కని కన్నులు దెరచెను. ఆ గొల్లబోయఁడు నేలపైఁ బడి సంగునకు సాష్టాంగనమస్కార మొనర్చి భయ సంభ్రమములతో "భళిభళీ! ఈబాబు గొప్పరాజు కాఁగలఁడు. ఇంత ప్రభువు లోకములో లేడు."

ఆమాటలు విని సంగుఁడు తన రహస్యము వెల్లడిచేయుట కిష్టములేక తాను వట్టి నిరుపేద ననియుఁ దన కట్టియోగము పట్టదనియు వాదించెను. గొల్లబోయండు వాని పలుకులు చెవిఁబెట్టక తనకు పాములయొక్కయు పక్షులయొక్కయు భాషలు తెలియు ననియు నవి రెండు నిద్రఁబోవువానికి మహారాజభోగము పట్టనున్నదని చెప్పుకొన్న వనియుఁ దృఢముగాఁ బలికెను. సంగుఁ డప్పటికిని గొల్లవాని మాటలు కల్లయని నిరసించెను; గాని శ్రీనగరరాజు తనకు బంటై పనిచేయుచున్న రాజకుమారుఁడు నిజముగా బంటులాగుండక పోవుటచే నతఁ డెవ్వరో ప్రచ్ఛన్నవేషుఁ డనినమ్మి వాని జన్మవృత్తాంతాదికము నెఱిఁగింపు మని బలవంతపెట్టి యెఱిఁగించినచోఁ దనకూఁతు నిచ్చి వివాహము చేసి రాజ్యము రావలసియున్న సాయము చేసి యిప్పించెదనని వాగ్దానము చేసెను.

అప్పటికి సంగుని తమ్ముఁడు జయమల్లుఁడు నీచమగుమరణమును బొందెను; కాని పృథివిరాజు మాత్రము మహోన్నతదశలో నుండెను. సంగుఁడు మొదటినుండియు దురదృష్టవంతుఁడే యగుటచే శ్రీనగరరాజు వానినిఁ జేరదీయుట కూఁతు నిచ్చి పెండ్లి చేయుట సాయముచేయఁ దలంచుట మొదలగు వార్తలు కర్ణాకర్ణిగ పృథివిరాజునకుఁ దెలిసినందున నతఁడు తన యన్నగారిని బెబ్బులినిఁ దఱిమినట్లుఁ దఱిమి చంపఁదలఁచె.

అంతలో దైవయోగమున సంగుని ప్రశ్నము బాగుండబట్టి పృథివిరాజు తనచెల్లెలి యాపద గడువఁబెట్టుటకుఁ బోయి తనకు మిక్కిలి ప్రియురాలయిన కమలమీరుకోటకుఁ దిరిగి రాకయె దారుణ మరణము నొందెనని వెనుకటిరాజు చరిత్రలోఁ జెప్పఁబడి యున్నది. పృథివిరాజు గతించిన కొన్నిదినములకు తండ్రి యగు రాయమల్లుఁడు మహా దుఃఖభారముచేత క్రుంగిపోయిన యాదేహము విడిచి పరమపదమును బొందెను. రాయమల్లుఁడు మీవారుదేశమున కంతయెక్కువ యభివృద్ధిని చేలేకపోయినను మును పున్న దానినిఁ జెడగొట్టకుండఁ గాపాడెను. రాయమల్లుఁడు కృపాళువై గౌరవనీయుఁడై రాజపుత్రులయం దుండఁగూడని శాంతరసమునకు స్థానమై యుండెను; కాని కొడుకుల నణంచుకొనలేక పోయెను.

పిదప తదనంతరమున సంగుఁడు వచ్చి సింహాసన మెక్కి చారణీదేవి యర్చకురాలి మాటయు, గొల్లబోయనిమాటయు నిశ్చయములుగాఁ జేసి రణసింహుఁ డను పేరువహించెను. రాజస్థానమునందె గాక యితరదేశములందును గట్టిరాజు గద్దె యెక్కెనని వెల్లడి యయ్యెను. మార్వారు, అంబరు అజమీరు బూందీ గ్వాలియరు కాల్పి మొదలగు రాజపుత్ర సంస్థానములు సంగుని యాజ్ఞను సిరసావహించుచువచ్చెను. మాళవదేశము మొదలు ఆబూయను పర్వతశిఖరమువఱకు నతఁ డేకఛత్రాధిపత్యము వహించెను. రాజ్య మారంభించిన వెనుక నాతఁడు పదునెనిమిది చినచిన్న యుద్ధములు ఢిల్లీచక్రవర్తితోను మాళవరాజుతోను చేసి గెలుపు చేకొనుచువచ్చెను. ఢిల్లీచక్రవర్తిని యొకమారు గాక యనేకమారులు గెలిచెను. మీవారు రాజ్యముయొక్క సరిహద్దు లన్నిప్రక్కలను పెరిగెను. ఉత్తరపు టెల్ల బయానా యనుకోటవద్దనున్న పసుపుటేరు వఱకు వ్యాపించెను. సంగుఁడు మీవారు రాణాలలో నెల్ల నగ్రగణ్యుఁ డగుట కొకకథ గలదు.

ఒకమారు దేవతలలో నొకఁడు మనుష్యావతారమెత్తి తన పూర్వశత్రు వగు నొక మనుష్యునిమీఁద పగదీర్చుకొనుటకు భూమిమీఁదకువచ్చి తిరుగుచు చిత్తూరునకు వచ్చెనట. సంగుఁడు వానిని జూడఁగనే యతఁడు మహాపురుషుఁడని గ్రహించి యాదరించి గౌరవించెనట. ఆదివ్యుఁడు సెలవుపుచ్చుకొని పోవునప్పుడు పటుత్వముగల యొక రక్షరేకు నొకసంచిలోఁ బెట్టి సంగునకిచ్చి దానిని మెడలో గట్టుకొమ్మనియు నది మెడలో నున్నంతకాలము వానికి జయముగలుగుననియు నది పొరబాటునగాని దైవవశమునఁగాని వీపుమీఁదకు దిరిగినపక్షమున వానికి చెడ్డదినములు వచ్చినవని నమ్మవలసినదనియు దృఢముగాఁ జెప్పెనట. తనమాట నిశ్చయమని ఋజువుచేసికొనుటకు దివ్యపురుషుఁడు సంగునకు నెమలియీక నిచ్చి "దీనిని దీసికొనిపోయి మీనగరమునందు మృతినొందిన

వారినందఱితో స్పర్శియింపుము. వారందఱు మరల బ్రతుకుదురు" అని పలికెను. ఆ మాటచొప్పున రాణా చిత్తూరునకువచ్చి కనబడిన ప్రతిశవమున కానెమలీయాకను దగిలింప నామృతకళేబరము ప్రాణవంతమై లేచి నిలుచుచువచ్చె. అంతట దేవుని మాటలు నిజమనినమ్మి సంగుఁడాదివ్యపురుషుని పేర తనయూర నొకయాలయము గట్టించెను. ఆ యాలయము సంగుఁడు పోయినవెనుక చాలకాలము నిలిచియుండెను.

దివ్యపురుషుఁడిచ్చిన రక్షరేఖ రాజపుత్రులమీఁదను మహమ్మదీయులమీఁదను పలుమారు ప్రయోగింపఁబడి యజమానునకు జయము కలిగించుచు వచ్చెను; కాని స్వల్పకాలములోనే మహావీరాధివీరుఁడై మేటిమగల గండడగించి శూరమండలమును గడగడవడకించిన రాజసింహమునకుఁ దనకు వెరపుగలిగింపఁగల సాహసుఁడొకఁడు బయలుదేరుచున్నాఁడని సంగుఁడించుకయు నెఱుఁగఁడయ్యె. అప్పుడు సుల్తాను యిబ్రహీమను నతఁడు ఢిల్లీ చక్రవర్తిగానుండెను. వాని క్రూరత్వము దౌర్జన్యము గర్వము మితిమీరియుండుటచే మంత్రి సామంతాదులు వానితో వేగలేక వానిని విడిచిపోయిరి. దేశమందంతట పితూరీలు బయలుదేరెను. చక్రవర్తి యొకదానిని క్రౌర్యముతో నడప మఱియొకటి తలయెత్తుచుండెను. ఇట్లుండ చక్రవర్తి పినతండ్రి ఢిల్లీమీఁద దండెత్తుమని బేబరును ప్రేరేపించుటకు కాబూలునగరమునకు బోయెను.

ఈ బేబరు మొగలాయివంశస్థుఁడగు మహమ్మదీయుఁడు. ఇతనిపూర్వులు చంగీసుఖాను టామరులేను మొదలగు వారింతకుమున్ను హిందూస్థానముపై దండెత్తి తురకల కందఱకు దారిచూపిరి. బేబరు చిరకాలమునుండి హిందూదేశముపై నెప్పుడు దండెత్తుదునాయని యూటలూరుచు మంచియదనుకై వెదకుచుండెను. అదివఱకతఁడొకసారి పాంచాలదేశముపై దండెత్తెను. ఆదండయాత్రలో నతనికి రాజ్యలాభమంతగా లేకపోయినను వానిసైనికులు పర్వతమయములగు తమగొడ్డుదేశముల నెన్నడెఱుఁగని మహాభోగముల రత్నగర్భమగు హిందూదేశమున ననుభవించుటఁజేసి యాదేశమును వదలిపోఁజాలక దండెత్తుమని తమయజమానుని పురికొల్పిరి. యజమానునియొక్కయు సైనికులయొక్కయు కోరికల కనుగుణముగా ఢిల్లీచక్రవర్తి బంధుగుడు గూడవచ్చి పిలుచుట సంభవించెను. అందుచేత బేబరు దిట్టమయిన సేనంగూర్చుకొని, పర్వతములలోనుండి బయటఁబడి పంజాబుదేశమును గడచి తన్నెదిరింపవచ్చిన సేనల నొకదానివెనుక నొకటి జయించి క్రమక్రమమున ఢిల్లీమీఁదికి వచ్చెను. అట్లు వచ్చివచ్చి పానిపట్టుగ్రామమున లక్షసైన్యముతో యుద్ధమునకు సిద్ధముగానున్న ఢిల్లీచక్రవర్తియగు యిబ్రహింలోడీని గాంచెను. ఇబ్రహీం రణరంగమున మృతినొంది యూన

వాలు పట్టుటకు వీలులేని స్థితిలో పడియుండెను. బేబరు చక్రవర్తియగుటచే మసీదులో
ప్రార్థన లతనిపేరనే జరిగెను.

మహాసేనాసమేతుఁ డగుఢిల్లీచక్రవర్తి కాబూలుప్రభు వగుచిన్నదొరచేతఁ
నోడింపఁబడుట హిందువులకు సంతోషకరముగాదయ్యె. ఏలయన నిద్దరు గోమాంసము
తినువచ్చితురకలె. ఇద్దఱు హిందువుల దేవాలయముల నాశనముచేయు ఘాతుకులె.
వారిరువురిలో నెవరుగెల్చిన వానిని దరిమి కొట్టు భారము రణసింహుండగు మీవారు
రాణావని జనులు చెప్పుకొన్నిరి.

అందుచేత రణమల్లుఁడును తేజోరాశియు నగు సంగమహారాజు బేబరుపైఁ
గత్తిగట్టి కయ్యమునకు వెడలెను. ఆరాజసింహునకు సాయమై యెనుబదివేల గుఱ్ఱపు
దళము నుత్తమవంశజులగు నేడుగురు మహారాజులు రావు బిరుదముగల తొమ్మండుగురు
సామంతులు రావలులు రాహుత్తులను బిరుదులుగల నాయకులు నూటపదునలుగురు
నడుచుచున్న కొండలవంటి యేనుగు లైదువందలును వచ్చి సంగర రంగమున నిలిచె.
ఈసేనం గూర్చుకొని సంగుఁడు మొట్టమొదట బయానా యనునూరికిఁబోయి యచ్చటి
కోటను ముట్టడించెను. ఆముట్టడి జరుగుచున్న కాలముననే సంగుఁడొకనాఁడచ్చటి
పసుపుసేటియేటిలో స్నానము జేయుచుండ గంతమునందలి రక్షరేఖ వెనుకప్రక్కకుం
దిరిగి వీపుపై వ్రేలఁబడియె. అప్పుడు దనమరణ మాసన్నమైన దని యతఁడు తెలిసికొని
తగుప్రయత్నముఁ జేయునప్పటి కంతలో బేబరు బయానాకోటను విడిపింపుమని
పదునైదువందల సైనికులనంపెను; కాని యాసైనికులలోఁ గొందఱు మాత్రమే బ్రతికి
వచ్చి రాజపుత్రవీరుఁడు సామాన్యుఁడు కాడనియు జీతములకొఱకే యుద్ధములుసేయు
ఢిల్లీసైనికులకును రాజపుత్ర సైనికులకును జాలభేదము గలదనియు జెప్పిరి. మీవారు
రాజ్యమున కుత్తరపు సరిహద్దుగా నుండవలయునని సంగుఁడు కాద్వాహయను
గ్రామమున గొప్ప మేడగట్టించెను.

ఆమేడయెదుటనే బేబరు శిబిరము వేయించెను. ఫిరంగుల బండ్లను సరకుల
బండ్లతో గలిపి గోనిసంచులతో గట్టి సేనలో మొదటివరుస నమర్చి వాని వెనుక సేనను
నిలిపెను. ఆబండ్లు చాలనిచోట్ల కాపుదల నిమిత్తము గోతులు త్రవ్వించెను. వాని
ఫిరంగులలో జయఫిరంగి యను పేరనొక ఫిరంగి యుండెను. దానిని ఉస్తాదారా
యను సేనానాయకుఁ డొకఁడే మిక్కిలి నేర్పుతో నుపయోగించుచుండునట. అతని
శక్తియేమో కాని యొక్కొకమా రతఁ డాఫిరంగిని దినమునకు పదియారుసారులైనను
బ్రయోగింపఁ గలిగి యుండెనట. ఆయుద్ధ ముభయకక్షులవారికిఁ గడు బాధకరముగ

యుండెను; కాని పైనుండి చూచినవారికి మిక్కిలి వినోదముగ నుండెను. ఉభయులు నొకరికొకరు తీసిపోవువారు గారు. జన్మమంతయు యుద్ధములయందె గడపి దేశసంరక్షణము నిమిత్తము రక్తము ధారపోసి యుద్ధములలో నొక కన్ను నొక చేయి యొక కాలు పోగొట్టుకొని యెనుబది గాయములచేత తూట్లుపడియున్న శరీరము గలిగి శూరశిఖామణి యను పేరుగాంచిన సంగుఁడొక ప్రక్కనుండెను. పెద్దపులి మీసములైన మెలిపెట్టుటకైన సింగపుజూలు నూడబెరుకుటకైన వెనుక దీయని వారును గయ్యాముల యందు మడమ దిరుగని వారును బ్రతికియుండిన మహాకీర్తిని మృతిపొందిన వీరస్వర్గమును జూరగొనుటకు సిద్ధముగ నున్నవారు నగు రాజపుత్ర వీరుల నేకు లామహారాజు వెనుక బాసటయై నిలిచిరి. వా రందఱు తరతరములనుండి పూర్వులు చేసిన శూరకర్మములఁ దలంచి గర్వోద్దీపితులై యుండిరి. ఆరాజకుమార రత్నములు క్రొత్త పెండ్లికూతులను వరించునట్లు మృత్యుదేవతలను గూడ వరించు విద్యను నేర్చికొని వీరపురుషునకు నంతఃపురమున హంసతూలికాతల్పము శాశ్వతమయిన పాన్పు కాదనియు తమ యాయుధములచేఁ దెగిన పగతుర కళేబరములతో నిండిన యుద్ధభూమియే శాశ్వతమయిన పాన్పనియు నమ్మిన మహాశూరులు.

ఇఁక రెండవప్రక్కనున్న వాఁడో పదునొకండేండ్ల ప్రాయముననే రాజ్యమున కభిషిక్తుఁడైనవాఁడు. పరరాజుల పీడవలన పితృపితామహార్జితమయిన రాజ్యమును గోల్పడి దేశద్రిమ్మరియై చిరకాలము గడపినవాఁడు. అదిమొదలు సమరఖండు నగరమున నతఁడు రెండుసారులు సింహాసన మెక్కి రెండుసారులు దానిని వదలుకోవలసిన వాఁడయ్యు నెప్పటికైన దాని మరల సంపాదించి మఱి చావవలయునని తలంచుచుండువాఁడు. సంగునివలెనే యిల్లు వాకిలి లేక గొడ్లఁగాసికొనియు కొండలవెంబడి తిరిగియుఁ గొంతకాలము పుచ్చి తుట్టతుదకు 'కాబూలు' నగరమును బట్టుకొని దానికిం బ్రభువులై యంతకన్న మంచిదేశమును స్వాధీనము చేసికొనుటకై యదను వెదకుచున్నవాఁడు. ఈ యుద్ధమునాఁటికైన నతఁడు నడివయస్సును దాఁటినవాఁడు గాక మంచి శరీరదార్ఢ్యము గలిగి శత్రుదుర్నిరీక్షుఁడై వెలయుచుండెను. బలముగల మనుష్యుల నిద్దఱను చెరియొక చంకఁ బెట్టుకొని కోట గోడలపైఁ బరుగెత్తుటకును వానికి సామర్థ్యము గలదు. అతఁ డెప్పుడు గుఱ్ఱపుజీనుమీఁదనే కాపురము చేసినవాఁ డని చెప్పవచ్చును. మార్గమధ్యమున నడ్డమువచ్చిన ప్రతి నదిని నతఁడు నిండుపరదలోనైన ననాయాసముగా నీదుకొని పోవునే గాని దోనెలనైన నెక్కువాఁడు కాడు. అంతటి శూరాగ్రేసరుఁడయ్యు బాబరు పారశీకభాషలో మృదువయిన కవిత్వము చెప్పఁగల రసికుఁడు.

అతనికి స్వమతాభిమాన మెక్కుడుగ నున్నది గాని యీ మతాభినివేశము చేత శత్రు రాజులయందు మంచిగుణము లేవైన నున్నవానిని మఱచిపోక వానిని మెచ్చుకొనుచు నతఁడు వ్రాసిన గ్రంథములలో నెక్కు డౌదార్యమును జూపుచువచ్చెను.

రాణాసంగున కింతకంటె సుగుణవంతుఁడు నింతకంటె పౌరుషశాలియగు శత్రువుం డెన్నఁడు దొరకియుండలేదు. రెండు తెగలవారి కది మంచియుద్ధమే. రాజపుత్రులంపటు తమ దేవాలయముల నెల్ల నేలమట్టముగ జేసి దేవతావిగ్రహముల, బగులఁగొట్టి పాడుచేసిన మ్లేచ్ఛులను తమ కులదేవతయగు భవానిమాత తప్పక యడచి తమకు జయమును గలిగించునని నమ్మి ధైర్యముగ నుండిరి. మొగలాయీలు విగ్రహారాధనము చేయు పాపాత్ములను హిందువుల సంహరించుటకుఁ దోడ్పడుమని అల్లాను బ్రార్థించిరి. ఈ రాజపుత్ర మొగలాయి ప్రభువులు తక్కిన గుణములలో సమానులైనను కైఫునకు నల్లమందు మద్దతు బీల్చుటలో గూడ సమానులే. పదునైదు దినములవఱకు రెండు సైన్యములు యుద్ధ మారంభింపక నొకదాని నొకటి చూచుకొనుచు నేది ముందుగాఁ గయ్యమునకు దిగిన నేమి ప్రమాద మగునో యని శంకించుచు నూరకొనిరి. బేబరు సైనికులు కొంతవఱకు నిరుత్సాహులై యుండిరి. ఏలయనఁ వారు తమ యాలుబిడ్డలను గృహములను బాసి చిరకాల మగుటచే నిండ్లపై దృష్టులు బార మిడిమిడి యెండలు గాయు హిందూదేశపు బయళ్లను విడచి తమకొండ గేహముల కెప్పుడు పోవుదుమా యని బెంగగొని స్వదేశమునకుఁ దోడ్కొని పొమ్మని బేబరును బలవంతపెట్టిరి. వెనుక బేబరు పంపిన పదునైదువందల సైనికులలో హతశేషులు వచ్చి సంగుని సైనికుల శౌర్యము విన్న గడగడ వడకునట్లు తక్కినవారిని భయపెట్టిరి. తురక శిబిరమున నంటివచ్చిన జ్యోతిష్కుఁ డెప్పుడు చెప్పినను నీచదశ నే గాని యుచ్చదశను జెప్పరైరి. అంగారకుఁ డప్పుడు పడమట నున్నందున వాని కెదుట దిక్కుననుండి యుద్ధముచేయువారికి తప్పక యపజయము కలుగునని వారు నొక్కి పలికిరి.

ఆ రెండువారములలోను రాణాయును ఢిల్లీ చక్రవర్తికిని సంధి మాటలు జరిగిన వని రాజపుత్రచరిత్రకారులు కొందఱు వ్రాసిరి. బేబరు తాను విదేశములలో పంచాగ్నిమధ్యమువంటి శత్రుమండలమధ్యమున నొంటిగ నుండుట యెఱుంగును. ఈయుద్ధములో తన కపజయము సంభవించె నా పగతురు నలువురు నాలుగుమూలలనుండి వచ్చి తన్ను చుట్టుకొందురనియు నప్పుడు తాను కష్టపడి సంపాదించిన ఢిల్లీ రాజ్యము చేయిదాటి పోవుటయే గాక స్వస్థానమైన కాబూలునైన చేరుట సంభవింపదనియుఁ గూడ నతఁ

డెఱుఁగును. రాణాసంగుఁడు చాకచక్యము గలవాఁడు వివేకియునై మీవారురాజ్యము నిమిత్తము స్వసౌఖ్యమును గణియింపక పాటుపడుచున్నవాఁ డని యతఁడు విని యుండెను. అందుచే రాజపుత్ర చరిత్రకారులు చెప్పిన ట్లుభయులు సంధి ప్రయత్నము చేసి యుందురనియే మనము నమ్మవచ్చును. ఆయొడంబడికలో బేబరుకోరిన పద్ధతులన్నియు రాణా కవమానకరములు గానివియు నతఁడు తప్పక యంగీకరింపఁ దగినవియునై యుండెను.

పద్ధతులివి. 1. వసపునీటియేఱు మీవారు రాజ్యమున కుత్తరపు టెల్లగా నుండవలయును. 2. బేబరు ఢిల్లీ రాజ్యము నాక్రమించినందుకు రాణావారి కేఁటేట కొంత కప్పము నిచ్చుచుండవలయును. కానియిట్లు సంధినిగురించిమాటలుజరుగుచుండ సంగుఁడు బేబరువద్దకుఁ బంపిన రాయబారి తురకలవద్ద లంచము గ్రహించి నీచుఁడై తనయజమానుని గుట్టు బయలుపెట్టె నని రాజపుత్రులలో నొకవాడుక కలదు. ఆరాజద్రోహి తారా వంశస్థుఁ డగు శిలాదేవుఁ డనువాఁడు. బేబరు పలుమారు తాను జేసిన తప్పులను గూర్చి నిజమయిన పశ్చాత్తాపమును బడుచువచ్చెను. దాని కుదాహరణముగ నొక చిన్నకథ గలదు.

అతఁడదివఱకు మద్యపానము విశేషముగాఁ జేసెడు వాడుకఁ గలదు. అదిపాప మనియు నాకారణంబున భగవంతునకుఁ దనపై నాగ్రహంబు వొడముననియుఁ దెలిసికొని యతఁ డాదినము మొదలు సారాయములను ద్రాగనని గొప్పయొట్టు పెట్టుకొని యంతకాలమును సారాత్రాగను వెండి బంగారు గిన్నెలు పళ్లెములు ముక్కముక్కలుగా పగులఁగొట్టి యాముక్కలను ఫకీరులకు బీదలకు పంచిపెట్టెను. అంతతో తనివి సనక యతఁడు గూనలతో నున్న సారా నంతయు నేలఁ బారఁబోయించి యాదినమునఁ దనకు జయము లభించినపక్షమున మహమ్మదీయులవద్దనుండి తాను గ్రహించుచున్న దస్తావేజు పన్ను కొట్టివేయుదునని ప్రమాణము చేసెను. మాటలతోఁ బోవక కార్యము చేసి చూపిన తన చక్రవర్తియొక్క మార్గము ననుసరించి సేనాపతులు సామంతులు ఉమ్రావులు అమీరులు మొదలగువారు మున్నూఱుమంది యొక్క దినము లోపుగ త్రాగమని శపథము చేసి త్రాగుబోతుతనమును మాని పవిత్రు లయిరి. ఇట్లు జరిగినపిదప బేబరు విచారగ్రస్థులయిన సైనికులను సేనాపతులను బిలచి వారికి మహావేశము గలిగించి కయ్యమునకుఁ బురికొల్పవలయునని తలంచి యిట్లని విజ్ఞాపనము చేసెను.

“ఓవీరులారా! ఈప్రపంచమునఁ బుట్టినవాఁడు గిట్టకమానఁడు. ఎప్పుడో యొకప్పు డీలోకమును విడువక తప్పదు. బ్రతికియుండి పరాభవములు పొందుటకంటె చచ్చి

గౌరవమునుండుట మేలు. నేను చచ్చినను సరే మంచిపేరుతో చనిపోయితినా చాలును. భగవంతుఁడు దయామయుఁడు. మనమిందు గడతేరితిమా మతముకొఱకు మృతినొందిన శూరుల మగుదుము. గెలిచితిమా దేవుని మెప్పించినవార మగుదుము. కాఁబట్టి మనము మరణమునకు జంకమనియు యుద్ధభూమినుండి వెనుకంజ యిడమనియు నొకమారు ప్రమాణములు చేయుదము."

ఆపలుకులు విన్నవారి కండలను పౌరుషము నుక్కెక్కించి సైనికు లందఱు తమవేద మగుఖురాను జేతఁబట్టుకొని యుద్ధము గెలువవలయు లేక చావవలయు నని ప్రమాణములు చేసిరి. ఒడలిలో నూపిరిలేనివాఁడు సయితము మహావేశముచేత పరవశత్వమునొంది ప్రాణములపై నభిమానము వదలుకొని మూఁకలు కలను దేరిన పగతురం బొడుచుటకు సిద్ధముగ నుండెను. అంతట శత్రువుల పయింబడుటకు వా రేర్పాటు చేసికొన్నందున మొదలు తీరినవెనుక బేబరు గుఱ్ఱము నెక్కి సైనికుల కుత్సాహము గలిగించుచు సేనాపతులకు నడచుకొనవలసిన పద్ధతులను గరపుచుఁ గొంతసేపు దిరిగెను.

1527వ సంవత్సరము మార్చి 27వ తేదీ శనివారమునాఁడు రాజస్థానముయొక్క భాగ్యమెట్లున్నదో నిర్ణయించెడు యుద్ధము జరిగెను. రక్షరేఖ మఱియొకలాగైపోయినను మొట్టమొదట జయ మెప్పటియట్లు రాణాసంగున కేయగునని యెల్లరు భావించిరి. బేబరుచక్రవర్తియొక్క సైన్య మదివఱ కెన్నఁడు రాజపుత్రవీరుల పోటు చవిచూచి యెఱుఁగదు. నల్లమందు మత్తుతో కన్ను లెఱ్ఱఁబడ రాజపుత్రయోధులు శత్రువుల పయిఁబడి కత్తులను బల్లెములను రక్తములో ముంచియెత్తుచు వీరవిహారము చేయ నారంభింప, దిట్టతనమునకు ప్రసిద్ధికెక్కిన కరకుతురక లేమియుం జేయలేక యూరకొనవలసివచ్చెను. పూర్వ మెన్నెన్ని యుద్ధములలోనో వైరుల యెదిరిపాటుల నడంచిన బేబరుయొక్క జయఫిరంగులైన రాజపుత్రుల నించుక యదుపులో నుంచఁజాలదయ్యె. ఆ సమయము నెఱిఁగి బేబరు మంచియుపాయము నాలోచించి తనసేనలోఁ గొంత భాగమును గుండ్రఁగా దిరిగివచ్చి రాజపుత్రుల జుట్టుకొమ్మని యానతిచ్చి ఫిరంగులను ముందునకు జరిపించి మూలబలమునకు తుపాకులిచ్చి ముందునడిపించి బాణవర్షమును నిప్పులవర్షమును గురిపింప నారంభించెను. అప్పుడు రాజపుత్రసైన్యములో నొకభాగమున కధిపతియైన శిలాదేవుఁ డనునతఁడు రాజద్రోహము సేయఁదలంచి సంధి రాయఁ జేసికొని తనసేనతో బయలుదేరివచ్చి శత్రుపక్షమునఁ జేరెను.

పగతుర సేనవచ్చి యాకస్మికముగ వెనుక దాకుటచేతను స్వజనము మోసపుచ్చుటచేతను, తురకలు పట్టినపట్టు విడువక పోవుటచేతను రాజపుత్రసేన యెట్ట

కోలకు కట్టుచెడి విరిగి పారిపోవవలసివచ్చెను. మహమ్మదీయులు రాజపుత్రసేన నొక్క మూలకుందరిమి ఫిరంగులు బారుచేసి కొట్టఁజొచ్చిరి. అందుచే దాదాపుగ సంపఱు హతులయిరి. కొంద ఱెట్లెటో దెబ్బలు తప్పించుకొని పాఱిపోఁగలిగిరి. వారిలో రాణా యొకఁడు. ఆరణమునఁ దగిలిన గాయములచేత రాణా కుంటియగుటచే రణరంగమున-నుండి పారిపోవుట కతని కిష్టములేకున్నను సేవకులే యతనిని మోసికొనిపోయి యుపాయమునముండి దాటించిరి. కాని యనేకులు యుద్ధభూమినుండి విడువక ప్రాణములు విడిచిరి. అట్టివారిలో చంద్రావంశస్థుఁ డగు రాజపుత్ర వీరుఁడొకఁడు మహాశూరు లగు మూఁడువందలమంది చుట్టములతో మృతిపొంది రాణావారికి తొల్లి రాజ్యము సేయు నప్పు డాలోచనలు చెప్పుటలో నెట్లు ప్రథమగణ్యుఁడయ్యెనో వారినిమిత్తము ప్రాణములు విడుచుటలో నట్లే ప్రథమగణ్యుఁడయ్యెను. అతనికి సాయమై మార్వారు రాజకుమారుఁడు మఱి యిరువదిమంది రాజకుమారులతోఁగూడి నేలంబడియుండె. ఈయుద్ధము జరిగిన తావునకు సమీపమునందే బేబరు రణనిహతులైన రాజపుత్ర శూరుల పుఱ్ఱెలతో నొక జయస్తంభమును గట్టించెను.

ఇట్లు సంపూర్ణ పరాజయమునొంది కూరుచున్నచోటునుండి కదలలేని పంటి యయ్యు రాణాసంగుఁడు శౌర్య గాంభీర్యములయందు సింహమువలె మెలఁగజొచ్చెను. తలుపులు వేసికొని చిత్తూరుకోటలో దాగికొనుట కతని కిష్టములేక కోటతలుపు లెప్పుడు తెఱచియుండవలసినదని యానతిచ్చి తా నెప్పటికైన శత్రువులనుజయించి జయజయ ధ్వనులతోఁ గోటలోఁ బ్రవేశింతునని చెప్పుచువచ్చె. ఈపరాజయమువలన గలిగిన పరాభవమును బోఁగొట్టుకొనువఱకు యుద్ధభూమిలో నొకగుడారము వేసికొని యదియె యిల్లుగా నతఁ డుండెనఁట. అదివఱకు యుద్ధములో మృతిపొందిన రాజపుత్రశూరుల యొక్క భార్యలు సేనలం బోగుచేసి ఢిల్లీచక్రవర్తిమీఁదికిఁ జనుమని రాణాకు సమర్పించిరి గాని పరాజయమునొందిన యొక్క సంవత్సరములోనే యతఁడు పరలోకగతుఁడగుటచే నా సేనలం గూర్చుకొని తురకలతో పోరునంతటి భాగ్య మతనికి బట్టదయ్యె.

సంగుఁడు విషముదినిచచ్చెనని కొందఱందురు; కాని యది నిజముకాదు. చిన్నతనమునుండియు నిల్లువిడిచి తిరిగి యతఁడు పడిన కష్టములను మహాయుద్ధముల యందు దగిలిన యెనుబదిగాయములను విశేషించి 'కన్వాహ' దగ్గరజరిగిన యుద్ధమును విషముకంటె నెక్కుడు తీక్ష్ణములై వాని కకాలమరణమును గలిగించెను. మీవారు రాజ్యమును పాలించిన రాణాలలో సంగుఁడు మహాప్రతాపశాలి. అందుచేత నతఁడే యందఱికన్న గొప్పవాఁడని యప్పుడప్పుడు కొందఱనుచుందురు. అతనివెనుక సింహాస

నమునకు వచ్చిన వానివంశస్థులు సంగునివలె దృఢచిత్తులై చరించినచో చిత్తూరునకు దీనదశ రాకయుండును.

సంగుని చరిత్రము సమగ్రముగాఁ జెప్పఁబడినది గావున నింక నతనివైరి యగు బేబరుచరిత్రము నించుక చెప్పవలసియున్నది. ఇతఁడు మొగలాయివంశస్థుఁడు. ఈతని పూర్వుఁ డగుచంగిసుఖానుఁడు ఆసియా యూరోపు ఖండములరెండును దండెత్తి బహు దేశములను మిడుతలదండువంటి తురకసేనలతో నింపి రక్తప్రవాహములు ప్రవహింపఁజేసి యానాటి మానవజాతినంతను గడగడ వడకించిన చండశాసనుఁడు. అతఁడు పదమూడవ శతాబ్దముయొక్క ప్రారంభమున హిందూదేశముపై దండెత్తి సింధునదికి పడమటనున్న భూముల నాక్రమించి యెందుచేతనో మనదేశమున నిలువక స్వస్థానమునకుఁబోయె. వానితరువాత వానివంశస్థుఁడును వానికంటెం గ్రూరుఁడు నగుతామరలేను 1399 సంవత్సరమున హిందూదేశముపై దండెత్తివచ్చెను. ఈతని కాలొకటి కుంటిగ నుండెను. సహజముగ దుర్బలుఁడయ్యు నితఁడు మెచ్చఁదగిన మనోబలముచే మొగలాయిలకెల్ల ప్రభువై తార్తారు దేశముననున్న సమర్కందు నగరమున సింహాసనమెక్కి యనేక దేశముల జయించెను. బేబరు తామరలేనున కాఱవతరమువాఁడు. ఇతఁడు తన వంశస్థులవలె ప్రతాపవంతుఁడేకాని వారివలె నిష్కారణముగా మానవజాతిని నిర్మూలించునట్టి క్రూరుఁడు కాఁడు. ఇతని తలిదండ్రులు చిన్నతనమందె మృతినొందుటంజేసి బాల్యమునందె సింహాసనస్థుఁడై పలుమారు రాజ్యభ్రష్టుఁడై యనేక స్థలములయందు క్రొత్తరాజ్యములు స్థాపించి యెట్టకేలకు హిందూస్థానముపై దండువిడిసి ఢిల్లీచక్రవర్తి యయ్యెను. ఇతఁడు ప్రతాపవంతుఁ డగుటయేగాక పారసీకభాషలో మంచి కవనముఁ గూడఁ జెప్పగల సమర్థుఁడు. ఇతఁడు హిందూదేశమును జయించినాడన్న మాటయే గాని జయించినపిదప పట్టుమని పదికాలములపాటు దేశము నేలలేదు. అతఁడు 1526 సంవత్సరమున చక్రవర్తియై 1530 సంవత్సరమున మృతినొందెను. ఆ నాలుగు సంవత్సరములైనను మనస్థిమితములేక యుద్ధములలోనే గడపవలసివచ్చెను. ఇతని మరణమునుగూర్చి యొకచిత్రకథగలదు. ఆతని పెద్దకుమారునకు జబ్బుచేసి ప్రాణము మీఁదికి వచ్చెనఁట. కుమారునియందు బేబరుకు మితిమీరిన ప్రేమయుండుటచే దన కొడుకును రోగవిముక్తునిజేసి తనకాజబ్బు దెప్పింపుమని భగవంతుని ప్రార్థించెనఁట. అతఁడు ప్రార్థించినట్టుగానే క్రమక్రమముగా హుమాయూనున కారోగ్యము గలుగుటయు బేబరుజబ్బుపడి మృతినొందుటయు సంభవించెను. ఢిల్లీపాలించిన మొగలాయి చక్రవర్తుల కితఁడే మూలపురుషుఁడు.

# కృష్ణదాస్ పాలు.

హిందూదేశమున వార్తాపత్రిక కధిపతియైయుండి మహాప్రఖ్యాతి గాంచిన పురుషు లలో నితఁ డగ్రగణ్యుఁడు. ఇతఁడు 1838వ సంవత్సరమున జన్మమొందెను. అతనితండ్రి యగు నీశ్వరచంద్రపాలుఁడు మిక్కిలి బీదవాఁడు. కృష్ణదాసు మొట్టమొదట నొక పాఠశాలలోఁ బ్రవేశించి యచ్చట బంగాళాభాషను జదివి యాభాషలో నతనికిఁ గల ప్రవీణతకు నొక వెండి పతకమును బహుమానముగఁ బడసెను. అతఁడు పదేండ్ల ప్రాయము గలవాఁ డయినప్పు డింగ్లీషుఁ జదువ నారంభించి 1853వ సంవత్సరమున నా యింగ్లీషు పాఠశాలను విడిచెను. బడిమానిన వెనుక కృష్ణదాసుపాలుఁడు కొన్నినాళ్ళు క్రైస్తవ మత బోధకుఁడై కలకత్తాలోనున్న రివరెండుమిన్నిదొరగారివద్ద విద్య నభ్యసించెను. అనంతర మతఁడు కలకత్తాలో విద్యావిషయము లగుచర్చలను స్వేచ్ఛగా జరుపుటకు స్థాపింపఁబడిన యొకసమాజములో జేరి యచ్చట రివరెండు మార్గన్ దొరగారు మొదలగు గొప్పవారు చేయు నుపన్యాసములను విని యందువలనఁ గలిగిన లాభముల నొందుచువచ్చెను.

1854వ సంవత్సరమున నతఁడు మరలఁ జదువఁ దలఁచి రాజేంద్రదత్తుగారిచే స్థాపింపఁబడిన హిందూమెట్రాపాలిటన్ కాలేజీ యను కళాశాలలోఁ జేరి యచ్చట మూఁడు సంవత్సరములవఱకుఁ జదివెను. విద్యార్థిగా నున్ననాఁడు మొదలుకొని యతనికి రాజకీయ వ్యవహారములయందు మిక్కిలి యభిమానము. అతఁడు వ్రాసిన వ్రాతలు నతఁ డిచ్చిన యుపన్యాసములు చూడ నంత చిన్నవయసువాని కింతశక్తి యెట్లు గలిగెనా యనితోఁచును. పెద్ద లెవరితోనైనఁ దనకభిప్రాయభేదములు కలిగినప్పుడు మొగమోటము చేత నూరకొనక తన యభిప్రాయము నిర్భయముగఁ జెప్పు ధైర్య మతనియొద్ద నుండెను. అంతధైర్య ముండుటచేతనే యొకమా రతఁడు బంగాళాదేశమం దంతట ప్రసిద్ధికెక్కిన మహాపండితుఁడు డాక్టరు డఫ్‌దొరగారి మాటలనే ఖండించి పూర్వపక్షము చేసెను. ఆకాలమున బంగాళా శ్రీమంతుడు జార్జితాంసన్ అనుదొర గలఁడు. ఆయన రాజకీయ వ్యవహారములను గూర్చి దిట్టమైన యుపన్యాసముల నియ్యఁదొడఁగెను. అతఁడు వాగ్ధాటికి ప్రసిద్ధికెక్కెను. ఆదొరగారిని కృష్ణదాసుపాలుఁ డొకనాఁడు తనసమాజములో జరుగు నొకసభకు నధ్యక్షుఁడుగా నుండుమని పిలిచెను. ఆదొరగారు విద్యావిషయము

లగు చర్చలను జేయునట్టి చిన్న సమాజములలోఁ దనవంటివాఁ డుపన్యసింపఁ దగఁడనియు, విశేషించి తన రాజకీయవ్యవహారములనుగూర్చియే కాని యితరవిషయములనుగూర్చి యుపన్యసింప ననియుఁ జెప్పి హిందూ పేట్రియే టనువార్తాపత్రికను దీసి చూపి యీపత్రికాధిపతియొక్కఁడే హిందువులలో రాజకీయవిషయములనుగూర్చి గ్రహింపఁగలసమర్థుఁ డనియుఁ దక్కినవారికిఁ జెప్పినను దెలియదనియు గర్వోక్తిగాఁ బలికెను. ఆమాటలు విని కృష్ణదాసాదినము మొదలుకొని తానుగూడ హరిశ్చంద్రముకర్జియంతవాఁడు కావలయునని నిశ్చయించుకొనెను. అది మొద లతఁడు పేట్రియేటు పత్రికను తప్పక చదువుచునచ్చెను. అతఁడు కడుబీదవాఁ డగుటచే పత్రిక తెప్పించుకొనుటకు ధనము లేక సమాజకార్యదర్శి నడిగి తెచ్చుకొని చదువవలసివచ్చె. ఈపత్రిక గాక యింగ్లీషు భాషలో ప్రకటింపఁబడు నితరపత్రికలనుగూడఁ జదువుచు వానికప్పుడప్పుడు తనకుఁ దోఁచిన సంగతులను వ్రాసి పంపుచు నితరగోష్ఠిని విడిచి యతఁడు విద్యాగోష్ఠియందే కాలము పుచ్చుచుండెను.

అతఁడు హిందూపేట్రియేటు పత్రికకుఁగూడ కొన్నిసంగతులు వ్రాసి పంపెను. తాను వ్రాసినవ్రాత యాపత్రికలో ప్రకటింపఁబడినప్పుడు వానికిఁ గలిగిన యానంద మింతింతయని చెప్ప నలవి గాదు. కళాశాలలో విద్యాభ్యాసము ముగించిన వెనుక కృష్ణదాసు జిల్లాజడ్జిగారి కచ్చేరిలో ట్రాన్సులేటరు (అనఁగా ఇంగ్లీషునుండి స్వభాషకును స్వభాషనుండి యింగ్లీషునకును తర్జుమాచేయు నుద్యోగస్థుఁడు)గా నియమింపఁబడెను. కొన్నిదినము లతఁడు పనిచేసినవెనుక కృష్ణదాసుఁ డాయుద్యోగమునకుఁ దగఁడని జిల్లాజడ్జి వానిని తీసివేసెను. తరువాత సర్ విలియం గ్రే దొరగారు వానికి మంచి యుద్యోగము నొకటి యిచ్చిరి గాని యతఁ డందుఁ బ్రవేశింపఁడయ్యె. అతఁడు గ్రంథములు వార్తాపత్రికలు మితిమీఱునట్లు మిక్కిలి యాసక్తితోఁ జదివి యెక్కువప్రజ్ఞఁ గలవాఁ డైనను వాని దారిద్ర్యము తెలివితేటలను పైకి రానీయక యణచిపెట్టెను. తాను చేరియున్న సమాజమునకు నెలనెలకియ్యవలసిన చందానైన నతఁ డియ్యలేక పోవుటచే సమాజమువారు వానిం గరుణించి నెల చందా నియ్య నక్కరలేకుండఁ జేసిరి. ఆకాలమునం దతని యవస్థ నెఱిఁగిన యతనిమిత్రుఁ డొకఁడు వానింగూర్చి యిట్లు వ్రాసియున్నాఁడు. కృష్ణదాసుఁడు కలకత్తాలో మారుమూలసందులో కూలిపోవుచున్న యొక పాడుకొంప యరుగుమీఁద చింకిచాపమీఁద గూరుచుండి పైచిల్లులలోనుండి సూర్యకిరణములు శరీరమునఁ దగులుచున్నను లెక్కసేయక పుస్తకములఁ జదువుకొనుచు పత్రికలకు వృత్తాంతములు వ్రాయుచుఁ జాలసారులు గనఁబడిరి. అతఁడు పేదయయ్యు నున్నతస్థితికి వచ్చుటకు మిక్కిలి పాటుపడిరి.

1857వ సంవత్సరమున నతఁడు కొందఱు స్నేహితుల సహాయమునఁ గలకత్తాలో నొకమాసపత్రికను బ్రకటింపఁజొచ్చెను; కాని వాని దారిద్ర్యదోషమున నది యారుమాసములకే యంతరించెను. కాన్పూరునగరమున సెంట్రల్ స్టార్ (మధ్యనక్షత్రము అని యర్థము) అను నింగ్లీషుపత్రిక యొకటి బయలుదేర కృష్ణదాసుఁడు దాని నుపవిలేఖకుఁడుగా నుండి కలకత్తానుండియే వ్రాయుచునుండెను. అప్పుడప్పుడు హిందూపేట్రియాట్ పత్రికకుఁగూడ నతఁడు సంగతులను వ్రాసి పంపుటఁ గలదు. గనుక 1857వ సంవత్సరమున హిందూదేశమున బయలుదేరిన సిపాయి పితూరీని గురించి యనేక సంగతుల నతఁడు వ్రాసి పంప నాపత్రికాధిపతి యగుహరిశ్చంద్రముకర్జీ వానివ్రాతనేర్పును జూచి దైవానుగ్రహమున నతఁడు చిరకాలము బ్రతికియుండె నా దేశమునకుమహోపకారముగలుగఁగలదని తెలిసుకొనెను.

పత్రికలకు వృత్తాంతములు వ్రాయుటయేగాక బంగాళాదేశ బాలికల యోగ్యతాస్థాపన యనునంశమునుగూర్చియు నీలిమందువ్యవసాయమును గూర్చియు మఱికొన్ని యంశములఁగూర్చియు నతఁడు చిన్నచిన్నగ్రంథముల వ్రాసెను. ఇందు మొదటి యుపన్యాసము కలకత్తా స్మాల్ కాజుకోర్టు జడ్జీగా రగుహరిశ్చంద్రఘోషుగారి కంకితముచేయఁబడినందున నతఁడే కావలసినధన మిచ్చి దానిని ముద్రింపించెను. ఆయుపన్యాసము బంగాళాదేశస్థుల మనస్సుల నాకర్షించుటచే నది మిక్కిలి బాగున్నదని కొన్నిపత్రికలును బాగులేదని కొన్నిపత్రికలును విమర్శింప నారంభించెను. తరువాత నాయుపన్యాసము వ్రాసిన యతఁడు 19 సంవత్సరముల వయస్సుగల విద్యార్థి యని వార్తాపత్రికలమూలమునఁ దేటపడినప్పుడు జనులందఱు నాశ్చర్యమును నొందిరి. 1860వ సంత్సరమున హిందూపేట్రియేటు పత్రికాధిపతి యగుహరిశ్చంద్రముకర్జీ మృతినొందెను. అతని వెనుక నాపత్రిక యనేకుల చేతులలోఁ బడి తిన్నగ జరుపబడక యొట్టకేలకు కృష్ణదాసుపాలుని యధీన మయ్యెను. హిందూపేట్రియాట్ అనఁగా హిందూదేశాభిమాని యని యర్థము. ఆపత్రిక కృష్ణదాసుపాలు నాధిపత్యమునందు హిందువులచేఁ బ్రకటింపఁబడునన్ని పత్రికలకంటె నెక్కువపేరు నెక్కువచందాదారుల సంఖ్య గలదై వర్ధిల్లెను. హరిశ్చంద్రముకర్జీ చనిపోవుటతోడనే కృష్ణదాసు బ్రిటిషు యిండియన్ సంఘమునకు సహాయకార్యదర్శియై పిమ్మటఁ గొంతకాలమునకు ముఖ్యకార్యదర్శి యయ్యెను. హిందువులచే బ్రకటింపఁబడు పత్రికలలో బ్రధాన మగుదాని కధిపతియగుటచేతను గొప్పసంఘమునకు కార్యదర్శి యగుటచేతను కృష్ణదాసపాలుఁడు కొలఁదికాలములోనే యున్నతస్థితికి లేచెను.

1863వ సంవత్సరమున నతఁడు మునిసిపల్ కమీషనరుగా నేర్పరుపఁబడెను.

1872వ సంవత్సరమున నతఁడు బంగాళాదేశపు శాసననిర్మాణసభకు సభ్యుఁడుగా దొరతనమువారివలన నియమింపఁబడెను. 1877వ సంవత్సరమున శ్రీ విక్టోరియా రాణిగారు చక్రవర్తినీ బిరుదము వహించినప్పుడు ఢిల్లీనగరమున జరగిన గొప్పదర్బారులో కృష్ణదాసుపాలునకు దొరతనమువారు రావుబహద్దరు బిరుదము నిచ్చిరి. మరుచటి సంవత్సరమున నతనికి సి. ఐ. యి యను బిరుదమువచ్చెను. 1883 సంవత్సరమునం దాయన బ్రిటిషు యిండియన్ సంఘమువారిచేత గవర్నరుజనరల్ గారి శాసననిర్మాణసభకు సభ్యుఁడుగా పంపఁబడెను. ఈయుద్యోగము లన్నిఁటిలోను కృష్ణదాసుపాలుఁడు మిక్కిలి పాటుపడి మంచిపేరు సంపాదించెను. కొంతకాలము దీర్ఘవ్యాధిచే పీడింపఁబడి 1884వ సంవత్సరము జూలై 24వ తేదీని మృతినొందెను. పత్రికాధిపతిగా నున్నకాలమున విమర్శనము లెట్లయిన చేయవలసివచ్చినప్పు డతఁడు పక్షపాతము లేక మర్యాద నతిక్రమింపక చేయుచువచ్చె. అట్లున్నను వానికొకసారి యధికారులతో వివాదము రాకతప్పినదిగాదు.

1863వ సంవత్సరమున బంగాళాదేశమునకు గవర్నరుగానున్న సర్ సిసిల్ బీడెన్ దొరగారు కృష్ణదాసుపాలుఁ డప్పటికరువునుగురించి తనపత్రికలో వ్రాసిన కొన్నిసంగతులకు బహిరంగమైన సభలో ప్రత్యుత్తరములు చెప్పిరి. 1874వ సంవత్సరమున నప్పటి గవర్నరగు సర్ జార్జికేంబెల్ దొరగారు హిందూపేట్రియేటు దొరతనమువారియెడల ననిష్టముగల పత్రికయని స్పష్టముగా వ్రాసిరి. అందుకు కృష్ణదాసు ఊరకొనక తగిన ప్రత్యుత్తరము వ్రాసిపంపెను. ఇట్లొకరిద్దరధికారులు పత్రికపై నలుకబూనినను క్రమక్రమంబున దొరతనమువా రాపత్రికపై నభిమానము వహించి హిందువుల యభిప్రాయము తెలుసుకొనుటకు తత్పత్రికయే ముఖ్యాధారమని యెంచిరి. కృష్ణదాసుఁడు గట్టిసామర్థ్యముతో పత్రిక నిరువదిమూఁడు సంవత్సరములు నడపెను. గవర్నరుజనరలుగారి యాలోచనసభలో సభ్యుఁడుగా నుండిన యిల్బర్టు దొరగారు కృష్ణదాసుపాలుని పత్రికాధిపత్యమును గూర్చి యొకసారి యిట్లుచెప్పిరి. "తనతోటి పాఠశాలలో విద్యార్థులుగానుండునట్టి యీడున నే దేశమందు పురాతనమైనపత్రిక కధిపతియై కృష్ణదాసుపాలుఁడు సర్వతోముఖమగు పాండిత్యముచేతను మిక్కిలిశాంతముచేతను నిష్పక్షపాత బుద్ధిచేతను 23 సంవత్సరములు పాటుపడి దక్షతలేక యణఁగిపోవుటకుసిద్ధముగానున్న పత్రికను మంచి యున్నతస్థితిలోనికిఁ దెచ్చెను." ఆనాఁటి హిందువులలో నెవరికి నింగ్లిషుభాషయొక్క మర్మము కృష్ణదాసుపాలునకు దెలిసినంతగాఁ దెలియదని జనులయభిప్రాయము. కలకత్తారివ్యూ యనుపత్రికయొక్క యధిపతి కృష్ణదాసుని

గురించి యిట్లు వ్రాసెను. "స్వచ్ఛమై మృదువై మనోహరమైన యింగ్లీషు వ్రాయను మాటలాడను నేర్చిన ప్రాచీనహిందువుల తెగ కృష్ణదాసుపాలునితో నంతరించినది. ఉపన్యాసము లిచ్చుటలోను వెనుదీయక వాదించుటలోను యితనికి మిక్కిలి సామర్థ్యము కలదు. హిందువు లనేకు లింగ్లీషుభాషను చక్కఁగ మాటలాడఁ గలరు; కాని సందర్భసిద్ధియందును భాషాసౌష్టవమునందును హేతుకల్పమునందును కృష్ణదాసపాలునివంటి వారు మిక్కిలి తక్కువగా నున్నారు. ఇంగ్లాండులోనే పుట్టిపెరిగి యింగ్లీషునే స్వభాషగా నభ్యసించిన పెక్కుదొరలకంటె కృష్ణదాసపాలునకే యింగ్లీషుభాష యెక్కుడు వశమైనట్లు కనఁబడునని యింగ్లీషువార్తాపత్రికలే కొన్ని వ్రాసినవి.

కృష్ణదాసపాలుని మరణమునుగూర్చి దేశస్థులందఱు విచారించిరి. అప్పటి గవర్నరుజనరలుగా రగు రైపన్ ప్రభువుగారు శాసననిర్మాణసభలో కృష్ణదాసుని మరణమును గూర్చి యిట్లనిరి. అతని బుద్ధికుశలత యసాధారణమైనది. ఈసభలో నతఁడు మాటలాడుచున్నప్పుడు వినినవారందఱు వాని పాండిత్యవిశేషము నంగీకరించియేయున్నారు. కృష్ణదాసపాలునియొద్ద మూఁడు మంచిగుణము లుండినవఁట. 1. సమమైన యాలోచనశక్తియు 2. తాను నమ్మినపని చేయుటలో ధైర్యము 3. కోపము లేకపోవుట యీ మూఁడు నుండుటచే నతఁడు దేశస్థులయొక్కయు నధికారులయొక్కయు మెప్పు వడసెను. సర్ రిచార్డు టెంపిల్ దొరగారు నాకాలపుమనుష్యులు కార్యములు అను గ్రంథము రచియించి యితనింగూర్చి యిట్లు వ్రాసిరి. "గవర్నరుజనరలుగారి సభలో నున్న హిందువులలో కృష్ణదాసపా లనునతఁడే సమర్థుఁడు. రాజా మాధవరావుగారి తరువాత హిందువులలో నిన్నిసంగతులు తెలిసినయతఁ డితఁ డొక్కఁడే. శాసననిర్మాణసభలో దొరతనమువారి కతఁడు మిక్కిలి సహాయుఁడుగా నుండెను.

కృష్ణదాసపాలునకు కుటుంబసౌఖ్యము సరిగా నుండలేదు. అతనికి మొట్టమొదట 1856వ సంవత్సరమున వివాహ మయ్యెను. ఆభార్యవలన నతని కిరువురు కొడుకులు గలిగి బాల్యమునందే మృతినొందిరి. పిదప 1872వ సంవత్సరమునం దాభార్య మృతినొందఁగా నతఁడు 1874వ సంవత్సరమున మరల వివాహము చేసికొనెను. ఈరెండవభార్యవలన నతనికి కుమారుఁడు కలిగెను గాని వాఁడును శైశవమునందె మృతినొందెను. అతఁడు నిగర్వియై డంబములేక సామాన్యునివలెనే జీవితకాలము గడపెను. అతఁడు స్వమతాభిమానము గలహిందువుఁడైనను సంఘసంస్కారమునకు విరోధి కాఁడు. సంస్కారము మెలకువగాను నెమ్మదిగాను జరుపవలయునని యతని యభిప్రాయము. అతఁడు న్యాయదృష్టిగల స్వతంత్రుఁడు. బిరుదుల నిమిత్తము దొరతనమువారి నెన్నఁడు నాశ్రయింప

లేదు. అయాచితముగా బిరుదులు వచ్చినప్పుడు వానిని గ్రహింపకపోలేదు. అతఁడు తనకు రావుబహద్దరు బిరుదమువచ్చినప్పుడు పత్రికలో నిట్లువ్రాసెను.

“మా పేరు రావుబహద్దరులలో నగపడుటచే మేము మిక్కిలి యాశ్చర్యము నొందినారము. మేము నేరము చేసినామని మాకీశిక్ష విధింపఁబడినదో తెలియఁజాలము. మాకు బిరుదులు పొందవలయునని యాసలేదు. మేము చేసిన సేవకు సంతసించి దయామయులై యధికారులు మాకీగౌరవమును దయచేసినందుకు కృతజ్ఞులమైయున్నారము. మా కీసంగతి ముందు తెలిసి మామాట సాగెడిపక్షమున మేము మాబోలి కెవరు రావల దనియు బిరుదులు గిరుదులు మా కవసరము లేవనియు వానిం దప్పక వేఁడుకొని యుందుము.”

ఈ పైవాక్యములఁబట్టియు యింకఁ దక్కినసంగతులఁబట్టియు కృష్ణదాస పాలుఁడు 19వ శతాబ్దమునఁ బుట్టిన దేశాభిమానులలో నొకఁ డనియు వాని మార్గము ననుసరించుటకు మన మందఱముఁ బ్రయత్నము చేయుచుండవలయుననియు జదువరు లీతని చరిత్రమువలనఁ గ్రహింతురుగాక !

## హరిశ్చంద్రముకర్జి.

ఇతని ప్రతిమ మాకు దొరకినదిగాదు. ఈయన బంగాళాదేశపు కులీన బ్రాహ్మణుఁడు. తండ్రి యగు రామధనముకర్జీ మిక్కిలి బీదవాఁడు. వీరిద్దరన్నదమ్ములు. ఈయన యన్నగారిపేరు హారేణ్చంద్రముకర్జీ.

హరిశ్చంద్రముకర్జీ 1824వ సంవత్సరమున కలకత్తాకు సమీపముననున్న భవానీపురమున బుట్టెను. అతఁ డయిదేండ్లవయసు గలవాఁడయినప్పుడు తన యూరిబడిలో స్వభాష కొంతవఱకుఁ జదువుకొని యేడవయేట నింగ్లీషు నారంభించి బీదవాఁడగుటచే జీతములేకుండ నొక పాఠశాలలోఁ జేరి పదునాలుగు వత్సరములు వచ్చువఱకు నచ్చట విద్య నభ్యసించెను. అతని కుటుంబము మిక్కిలి దారిద్ర్యముచే బాధపడుచుండుటచే నతఁడు చదువుమాని యేమైన సంపాదించి సంసారము వహింపవలసినవాఁడయ్యెను. అందుచే హరిశ్చంద్రముకర్జీ జనుల కర్జీలు ఉత్తరములు బాకీజాబితాలు వ్రాసి కుటుంబమును బోషింపఁజొచ్చెను. అట్టిపనులవలన సొమ్ము సరిగా రాకపోవుటచే నతని బీదతనము తగ్గలేదు సరికదా యొకసారి ఆపూటకుఁగూడ బియ్యపుగింజలులేక యింటిలోనున్న రాగిబిందె తాకట్టు వేసికోదలఁచుకొన్నంత దురవస్థ పట్టెను. అంతలో నొక జమీం

బాబుని యేజంటువచ్చి వానిచే నొకయర్జీ వ్రాయించుకొని రెండురూపాయలిచ్చి బింది తాకట్టు అవసరము లేకుండఁజేసి వానిగౌరవమునుఁ గాపాడెను. కుటుంబ మేవిధము చేతను గడచెడువిధము గనఁబడకపోవుటచే హరిశ్చంద్రముకర్జీ యొకరివద్ద పదిరూపాయలు జీతముగల గుమాస్తాగా కుదిరెను. అతఁ డాయుద్యోగమునైన పదికాలములపాటుంచుకొనక యజమానునితో వివాదపడి కొద్దికాలములోనే యాపని మానుకొనెను. అది మానుకొనిన కొన్నినాళ్లకు మిలిటరీ ఆడిటరుగారి కచేరిలో ననగా సేనల కర్చులు వ్రాయుకట్టి కచేరిలో నెల కిరువదియైదురూపాయలు జీతముగల యుద్యోగ మతనికి దొరకెను. ఆయుద్యోగమునం దాయన నిరుపమానమైన బుద్ధికుశలతను శ్రద్ధను పైయధికారులయెడ వినయమునుఁ జూపుటచే నతని తెలివితేటలు గ్రహించి వానికి గ్రమక్రమముగా నధికారులు నాలుగువందలరూపాయల వఱకు జీతము వృద్ధిచేసిరి.

ఉద్యోగములోఁ బ్రవేశించినను ముకర్జీ సాయంకాలములందును మఱియు తీరికయైనప్పుడెల్లను భాషాభివృద్ధికొఱకై యింగ్లీషు గ్రంథములను వార్తాపత్రికలను విసువులేక చదువుచువచ్చె. గొప్పవారి యుపన్యాసములు వినుటయందు మిక్కిలి యాసక్తిగలవాఁడగుటచే నతఁడు భవానిపురమునుండి నాలుగుమైళ్ళునడచి కలకత్తాకు వచ్చి డాక్టరు ఢఫ్‌దొరగారి యుపన్యాసములు వినిపోవుచుండువాఁడు. కలకత్తాలో నున్న పుస్తకభాండార సమాజమందు తాను నొక సభ్యుఁడుగాఁ జేరి యందున్న పుస్తకములన్నియుఁ జదివెను. ఆయుద్యోగములోఁ బ్రవేశింపకమునుపే యతఁడు కొన్ని వార్తాపత్రికలకుఁ గొన్నివృత్తాంతములు వ్రాసి పంపుచువచ్చెను. 1853వ సంవత్సరమున కలకత్తానగరవాసులు ఈస్టిండియా కంపెనీవారికి మహజరొకటి పంపఁదలఁచి దాని నింగ్లీషుభాషలో మృదుశైలితో వ్రాయఁగలవాఁడు హరిశ్చంద్రముకర్జీ యొక్కఁడే యని యతని నాపనియందు నియోగించిరి. దీనింబట్టి వాని కింగ్లీషుభాషయం దెంత పాండిత్యముగలదో మనము తెలిసికొనవచ్చును.

1854వ సంవత్సరమున కలకత్తానివాసు లగు శ్రీనాథగోషు గిరీశచంద్రగోషు క్షేత్రచంద్రగోషు అను ముగ్గురన్నదమ్ములు, హిందూపేట్రియేటను పత్రికనుఁ బ్రకటింపఁబూనిరి. హరిశ్చంద్రముకర్జీ యాపత్రికకు వృత్తాంతములు వ్రాయుచు దానిపై మిక్కిలి యభిమానము గలవాఁడయ్యెను. కొంతకాలము గడచునప్పటికి పత్రికాస్థాపకు లగునన్నదమ్ములకుఁ బత్రికపై నభిమానము తగ్గుటయు ముకర్జీకి హెచ్చుటయు సంభవింపగా నెట్టకేలకు ముకర్జీ యొక్కఁడే దానిం బ్రకటించు భారమునుఁ బూనెను. అదివఱకా పత్రిక ముద్రింపఁబడు ముద్రాయంత్రము మఱియొకరికి విక్రయింపఁబడుటచే నతఁడు పత్రికనిమిత్తము మఱియొక యచ్చుకూటమునుఁ గొని తనయన్నగారినే పత్రికకు ముద్రాశాలకు గార్యనిర్వాహకుఁడుగా నేర్పరచి యసాధారణప్రజ్ఞతో దానిని నడపఁజొచ్చెను.

1856వ సంవత్సర ప్రాంతమున స్త్రీపునర్వివాహ విషయములతో బంగాళాదేశ మంతయు నట్టుడికిన ట్లుడుకఁజొచ్చెను. హరిశ్చంద్రముకర్జీ ఈశ్వరచంద్రవిద్యాసాగరుని పక్షము బూని సంఘసంస్కారము మంచిదేయని పత్రికమూలమున వాదించి సంస్కర్తలకుఁ దగినసాయము చేసెను. అప్పటి గవర్నరుజనరలుగా రగుడల్‌హవుసీ ప్రభువుగారు హిందూదేశమునందలి పెక్కుభాగములను గలుపుకొని కంపెనీవారి యేలుబడిక్రిందకుఁ దీసికొనివచ్చెను.

తరతరములనుండి యేలుచున్న రాజులను రాజ్యభ్రష్టులుగాఁ జేయుట యన్యాయమని హరిశ్చంద్రముకర్జీ పలుమారు నిర్భయముగ వాదించెను. డల్‌హవుసీ ప్రభువుగారి తరువాత గవర్నరుజనరలుగా వచ్చిన కానింగుప్రభువుగారి కాలమున సిపాయిపితూరీ రాఁగా ముకర్జీ చాల పాటుపడి సిపాయీలకు దొరతనమువారికి మనస్పర్థలు దొలఁగించి సంధిచేసెను. ఆంగ్లేయపత్రికాధిపతు లగుదొరలు కొందఱు సిపాయిపితూరీ సంబంధము గలస్వదేశస్థుల భూములు మొఖాసాలు నగ్రహారములు దీసికొని గవర్నమెంటువారు దొరల కిచ్చుట బాగుండు నని వ్రాసిరి. అట్లుచేయుట ధర్మవిరుద్ధమనియు ప్రజల కోపము నణచుటకు మారు మరింత హెచ్చించుననియుఁ దనపత్రికలో వ్రాసి ముకర్జీ దొరతనమువారు మానునట్లుచేసెను. బంగాళాదేశమునకుఁ గొందఱు దొరలు వచ్చి నీలిమందుతోటలు వేయించి దానివలన చాలలాభము తీయుచు రహితుల కేమియు లాభము మిగులనీయక వారిని మిక్కిలి బాధపెట్టఁజొచ్చిరి. అప్పుడు రహితు లందఱు భూస్వాములమీఁద కట్టుగట్టి నేల దున్నక నీలిమందు పండింపక తిరుగుబాటు చేసిరి. అప్పుడు భూస్వాము లారహితులను కోర్టులలో దింపి మరింత పీడింపసాగిరి. ఆసమయమున హరిశ్చంద్రముకర్జీ యానిరుపేదరహితుల పక్షముఁ బూని వ్యాజములకై వారు వచ్చినప్పుడు వారి కన్నముపెట్టి బట్టలిచ్చి యర్జీలు వ్రాసిపెట్టి ప్లీడర్లను గుదిర్చి యెన్నివిధములనో వారి నాదరించెను. నీలితోటలయజమానులు వ్యాజములలో నోడిపోయినందున ముకర్జీపయి కడుపులో నక్కసు నిలిపి వానిపైఁ గొన్ని నేరములను మోపి వ్యాజములను దెచ్చిరి. అవి తీర్పు గాకమునుపే 1869వ సంవత్సరమున హరిశ్చంద్రముకర్జీ యకాలమరణము నొందెను. అతనిమీఁదివ్యాజము లతని మరణానంతరమున వానికి వ్యతిరేకముగా తీర్పు చేయఁబడుటచే నీలితోటల యజమానులు వాని యిల్లు వాకిలి నమ్మించి సొమ్ము గ్రహించిరి. హరిశ్చంద్రముకర్జీ పత్రికాధిపతు లగుహిందువులలో మొట్టమొదటివాఁ డనిచెప్పవచ్చును. బ్రతికినది స్వల్పకాల మయినను జీవిత మంతయు నతఁడు పరోపకారార్థమై గడపిన పుణ్యపురుషుఁడు.

శ్రీపరమాత్మనేనమః.

# విద్ధసాలభంజిక.

## తృతీయాంకము.

[తరువాత చేటి ప్రవేశించుచున్నది.]

చేటి—(ఇటునటునడచి) ప్రియసఖి విచక్షణను జూచి నే నెన్నాళ్లో యైనది. దాని నెప్పుడు చూతునాయని యెక్కుడు తహతహచే నాహృదయ మెండఁబెట్టిన యేనుఁగుదంతమువలెఁ బగిలి విషిగుల నున్నది. నా కిప్పుడది యెక్కడఁ గానఁబడును? (ఎదుటఁజూచి) ఏమీ! యిదిగో ప్రియసఖి యేమో యాలోచించుకొనుచు నీవంకనే వచ్చుచున్నది.

[తరువాత నట్టివైఖరిగల రెండవచేటి ప్రవేశించుచున్నది.]

చేటి—ఓహో! మహామంత్రిగారి స్వామికార్యభక్తి సాటిలేనిదిగా నున్నది.

ప్రథమ—ఏమీ! మహాభాగ్యసంపన్నుల కార్యసిద్ధివలెనే ప్రియసఖి తలఁచినంతనే తారసిల్లినది! కనుక వెనుకపాటునవెళ్లి కన్నులు మూసెదను.

(అట్లు చేయుచున్నది.)

ద్వితీయ—ప్రియసఖి యైనసులక్షణ చేతులతో నంటినట్లున్నది. (ప్రకాశముగా) చెలీ! సులక్షణా! తెలిసికొన్నానే. కన్నులు వదలు.

సుల—(కన్నులువదలి చనువుతోఁగూడిన కోపముతో) తడిసి బిఱ్ఱబిగిసిన జనపనారత్రాటి ముడివలె మనస్నేహ మెంతో గాఢమైనది గదా! దానినైనను విచారింపక తోఁకదీసిన పిచ్చుకవలెఁ గనఁబడకుండఁ బోతివి. నాకు నీమీఁదఁ గోపము రాకుండునఁటే?

విచక్షణ—(బతిమాలుచు) చెలీ! సులక్షణా! కోపపడకే! ఈతప్పు మహామంత్రి భాగురాయణునినియోగము చేసినదికాని నేను జేసినదికాదే.

సుల—(చిఱునగవుతో) మంత్రాంగశక్తియందు మాఱులేనిదానవు.

విచ—ఇవియన్నియు అబలలు సేయఁదగిన యాఁడుమంత్రాంగములు గదా ?

సుల—ఆఁడుమంత్రాంగము లగుటచేతనే ఆఁడువాండ్రగపడకపోవుట. అందుచేతనే మనుబోంట్లను కన్నుల కడ్డమైనప్పుడు కాలితోఁ దన్నుకొనిపోవుట.

విచ—అయితే నీవు సేయుచున్నమంత్రాంగమేమో కొంచెము చెప్పుదు.

సుల—నీవు చెప్పినపిమ్మట నేను జెప్పెదను. ముందు మావిమంజరులను మేసిగదా కలకంఠి తన కంఠముద్రను సడలించుకొనుచున్నది. ?

విచ—అట్లయిన వినుము. ఒకప్పుడు షాడ్గుణ్యసంపన్నుఁ డైనభాగురాయణుఁడు నన్ను గౌరవముతోఁ జేరఁజీరి "విచక్షణా ! నీవు మా కొక్క రాచకార్యమునందుఁ దోడు పడవలయును" అని సెలవిచ్చెను.

సుల—ఏమే నీబుద్ధివిభవము ! మహామంత్రిగారు సయితము నీవల్ల నొక మహాత్కార్యము సాధింపఁ బడఁగలదని తలఁచుచున్నారు ! మల్లికాకళీ వాసనలు వలపు గొలుపునని చెప్పవలయునా? తరువాత, తరువాత.

విచ—తరువాత నేను మిగుల వినయముతోఁ జిత్తమంటిని. అప్పుడాయన "మృగాంకవర్మ మృగాంకావళి" యని సెలవిచ్చిరి.

సుల—తరువాత, తరువాత.

విచ—తరువాత "ఆవన్నెలాడిం బెండ్లియాడి మహారాజశ్రీ విద్యాధరమల్లదేవుఁడు మహీతలచక్రవర్తియగును గనుక, నీవెప్పుడో యొక్కనాఁ డప్పడఁబోఁడిం దోడుకొనివచ్చి గోడలోని సందుత్రోవలగుండఁ బడకింటం బ్రవేశపెట్టి, యందు మహారాజుగా రామెనుజూచి స్వప్నమని భ్రమనొందునట్లు సేయవలయును. ఆపిమ్మట నెప్పు డెప్పు డేమేమి చేయవలయునో యదియెల్ల నీకు హారదాసుఁడు తెలుపుచుండును." అనికూడ సెలవిచ్చిరి. నీవుకూడ నాయిందుముఖికిఁ బ్రియసఖివే కనుక ఈమహారాజకార్యరహస్యమునందుఁ దోడుచూపవలయునని వేఁడుచున్నాను. మెట్లెక్కకుండ మేడ యెక్కలేముగదా ? తరువాత నేను హారదాసుఁడు చెప్పిన కార్యపద్ధతి ననుసరించి మృగాంకావళితో నమ్మకము పుట్ట నిట్లంటిని. "చెలీ! మృగాంకావళీ ! యీ వాసభవనమునఁ బూవిలుతుఁడు వెలసియున్నాఁడు. నీవాతని దర్శించి నీమెడలోని హారమును గానుకిచ్చి పూజింపుము. పూజింతువేని నీకట్టికాంతుఁడు లభింపఁగలఁడు." అని. ఆమెయు నట్లుచేసెను. నేనును అంతటితో నూరకుండలేదు. ఉయ్యెలయెక్కి యూఁగుచున్న యక్కలికిమిన్నను వెండియుం జూపించితిని. కేళీకైలాసము

లోని పటికపు జాతిగోడలపయి నా పెరూపు నా చేతనే స్ఫుటముగా వ్రాయించితిని. సారంగములగుండఁ గంబమునం బ్రవేశపెట్టి యామెచే రాజుగారు వినునట్లుగాఁ బలుకులు పలికించితిని. పదములు పాడించితిని.

సుల—ఆచిన్నదాని చిన్నెలు వన్నెలు చిత్రగించినారుగదా. ఇప్పుడు మహారాజుగారు ఏతీరుగా నున్నారు?

విచ—కేళికరిణితోడి సయ్యాటలయం బాలుపడి జేలుపడు నడఁబోయెనాఁగు చందమున నున్నవారు మఱియు లేఁబోఁకపొత్తుల దక్కించు చెక్కిని వ్రాసిడాఁగ నల పలువరుసలట్లు తెలివిమీఱు తేటవెన్నెలను దర్శించి తబ్బిబ్బుగఁ బలుకుచున్నారు. అది యెట్లంటేని

“మ. సనెకంటం బొడసేయుఁ డీ క్షణములోఁ జంద్రుడున్; పక్షిరూపకల్
గొని రేబోటిమొగానఁ జిక్కఁగ మసింగొట్టుండి నల్పెక్కఁ; జే
ర్చిన కిన్కన్ హరియింపుఁడీ కుసుమలక్ష్మిన్ మంత్రతంత్రంబులన్
గననోర్తున్ లలనాముఖాంకితసుదిగ్భాగంబు లట్లైనచో”. 1.

సుల—ఇంక నామెయవస్థ యెట్లున్నది?

విచ—“ఉ. ఆడదు పూవుఁదోఁటఁ, గొనియాడదు వెన్నెలతేట, బోటులం
గూడదు, కేళిమండపముగమ్ముమువంకను దొంగిచూడదున్
వేఁడదు వేషపోషణము, కీడదు కెంజిగురాకుపాన్పుఁ, బూఁ
బోఁడి తదీయ నవ్యమృదుమోహన రూపవిభావనారతన్”. 2.

మఱియిప్పుడు నీవు చేయుచున్న మంత్రాంగమేమో చెప్పఁగోరెదను.

సుల—విను చెప్పెదను. ఒకప్పుడు మహారాజుగారు నాయందలి యనుగ్రహముచే నా చెవిలో “నీకొక్క రహస్యము చెప్పెదనుగాని దేవిగారికి మాత్రము తెలియనీయఁగూడదు”. అని యానతిచ్చిరి.

విచ—అది యెట్టిది?

సుల—ఎట్టిదా? “అబద్ధపుఁ బెండ్లిచే నటమటనొంది యడకింపఁబడిన చారాయణుఁడు దేవిగారి దాదికూఁతును బెలుపుచ్చఁ గోరుచున్నవాఁడు. కావున నీవు ప్రొద్దు గ్రుంకినవెనుక దట్టముగఁ గ్రమ్ము సందెచీఁకటిలోఁ బొగడమ్రాని పైకెక్కి, యుద్యానవీధి నొంటిగఁబోవు మేఖలనుగూర్చి ముక్కుమాటలుగా ఓసీ! మేఖలా! నీవీవైశాఖపూర్ణిమనాఁడే ప్రదోషవేళను మరణము నొందెదవు. అని యాడు” మనిరి. నేనును దానితో నట్లే యాడితిని.

విచ—తరువాత, తరువాత.

సుల—తరువాత నప్పుడఁతుక భయముచే నొడలు వడవడ వడంకఁ జెదరిన హృదయము నెట్టకేలకుఁ బదిలపఱచుకొని, చెట్టువంకఁ దిరిగి చేతులుమోడ్చి, "భగవతీ! అశరీరవాణీ! నీవు నాయందలి కరుణచే నాకుఁ గలుగఁబోవు మరణము నెఱిఁగించితివిగదా! తల్లీ! యింక నే నెట్లు బ్రదుకఁగలనో యదిసయితము నెఱిఁగింపుము." అని వేఁడుకొనెను.

విచ—తరువాత, తరువాత.

సుల—తరువాత దానితో నిట్లంటిని. "గాంధర్వవేదవిచక్షణుఁడగు బ్రాహ్మణుని నొకని సమధికసత్కారములచే సంప్రీతుఁ జేసి యాతని యడుగులఁ బ్రాలి కాళ్లసందున నిఱికి చరింతువేని నీవు బ్రతుకఁగలవు" అని.

విచ—ఓహో! యేమే నీనేర్పు. మునులుగూడ బ్రాహ్మణుని పాదములవలనఁ బవిత్రత్వమబ్బుచున్నదని చెప్పుచున్నారు.

సుల—(ఆలోచించి) ఇది యంతయు ఆబ్రాహ్మణుని కపటనాటకకవనమే!

విచ—తరువాత, తరువాత.

సుల—తరువాత నామాటలు విన్నదియై కాటుకనీటును గడిగివేయుచున్న కన్నీటిధారలను మాటిమాటికిఁ దుడిచివైచికొనుచు మేఖల తిన్నగా మహారాజుగారి చేరువనున్న దేవిగారి యొద్దకువచ్చి యామెతో నేను వినుచుండఁగా నడచిన సర్వవృత్తాంతమును నివేదించెను. అప్పుడు దేవిగారినిఁ గలఁకదేర్చుటకును, చారాయణుని కోరిక నెరవేర్చుటకును వచ్చియుండిన ప్రభువువారు "సుందరీ! దిగులొందవలదు. ఏమందువేని, గాంధర్వవేద విచక్షణుఁడగు బ్రాహ్మణుఁడు మనకు స్వాధీనుఁడుగానే యున్నవాఁడు. కనుక నధరబింబము నశ్రుజలముచే నెందుకు తడిపెదవు". అని దేవిగారిని కుదురుకొల్పిరి. ఆపున్నమ నేఁడేయని దేవిగారితో నేనుఁ జెప్పఁగా పూజాసంభారమును సిద్ధము చేయవలసినదని నన్నుఁ బంపినారు.

విచ—సరేరమ్ము. వారి సెలవుచొప్పున నడచుకొందము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

[తరువాత గాఢోత్కంఠుఁడై రాజును, స్నానశుచియై విదూషకుఁడును
ప్రవేశించుచున్నారు.]

రాజు—(అనుధ్యానము నభినయించి)

గీ. పానుముకొని గుబ్బచనుదోయి పాటుమరింప
ముడిఁగి వళిరేఖలన్నియు నడఁగిపడఁగ
బోటి కైదండ గొంచును బొట్టవ్రేళ్ల
నిలిచి యక్కొత్తి ననుఁజూచు నెలఁతఁదలఁతు. 3.

విదూ—ఉండవయ్యా! నన్నిప్పుడు మాటాడించకు. దేవిగారి సన్నిధానమందు; మేఖలను బ్రతికించవలెను. (తనలో) ఆఁ! దుష్టదాసి! దుష్ప్రబుద్ధుఁడైన చారాయణ బ్రాహ్మణుఁ డిప్పుడే మీఁదఁబడఁగలఁడు.

రాజు—(వినిపించుకొనక పయిపద్యమునే చదువుచున్నాఁడు.)

విదూ—అదేపనిగా నామెను దలఁచుకోకు. అగ్నిమంట లెగయించునాఁడు పిశాచమది.

రాజు—ఏమంటివి? అగ్నిమంట లెగయించునా? అటయిన నీచెవులకు కోకిలకాకలీకలగీతికలు చీఁదఱ గొలుపవలయును. నీకన్నుల కమృతవర్షముఁ గురిసెడి చంద్రబింబము కాఁకచేయవలయును. నీయొడలికి మంచిగంధపుఁబూఁత మంటలెత్తింపవలయును.

విదూ—ఔనులే. నేను కేరడము లాడినాను. నీవు నీరమునుండి క్షీరమును వేఱుపఱచు హంసవలెనే సర్వవస్తువులయొక్కయు సారమును గ్రహించినాఁడవు. ఏమి చెప్పుదును? అలసుఁడు విద్యనువలెనే అయ్యాగా రమ్మగారిని మఱచినారు.

రాజు—ఎంతమాట! ఆబాల్యప్రవర్ధిత ప్రరూఢప్రేమ యగుదేవిని మఱతునా? మఱేమన్న

క. నెలఁతల తలఁ గడకాలిడి
వలపుల కాణాచి భుక్తపఱచుకొనియె దే
వి; లతాంతశరుని పనుపునఁ
జెలియుం బంచుకొననదియె చెలిసగమయ్యెన్. 4.

విదూ—అందుచేత నేకాఁబోలు నీహృదయము ఉయ్యేలవలె ముందుకు వెనుకకు నూఁగులాడుచున్నది.

రాజు—వయస్యా! నీవు చెప్పినమాట యథార్థము. ఏమందువేని

గీ. అభినవానురాగ మపరాధ మోర్వదు
చనదు నలిపివైన జాజిసరము;
దేవితోడి చెలిమిఁ ద్రెంపఁ గూడదు, వాఁడె
ననుదు వకుళమాలఁ జనదువిడువ. 5.

విదూ—అబ్బో! యెందుకు వచ్చిన యిచ్చకాలివి? పండుటాకును బడ గెంటకుండఁ దలిరుటాకు తలయెత్తదు. ఇంతేగాక క్రొత్తగనుపులఁ బొటమరించి నిగనిగలాడు చిగురుమొటికల మేయ మరగి పోతరించు లేడిపోతు దవనపుమడియందుఁ దవిలి క్రీడింపదు.

రాజు—మిత్రుఁడా! నీనోటి కడ్డులేదు. చేయరాని శంకలు చేయుచున్నాఁడవు.

విదూ—ఈగోడవ నాకేల? ఇదిగో చెప్పుచున్నాను విను. నన్నిప్పుడేమియు మాటాడింపవద్దు. దేవిగారి సమక్షమున మేఖలను బ్రదికింపవలెను.

[తరువాత దేవియు, సన్నద్ధురాలయి మేఖలయు, విభవానుసారముగాఁ బరివారమును బ్రవేశించుచున్నారు.]

దేవి—చెలీ! సులక్షణా! అంతఃపురము ముందటివసారలో నార్యపుత్రుఁడును చారాయణ బ్రాహ్మణుఁడును ఉన్నారే?

సుల—దేవిలో నేను మఱియొక విధముగా మనవి చేయుదునా?

విదూ—వయస్యా! యీవసారాలోఁ గూర్చుందము (అట్లు చేయుచున్నారు.)

దేవి—(చేరవచ్చి) జయము! ఆర్యపుత్త్రునికి జయము! అయ్యా! చారాయణ! మేఖలను బ్రదికించి నాకు ధాత్రేయికా భిక్షము పెట్టుము.

విదూ—ఇదిగో సిద్ధముగా నున్నాను.

మేఖల—(దోసిలియొగ్గి) అయ్యా! చారాయణ! ఈదాసురాలు మహాబ్రాహ్మణుఁడవైన నిన్ను శరణుచొచ్చుచున్నది. (అతని యడుగులపయి శిరస్సుఁ జేర్చుచున్నది.)

[తెరలో]

ఏదీ యాచెడుగుదాసి? ఏదీ యెందున్నది? మేము కాలపురుషులము. పెండలకుండ మెడకు సంకెళ్ళువేసి మేఖలను గట్టి యీడ్చుకొనిపోవ వచ్చినారము.

విదూ—(పలుతెఱఁగులఁ బాడుచు దండకాష్ఠము నెత్తిపట్టుకొని) హింగళికాపల్లభుఁడను, గాంధర్వవేదవిచక్షణుఁడను. నేను రక్షకుఁడనై నిలిచియుండఁగా కాలుఁడనఁగా నెవఁడు? కాలపురుషులనఁగా నెవ్వరు? కాలశృంఖల యనఁగా నెట్టిది? (బహువిధముగా చిందులు త్రొక్కుచున్నాఁడు.)

మేఖ—(కాళ్ళలో దూరి) రక్షింపుము, రక్షింపుము.

విదూ—(గట్టిగాఁ బాఱుచు, వెడమొగముగా) చూడు మహారాజా! చూడు. కలానిధీ మన్మథరథాధిరూఢుఁడైన నీప్రియవయస్యునిఁ జూడు. (కొంచెము గట్టిగా) చూచితిరా నాబ్రాహ్మణత్వముయొక్క మహిమ? కాలపురుషులు గోలసులు గలగలలాడ గోఁచులూడఁ బిశాచికలయినారు.

మేఖ—అమ్మయ్యా! బ్రతికినాను.

విదూ—(చఱచుకొనుచు నవ్వి) ఆఁ! తొత్తుకూఁతురా! అబద్ధపుఁ బెండ్లి చేసి యాడించి నందున ఆగ్రహాగ్రస్తుఁడయి చారాయణబ్రాహ్మణుఁడు నీకు శాస్తి చేసినాఁడు. కాని యీకారణముచే మాయింటియాబిడ పసుపుబొట్టునకుమాత్రము భంగము రాదని తలఁచుచున్నాను.

మేఖ—(సిగ్గునొంది యేడ్చుచున్నది.)

దేవి—ఆర్యపుత్రా! నాప్రియసఖియైన మేఖల నీప్రకారముగా నుడికించుట తగినది గాను సరిపోయినదిగాను ఉన్నదిగదా?

విదూ—మహారాజుగారి ప్రియవయస్యు నాప్రకారముగా నడకించుట దేవిగారికిఁ దగిన దేమి? సరిపోయినదేమి?

దేవి—భర్తగారి బంధువుగదా యని యిది నీతోఁ గొంచెము పరియాచకము చేసినది.

విదూ—దేవిగారి చుట్టముగదా యని దీనితో నేనును గొంచెము కోడిగ మాడినాను.

మేఖ—దేవీ యితఁడు సమాధానము చెప్పనుగలఁడు శాస్తి చేయనుగలఁడు. మహారాజుగా రెట్లాశించిన నట్లాడుచున్నాఁడు. మొగలిపువ్వువాసన తగులుటఁబట్టికాని, చంద్రడమొద్దునకు సౌరభము కూడనా?

దేవి—(కోపము నభినయించుచుఁ బరివారముతో నిష్క్రమించుచున్నది.)

విదూ—వయస్యా! యిప్పు డీగనైనను లేకుండఁ జేసినాను.

రాజు—దేవి మిక్కిలి చిన్నఁబుచ్చుకొని యేడ్చుచు వెడలిపోయినది.

విదూ—ఏడువనీ! ఏడువనీ! యేడ్చినంతమాత్రమున ముత్యాలేమియు రాలిపోవులే. రమ్ము. ఎదుటియుద్యానమునకుఁ బోదము. (ఇటునటు నడచుచున్నారు.)

విదూ—ఇదిగో నాచేయిపట్టుకొని యడుగులు మెల్లగా నిడుచు నడువుము. ఏమంటేని లెక్కకుమీఱిన తుమ్మెదబారులచేఁ గూర్పఁబడినట్లును, కోయిలమూఁకలవలనఁ గలిగింపఁబడినట్లును, చమురువయిచి మెదిచినపదనుకాటుకముద్దలవలనఁ బుట్టింపఁ బడినట్లును, ఇంద్రనీలమాణిక్యముల పొడులవలనఁ బొడమింపం బడినట్లును,

గరళకంఠునికంఠకాంతులచే ఘటియింపఁ బడినట్లును, నీలవర్ణుని నెమ్మేని నుండి నిర్గమించినట్లును, విధుకళంకమువలన వెడలింపఁ బడినట్లును, నీలోత్పలదళములచే నిర్మింపఁబడినట్లును, కరిమదధారలచేఁ గల్పింపఁబడినట్లును, గ్రమ్మిచిమ్మచీఁకటి మిట్టిదిగొట్టిది, దూరమిది చేరువిది, నలుపిది తెలుపిది, కొంచెమిదిగొప్పయిది, యని యేర్పరింపఁగనీక లోకమును జీకాకుపఱచుచున్నది.

రాజు—అవును నిజమే.

గీ. పిడికిలింపఁదగిన పెంజీఁకటిని దిక్కు
లొడలినొరసినట్లు లుండు; మఱియుఁ
గాలినడకకిముడు కరణి భూవలయంబు
దగును; నొసలి బంతి యగును నభము. 6.

ఇప్పుడు కొంచె మూహచేసెదను.

సీ. చెవిసంది నెమిలిపించెముఁ జెర్వి నందిళ్ళఁ బచ్చలకడియముల్ పరిఢవించి
యుదుటుగుబ్బలపైనిఁ ద్రిదశేంద్రమణిసాంద్ర హారవల్లరుల సొంపారఁదాల్చి
వదనమండలముపైఁ బదనుకస్తురితోడ మకరికాపత్రసంపదలు నించి
సిగలచుట్టును నల్లనొగలదండలుసుట్టి నీలికోకలుగట్టి నీటుగులుకఁ
బ్రియుల నభిసరింపఁగఁగోరి వెడలుచున్న
విపులజఘనల శృంగారవేష లీల
చెలిమిఁ జాటించుఁ జీఁకట్లు కలిమితోడ
రంగురంగునఁ గలసె ననంగఁ దగుచు. 7.

[తెరలో]

సీ. మఱుఁగఁగాఁగినపాల మఱపించు కరముల గిలిగింత సెవఁడు పొంగించు జలధి
భువనత్రితయదివ్యభవనంబునకువండు నవసుధారసలేపనంపుఁ గుంచె
సిద్ధౌషధంబయి చెలఁగి యెవ్వనివెల్గు మదనవల్లి నివుళ్ళు పొదలఁజేయుఁ
జివురువిల్తునికేళి భవనాంగణమునకుఁ, జారుచందనపంక చర్చయెవఁడు
అతఁడు వెలుఁగొందుఁ గుంకుమన్యాసగౌర
మానినీరమ్య వదనోప మానమూర్తి
ఘటితచక్రవాకమిథున పటుతరార్తి
సాంద్రతరకీర్తి యామినీచక్రవర్తి. 8.

మ. నలినంబుల్ మలినంబులయ్యెను, జనానందుండు చంద్రుండు క
ల్కులనవ్వెన్, రజనీరమావిమలముక్తాహారతారాళి బి
ట్టలరున్ నల్దెసలన్, రథాంగములు దగ్ధాంగంబులై పండు వె
న్నెలకాఁకం గవకోకకున్ హతవిధిన్ నిందించుచుం గుందెడున్. 9.

[తిరిగి తెరలో]

మ. తొలుతన్ నివ్వరిముల్లులట్లెసఁగి, తోడ్తోఁ గేతకాగ్రద్యుతుల్
దలఁపంజొప్పడి యంతటన్ బిసలతాలావణ్యముందాల్చి, యా
వల ధారాంబువిడంబనంబులయి, యాపైఁ దారహారప్రభా
నిలయంబై స్ఫటికంపు దండములనన్ వెల్గెన్ సుధాంశుద్యుతుల్. 10

మఱియు దేవా! చిత్తగింపుము.

మ సురదంతావళదంతఖండమునకున్ జోడైన యాకారముం
బరఁగం దాల్చి, స్వచ్ఛమౌక్తికలతాప్రాలంబ లంబద్యుతుల్
గొరయం జందనపిచ్ఛిలంబుగ దివిన్ నిర్మించుచుం, బొల్చెఁ జం
దురుఁడింతుల్ స్మరలేఖలం జదువఁగం దోడైనదీపంబనన్. 11.

విదూ.—ఇదిగో నిది కలకంఠి యనుదేవిగారి నాగరిణి. పున్నమచంద్రుఁడు పొడచూపఁగానే దానిమాట విని కర్పూరచంద్రుఁ డనుమాగధుఁడు చంద్రోదయవర్ణనము చేయుచున్నాఁడు. నాకును నోరు గులగుల లాడుచున్నది. నేను గూడ వర్ణించెదను. చీఁకటి కాటుకఁజిక్కఁగఁ బట్టించిన యాకసపు నల్లబల్లపయిఁ దెల్లగనొప్పు చుక్కల పేరి యక్కరములు జాబిలి బుడ్డినుండి జాలువాఱు వెన్నెల సుద్దపాలచేఁ దద్దయు రూపు చెడుచున్నవి.

రాజు—మిత్రుఁడా! నీ కిప్పటికిని జిన్నతనపు ధోరణి వదలినది కాదు.

విదూ—సందె వాల్చుచున్నప్పుడు మాత్రము కోఁతి కోఁతిచేష్టలను విడుచునా? పోనీలే. ప్రౌఢోక్తులతోనే వర్ణించెదను.

పృథ్వి. ఆకంకణ మకుండలం బగు దిగంగనామండనం
బపంకము మచందనంబగు ధరాబ్జదృగ్భూషణం
బకంజమున చూతమై తగు ననంగదివ్యాయుధం
బకల్మషరుచిన్ దివిన్ శశికళౌఘమేపారఁగన్. 12.

రాజు—(అంతటను జూచి వలవంత నభినయించి) భగవంతుఁడవైన యామినీనాథ! ఇదియేమి? నీవ్యాపారము విరుద్ధముగా నున్నది!

శా. క్షీరాబ్ధిన్ జననంబు; సోదరులు లక్ష్మీకౌస్తుభంబుల్; సుధా
ధారాపాతములం శుజాతము; సుహృద్వర్గంబు నీలాబ్జముల్
వైరంబింతుల మోము తామరలతో; భావింప సర్వజ్ఞ చూ
డారత్నం బవుచంద్ర! నీకగునె నన్ డాయన్ శిఖిజ్వాలలన్. 13.

(నలుదెసలు చూచి)

ఉ. లంబుగఁ గేతకీదళదళంబులఁ బిండిన సారమట్లు నా
కంబయి, హారమౌక్తిక మణిద్యుతి నెయ్యదియొప్పె, నిష్టదే
వంబుల ముంచి యొత్తనయి, చేరల జొట్టఁగనై, మృణాళ ఖం
డంబుల గ్రోలనై, పొసఁగుఁ జంద్రిక చందురుఁ డేపు సూపఁగన్. 14.

(ఆలోచించి) చంద్రునియొక్క స్వచ్ఛభావమే మాబోంట్లకుఁ బ్రాణసంకటము. ప్రాణములు దీసెడి విషము స్వచ్ఛముగా నుండుటలేదా? (వేఁడుచు)

గీ. కళయుఁ గాంతిమాసి కలువ తేఁకు చనఁగ
విరహిజనులు శైతలు వీడి మనఁగఁ
జంద్రపుటములను గ్రహించి వెన్నెలఁ గుతి
యూరఁ గ్రోలరే చకోరులార!

(ఎదుటఁ జూచి) అదే మృగాంకావళి! 15.

విదూ—అవును. అది మృగాంకావళియే ఒక్క చంద్రుని కింత కాంతిసంపద యుండదు.

రాజు—కనుక మనమిప్పు డీయరఁటి చెట్లచాటుననుండి వీరి విస్రంభాలాపములను వీనుల విందుగా తనివిదీఱ వింనము. (అట్లు చేయుచున్నారు)

[తరువాత మృగాంకావళియు విచక్షణయుఁ బ్రవేశించుచున్నారు.]

మృగాంకావళి—(అనుధ్యానము నభినయించి "చందనకర్దమోల్లిఖితు" అను వెనుకటి పద్యమును జదువుచున్నది)

రాజు—(ఖేదముతో) ఓహో! ఈ కలికిపలుకులు మదనమంత్రాక్షరములు గానున్నవి!

విదూ—అవేమో నాకుఁ దెలియదుగాని, మన్మథహతకుని చేతి బల్లెములు వాఁడిగలవని యెఱుఁగుదును.

రాజు—మ. నేఁడు మత్తెంపుసరుల్, ఘనుంగవపయిన్ మేల్మైనకర్పూరపుం
బొడియుం, గేలఁగవన్ మృణాళవలయంబుల్, మేనఁ గంధంబునన్

మెసఁగుం బుట్టముఁ గప్పి కామిని నభోమధ్యస్థుఁడౌ చంద్రుచే
విడువంబడ్డ నిజాధిదేవత యన న్ వెల్గొందెడున్ రాత్రిన్. 16

విదూ—అవునవును. పయినంటి యూడిపడిన చంద్రాధిదేవతయే యీమె. ఏమనఁగా నీయింతిచే నింతకుముందే విడువఁబడిన మృగలాంఛనుని మండలమధ్యప్రదేశము కందునెపమున మాసి మచ్చపడిన ట్లున్నది.

రాజు—మిత్రుఁడా! పెంపునొందిన వెన్నెలవెలుఁగులో నైతము ఇప్పలఁది విన్న విరహపాండిమయు విస్పష్టముగా నేకనఁబడుచున్నదిసుమీ! ముత్యాలహారములో సంపపూసలేవో సన్నముత్తెములేవో తెలియవుగనుక నా?

గీ. చాయపసుపుఁగొమ్ము చాయలీనెడు మేన
విరహపాండిమంబు విస్తరిల్లెఁ
గాంచనంబుతోడఁ గరఁగించి రజతంబుఁ
బడఁతి యొడలు సేయఁబడెనొ యనఁగ. 17.

విదూ—పాదరసము ప్రాఁకిన బంగారమువలె నీపువుఁబోఁడి లావణ్యము పచ్చపచ్చగను దెల్లతెల్లగను గనుపట్టుచున్నది.

మృగాం—అయ్యో! హృదయమా! వానిం జూచినవేమో కన్నులు. నడమను నీవు తొట్రుపడుచుండుట మిక్కిలి యాశ్చర్యముగా నున్నదే! అవును. పులకించి కల్లుచియుటయేమో పొగడమ్రాని మొదలను. కల్లువాసనగ్రక్కుట యేమో పువ్వులును.

విదూ—ఇట్లనుచున్న దేమికారణము?

రాజు—ఇదికారణము. దీనిహృదయము వలపుఁజెంది తగులుకొన్నది. అందుచేతనే దానితో వేఁగలేక విసిగిపోవుచున్నది.

మృగాం—కర్పూరపుఁ గణికవలెఁ జల్లనివాఁడవైన యోవిద్యాధరమల్ల నీవును దహించుచున్నాఁడవని నాకూఁటు యెట్లుగలుగును? చంద్రకాంతమణి నిప్పులు గ్రక్కుచున్నప్పుడు చేయఁదగినదేమున్నది?

రాజు—ధన్యుఁడను. మృగాంకావళిచే నిపుణముగా నెత్తిపొడువఁ దగినవాఁడ నయినందున నే నిప్పు డెంతయు ధన్యుఁడను.

మృగాం—చెలీ! మన్మథుఁడు సామాన్యపుపుష్పబాణుఁడే యయినపక్షమున మముబోంట్ల నిట్లు బాధింపఁ గలుగునా? నిశ్చయముగా నతనిబాణములు విషకుసుమమయము

లయి యుండెననెను.

రాజు—సలిలరూపమయ్యును మంచు దహించుచుండుట లేదా? అటువలెనే కుసుమమయమయ్యును మన్మథుని బాణపంచకము స్వభావముచేతనే తీక్ష్ణమయినది.

విదూ—వయస్యా! వానకాలపు టిసుకబొమ్మవలె క్షణక్షణమును గృశించుచున్న యీ కన్నియను జూడ నెవనికి దుఃఖము కలుగకుండును? మ్లానమయ్యును మరువక కంపలి పరిమళము గలదియేసుమీ! విరహాభరమున గ్రుక్కియు నీమెరూపము మనోహరముగానే యున్నది. వసివాడియు గోరంటపూదండవలె రక్తత్వమును జక్కఁగాఁ బ్రకటనసేయుచున్నది.

మృగాం—చెలీ! యిప్పు డేమి చేయుదును? ప్రేమలతాంకము కొట్టివేయ శక్యము గాకున్నది. (ఖేదముతో) సఖీ! ఆయనకు జాలి లేకున్నది. పరుల దుఃఖమును జూచి దుఃఖపడెడు జనులు ప్రపంచమునందు లెక్కకు మిక్కిలి తక్కువగా నున్నారు. *కుసుమోత్పీడవిడంబనము చూపకుండ ఝంకారములు చేయుచు తుమ్మెదలగుదుగదా! ఓయీ! మన్మథ! ముజ్జగములందును విలుకాఁడవన్న నీవొక్కఁడవే సుమీ! చంద్రశేఖరునిచేఁ బరీక్షింపఁబడిన తీక్ష్ణత్వముగల నీశరములచే నబలాజనమును బ్రహరించుచు సిగ్గునొందకున్నాఁడవు! అంతే! ఆఁడువాండ్రమీఁదనే నీ యారభటి!

రాజు—ఓకుసుమకోమలీ! ఆర్భటి కాదు. ప్రచండార్భటియైనవలయును.

విదూ—(పక్కున నవ్వి) అనంగుని కారభటి యనఁగానే నాకు నవ్వు పట్టరాకున్నది.

రాజు—ఇదియేమి? పెద్దనవ్వు నవ్వి దీనిని బెదరఁగొట్టినాఁడవు.

మృగాం—చెలీ! విచక్షణా! యిక్కడ నెవ్వరో యున్నట్లుగా నున్నది.

విచక్షణ—అట్లయిన మన మీయరఁటిచెట్ల చాటుననుండి యదియేమో తెలిసికొందము.

(అట్లు చేయుచున్నారు.)

విదూ—రమ్ము. మన మందుఁ బ్రవేశింతము. (అట్లు చేయుచున్నారు.)

రాజు—(శైత్యోపచారసామగ్రినిఁ జూచి చేతఁ బుచ్చుకొనుట నభినయించి)

గీ. చేతి కడియమయ్యెఁ జెలికీమృణాళ మీ
చిగురు మగువచెవినిఁ జెరువఁ బడియె
నీయరఁటిమూకు నింత యంశుకమయ్యె
నకను తాప మిందు నత్తమిల్ల. 18.

* ఈవాక్యమునందలి యర్థము విచారణీయము.

కాఁబట్టి ప్రియురాలిచే ననుభవింపఁబడి విడిచిపెట్టఁబడిన యీశిశిరోపచారసామగ్రిచే నే నిప్పుడు తాపశాంతిఁ గావించుకొని పోదను. (అట్లు చేయుచున్నాఁడు. యథోచితముగా రాజును విదూషకుఁడును గూర్చున్నారు.)

రాజు—(సంతాపము నభినయించి) అన్నన్నా! యెంత ఆలోచన తక్కువపని చేసితిని.

సీ. శీతాంశుఁడని సంతసించుటయే కాని విసముతోఁ బుట్టిన చెట్టిదుండు
చందనంబని యాసఁజెందుటయే కాని పాపజాతికినెల్లఁ బట్టుఁగొమ్మ
హారంబులను తెల్లఁ జేసుమాత్రమె కాని క్షారజలంబెకా జన్మభూమి
తమ్ములంచునుగూర్కి తబ్బిబ్బులే కాని వేఁడివెల్లడరింపఁ బ్రీతియెపుడు
అకట వీనియందు నొకటైన మదనాగ్ని [illegible]
చల్లఁ బఱచి సుఖ మొసంగఁగలదె?
తెలియలేక వీని కలరూపుఁబయివన్ని
యలకు మోసపోతి మంతెగాక. 19.

విచ—చెలీ! మృగాంకావలీ! నామాతృత్వము ఫలించినది. మహారాజుకూడ నీవలెనే అపస్మారము పాలయినాఁడు.

రాజు—(సంతాపము నభినయించి.)

గీ. వీవనలువీవ నిట్టూర్పు విస్తరించె
గంధము నలందఁ జెమ్మటల్ కాల్వలయ్యె
విరులపానుపు గాత్రము స్పర్ధిచేసె
ద్విగుణ మగుఁగాక స్మరపీడ విఱుగడగునె? 20.

విదూ—అహో! ముద్దరవయిచిన లేఖ లాగున్నది!

రాజు—లేఖ మాత్రమే కాదు. మన్మథసంబంధమయిన సంధి విగ్రహవ్యవహారము కూడనున్నది. ఏమంటేని చూడు

గీ. తరుణ తాళీదళంబుపైఁ దరుణిరొమ్ము
గుబ్బచనుదోయి గందాన గుఱుతు పెట్టి
తమ్మిలేఁదూఁటి దారానఁ దనరఁగట్టి
యనుపఁదలఁచిన స్మరలేఖ యగుటనిజము. 21.

విదూ—అవును. ఈలేఖ యీచంద్రముఖిదే. కాని యీమెను చూసి యింతెందు కున్నదో చెప్పుదునా?

రాజు—(విదూషకుని తన చెవి చెంతకుఁ జేర్చి) ఒక్క వైడూర్యపుగనిలోనే రత్నశలాక లున్నవా? ఒక్క నీమాటలలో నుండియే తేనెలుట్టి పడుచున్నవా? కాఁబట్టి పైపేరు చూడనిమ్ము.

విదూ—(చూపుచున్నాఁడు.)

రాజు—(చదువుచున్నాఁడు) "నిష్కరుణునకు" "దీనురాలియొద్దనుండి".

విదూ—విప్పెదనుండు. చదువుదువుగాని. (అట్లు చేసి) అయ్యో! మిత్రుఁడా! రత్నములులేని రతనాల బరణివలె నిం దక్షరములే లేవేమి?

రాజు—పయిపేరు వ్రాసినతీరు చూడఁగనే జాలిపుట్టి హృదయము జాలువాఱుచున్నది. (ఆలోచించి) ఓయీ యిది తాళపత్రసంపుటము. (విమర్శించి) సంధిబంధమును జక్కఁగాఁ జూచితివేని లేఖ కనఁబడఁగలదు. రహస్యరక్షణముకయి కామతంత్ర మెప్పుడును కొంచెముగానే సూచింపఁబడుచుండును.

విదూ—(అట్లు చేసి చూచి సంతోషముతో) ఓహో! యేమి నీబుద్ధివిభవము! రోహిణీవల్లభుఁడని మృగలాంఛనుని వేఱే వర్ణింపవలయునా?

రాజు—(నట్టుతోఁ జదువుచున్నాఁడు).

"గీ. అమరుఁ బరువంబు సకలాంగకములయందుఁ;
నమరు నొకవింత ప్రాగల్భ్యమందుఁ గనులఁ;
జూచి యెవ్వని హృదయంబుఁ జూఱగొనెనొ"

(సవితర్కముగాఁ బరికించి).

మ. తలకట్టుల్ విడిపోయెఁ గేల్వడఁకుటన్; దీర్ఘం బ్రభల్ చెమ్మటన్
గలిగించున్ మఱికిం బ్రతీతియవియే కాఁబోలు నంచాకృతిన్
బలుకంబడ్డవె పల్కనట్లుగపడున్ వైచిత్రిచే ;ఖండవా
క్కుల లేఖాక్షరముల్ మృగాక్షి హృదయక్షోభం బెఱింగించెడున్. 22.

విదూ—ఏమి? ముద్దుగఁ బెరిఁగెడి మొలకయరఁటి యేనుఁగు తొండముబారిఁ బడుచుండఁగాఁ జూచి యూరకుండఁ దగునా? రమ్ము వెంబడింతము.

రాజు—మిత్రుఁడా! యీరెండును దప్పిపోవుట లేదుసుమీ. సముద్రుఁడు చంద్రకళ ననువర్తించుటయు, నీవు నాచిత్తవృత్తి ననుసరించుటయు.

విదూ—(కౌఁగిలించుకొని చేతితోఁ జూపించుచు) ఇందుండి యీయిందువదన మాధవీలతామండపమును గూర్చి వెళ్లినది. ఇదిగో మన్మథపదసరణివలెఁ బదపంక్తి

కనఁబడుచున్నది. కనుక మెల్లగా ముందుకుఁబోయి పరికింతము. (అట్లు చేయుచున్నారు).

మృగాం—(లతాగృహమునందు వెన్నెలసోఁకుట నభినయించి)

గీ. విరహపరితాపభరమున వేఁగుచున్న
నంటకుర చంద్ర! నవ్వుల కంటె తేని
పొరలి యిచ్చోట నడుకొత్తి పోవఁగలవు
స్నిగ్ధబిససుందరంబులు నీకరములు. 23.

(ఇట్లు రెండుమూఁడుమాఱులు పలికి యేడ్చుచున్నది.)

రాజు—(విదూషకునితో) కన్నులపండువు గావించుకొనుము.

చ. గిరిగిరగ్రుడ్డులం దిరిగి, క్రేవల నించుకయంత సేపు ని
ల్వరముగనుండి, ఱెప్పతుదలన్ లవతంగనుపట్టి, ధారలై
విరియఁగఁబాఱి, యారటముఁ బెల్లును వెల్లడిసేసి నైజపున్
గరిమను, గాల్వలయ్యెడును గామిని యశ్రువు లీక్రమంబునన్. 24.

మఱియు.

ఉ. మొక్కలుపోవఁగన్ మొనలు, పూవులుకుల్ విడనాడి, ముగ్ధపై
నక్కటికంబుమాలి, వసుశాస్త్రము వైచె మధుండు గానిచో
గ్రక్కునఁగంటి తూముపెనుగ్రంతల వెల్వడువారిపూరముల్
మిక్కిలియున్ భజించునె పవిత్రయ కాననసారశీతులన్. 25.

(విదూషకుని చేయూఁతఁగొని చెంతఁజేరి యనురాగముతోను అనునయముతోను)

గీ. నాతియంగకములు ననుఁగూర్చి లేఁదమ్మి
తూఁడులట్లు నలిగి వాడెనకట!
యతివఁ గూర్చి యేను నట్లయ్యెతిని మద
నుండు చండశాసనుండు తలఁప. 26.

కాఁబట్టి సమసుఖదుఃఖభాజనుఁడగు నీ జనుఁడు నీయనుగ్రహముకొఱకు దోసిలియొగ్గి వేచియున్నవాఁడు.

మృగాం—(సాభిలాషముగాను ససాధ్వసముగాను రాజుం జూచి తనలో) ఏమిది! మబ్బులేనివాన! ముత్తెపుఁజిప్పలులేని ముత్యాలపంట! ఉమ్మెత్తకొమ్మ తియ్యమామిడి యయినట్లును, ఇత్తడి పుత్తడియయినట్లును, పనికిమాలిన యీ నాశరీరము మహారాజసందర్శనముచే వెలలేనిదిగాఁ జేయఁబడినది. (పెడమొగముగా విచ

క్షణతో) చెలీ! యితఁడేసుమీ! ఆమహారాజు విద్యాధరమల్లదేవుఁడు! ఇతఁడే సుమీ శ్రీ సరస్వతులకును, మదనసుందరికిని వల్లభుఁడు. ఇతనికేసుమీ శ్రీయును, సరస్వతియును, మదనసుందరియును, వల్లభురాండ్రు.

విచ.—అవును.

రాజు.—విచక్షణా! చెప్పవలసినక్రమమిది "ఇతఁడేసుమీ మృగాంకావలి వల్లభుఁడు. ఇతనికేసుమీ మృగాంకావలి వల్లభురాలు" అని. (దోసిలిపట్టి నాయికతో.)

చ. చెలువరొ నల్లగల్వలకు సిగ్గొదవుంగడగంటఁ జూడవే
తెలతెలఁబోవు విద్రుమము తీయని మోవిస్ఫురింపఁ జేయవే
తళుకుఁ బసిండికింగసటు దాకొను మైజిగి యింతనింపవే
పొలుచు ద్విజేంద్రమైనభము ముద్దుమొగంబొకయింత యెత్తవే. 27

మృగాం—(తనలో) భగవతీ! త్రియామాదేవీ! శశాంకభూషితురాలవై శతయామవుగమ్ము.

రాజు—మిత్రుఁడా! యీలతాంగికి హారలతావిరహముఁ గలిగించుటతగదు. చిత్రశిఖండిదామములేకుండ నుత్తరపుదిక్కు ప్రకాశింపదుగదా! (తనకంఠమునుండి హారమునుదీసి నాయికకంఠమునందు వైచుచున్నాఁడు.)

విదూ—ఉచితసమాగమ మెవ్వరినిరంజింపదు? గుండ్రముత్యాల గుబ్బసరములుదాల్చెడి సుందరీజనమును, వక్రోక్త్యలంకారములచే నలరుచుండెడి సుకవివర్యుల వాగ్గుంభనమును, ఇవియన్నియు రంజకములుగా నేయుండును.

(తెరలో) లతామండపాదులయిన కేళిసదనములను విడిచిపెట్టుఁడు. ప్రక్కతలుపులు మూసి గడియలు వేయుఁడు. రాత్రికావలికయి నియమింపఁబడిన కంచుకిజనములు వారివారికేర్పాటయిన స్థానములయందు వెలుపలనిలిచియుండఁగట్టడ సేయుఁడు. ఇదిగో పట్టపగలులాగున వారవిలాసినులుపట్టిన చేతిదివ్వెలు వెలుఁగుచుండ, దేవిగారు సిద్ధనరేంద్రుని యౌషధప్రభావముచే వేలకొలఁది విరిగుత్తులతో విఱ్ఱవీఁగుచున్న మాధవీలతామండపమును జూడవచ్చుచున్నారు.

విచ—(భయముతో) భర్తగారు ప్రియసఖిని విడుతురుగాక!

రాజు—నాకు ఆశాభంగముఁ గలిగింపదేని విడువవలసినదని హృదయమును ప్రార్థించెదను.

విదూ—వయస్యా! త్వరితముగా విడిచివేయుము. విడువవేని పావురపుఁ బిట్టలవలెఁ బంజరములోఁ జిక్కువడఁగలము.

(తలయొకదిక్కుగా నిటునటుదిరిగి యందఱు నిష్క్రమించుచున్నారు.)

# ఎనిమిదవ ప్రకరణము.

లాన్సుడవును ప్రభువంశస్థాపకుం డగు విల్లియమ్ పెట్టీ యనునాతఁడు ఫిప్సువలెనే తనకాలమునందు మిగుల సమర్థతగలవాఁడుగాను లోకమున కుపకరించునట్టి వాఁడుగాను నుండెను. ఇతఁడు హాంప్సుషైరులోని రామ్సే గ్రామమున 1623వ సంవత్సరమున బట్టలమ్ముకొని జీవించు నొకబీదవానికి జనించెను. ఇతఁడు బాల్యమునందు తన స్వగ్రామమున దేశభాషలను నేర్పుపాఠశాలయందుఁ గొంతవఱకు విద్య నభ్యసించెను. అటుపిమ్మట నార్మండిలోని కేయెన్ కలాశాలయందు స్వయముగా విద్యాభ్యాసము చేయుటకు నిశ్చయించుకొనెను. అచట తన తండ్రివలన సహాయముఁ బడయకుండఁ దన్నుఁ దాను పోషించుకొనుటకై కొంచెముగఁ జిల్లరసరకులను జేర్చుకొని వీధివీధికిఁ దిరిగి యమ్ముకొనువృత్తి నవలంబించెను. ఇంగ్లాండునకు మగిలివచ్చి యొకయోడ కెప్టను వద్దఁ బని నేర్చుకొనువాఁడుగఁ బ్రవేశించెను. తన దృష్టిదోషమునకై యాతఁడు త్రాఁడుకొనతోడఁ గొట్టెను. అంతట నాపడుచువాఁడు నిరుత్సాహమును విసుగును బొంది యాపని మానుకొని వైద్యశాస్త్ర మభ్యసింపఁదొడంగెను.

అతఁడు పారీసునగరమునం దుండినపు డంగచ్ఛేదనముచేసి వేర్వేఱు భాగములుగా కోసి తీయుపనియందుండెను. మఱియు నాకాలమునందె దృక్శాస్త్రమును వ్రాయుచుండిన హాబ్బీసుకొఱకు పటములను వ్రాసెను. రెండుమూఁడు వారములు తిండిలేక కొండగోఁగుకాయలను మాత్రమే తిని బ్రదుకవలసినంత బీదదశకు వచ్చెను. కాని, మరల నాతఁడు వెనుకరీతిఁ స్వల్పవర్తకమునుఁ జేసి న్యాయమయిన కొంతసొమ్ము గడియించి యాసొమ్ముతోఁ గొలఁదికాలమునకె యింగ్లాండునకు మరల రాఁగలిగెను. అతఁడు స్వతస్సిద్ధమయిన యంత్రశాస్త్రజ్ఞానము గలవాఁడగుటంజేసి జాబులకుఁ బ్రతులు వ్రాయునట్టి యంత్రమునుఁ గనిపెట్టెను. శిల్పవిద్యలను గుఱించియును, ప్రకృతిశాస్త్రములను గుఱించియును వ్రాయనారంభించెను. ఇంతియకాక రసాయనశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము నభ్యసించి విజయమునొంది మంచిపేరు సంపాదించెను. శాస్త్రజ్ఞులతోడి సహవాసమువలన శాస్త్రజ్ఞాన మభివృద్ధిచేయునట్టి సంఘము నొకదాని నేర్పఱచుటకై చర్చించి యాసంఘముయొక్క ప్రథమసభ తాను నివసించియున్న గృహమునందె జరపించెను.

ఆక్స్ఫర్డునగరమున దేహచ్ఛేదనమునందు రోతఁ గలిగియుండినయొక శారీరశాస్త్ర పండితునికి సహాయుఁడుగానుండి పనిచేసెను. 1652వ సంవత్సరమున నాతని కృషి సఫలత గాంచెను. ఐర్లాండు సైన్యములో వైద్యుఁడుగా నేర్పాటు కాఁబడి యచ్చటికిఁ బోయెను. అచట నాయుద్యోగములో నున్నకాలమున వరుసగా లాంబర్టు, ఫ్లీటువూడ్డు, హెన్రి, క్రోమువెల్లను లెఫ్టినెంటు ప్రభువులకు వైద్యుఁడుగానుండి చికిత్స చేసెను. యుద్ధనిపుణులగు ప్యూరిటాను భటులకు విశేషముగా భూములీయఁబడెను. ఆభూములు సరిగాఁ గొలువఁబడలేదని పెట్టీ కనుఁగొనెను. తాను జేయవలసిన వ్యాపారములు పెక్కు లుండినను ఈపనినిఁ దాను జేయుటకుఁ బూనుకొనెను. అతఁడు నిర్వహింపవలసిన కార్యములు వివిధములుగాను, అధికములుగాను నుండుటచేత ననూయాపరులగువారిచేత లంచగొండి యనిదూషింపఁబడి యాపనులనుండి తొలఁగింపఁబడెనుగాని కొలఁదికాలముననే వారలదయను బొందినవాఁడై యాపనులయందు మరలఁ బ్రవేశపెట్టఁబడి మిక్కిలి ప్రఖ్యాతినిఁ గాంచెను.

విల్లియమ్ పెట్టీ విసుగుచెందని పరిశ్రమమునుఁజేసి నూత్నవస్తువులను పెక్కింటిని గల్పించెను. తరంగములకుఁ బెనుగాలికి నెదురుగఁ బోవునట్టి యొక క్రొత్త యోడను నిర్మించెను. రంగులు వేయుటను గూర్చియును, ఓడలు నడుపుటను గూర్చియును, రోమములతో వస్త్రములను నేయుటను గూర్చియు, మఱియు నింక ననేకవిషయములను గూర్చియును గ్రంథములనువ్రాసి ప్రకటించెను. ఇనుపపనులను స్థాపించెను. సీసపుగనులను దెఱచెను. కలపవర్తకమును జేసెను. తీఱిక వేళలందు ప్రభుసంఘమునఁ జేరి శాస్త్రచర్చలు సలుపుచుండెను. ఆసంఘమునకు విశేషముగా ధనసహాయమునుఁ జేసెను. అతఁడు తన కొడుకులకు విశేషభాగ్యమును గూడఁబెట్టి పోయెను. వాని కొడుకులలో మొదటివాఁడు షెల్బెరను జమీనుకు ప్రభువయ్యెను. వాని మరణశాసన మతివిచిత్రముగా నుండెను. ఆమరణశాసనమునందు వాని జీవితములోని ముఖ్యాంశములు పేర్కొనఁబడెను. వాని వైభవ మెట్లభివృద్ధి పొందెనో యావిధమందు గానఁబడుచుండును.

దారిద్ర్యమునుగూర్చి యాతని యభిప్రాయములు గుణయుతములైనవిగా నున్నవి. బీదలకు మరణకాలమునందు దానశాసనము లిచ్చుటనుగూర్చి యాతఁ డిట్లు చెప్పెను. "నేను దూరముగ నిలుచుండియున్నాను; బీదలకు నే నేమియు నీయలేదు; అసమర్థులయినవారిని ప్రజలు సంరక్షింపవలెను. ఆస్తియు వృత్తియు లేనివారలను బంధువర్గము పోషింపవలెను; అందుచేతనే బీదలగు నాబంధువు లందఱకుఁ దోడ్పడితినని తృప్తి

నొందుచున్నాను; అనేకులకు బ్రదుకుతెరవును జూపించితిని; క్రొత్తవిషయములను గనిపెట్టి దాతృత్వమున కనుకూలమైన వానిని వెదకితిని. ఆపత్కాలమందు నావలెనే బంధువులకు తోడుచూపవలయునని నాసొత్తు ననుభవింపఁబోవువారి కిందుమూలముగాఁ బ్రార్థించుచు నానవెట్టుచున్నాను." అని పలికెను. తానేపట్టణమునందు బీదవానికిఁ గుమారుఁడై జనించెనో యట్టి రామ్సేపట్టణమునందే యొకసొగసయిన పురాతనపు నార్మనుగుడియందు పాతిపెట్టఁబడెను. గాయకుల సమూహమునకు దక్షిణభాగమున నున్న నొక్కచదునైన చాపరాయిపైని "ఇచ్చట సర్ విల్లియమ్ పెట్టీ పరుండి యున్నాఁడు" అని యొకచదువురాని పనివానిచేఁ జెక్కఁబడిన శాసనము గలదు.

నూత్నవస్తుకల్పనము వలనను వాణిజ్యమువలనను పెంపుగాంచిన వంశము వేఱొక్కటిగలదు. అయ్యది బెల్పరు పట్టణములోని స్ట్రట్టువంశముగా నున్నది. ఆవంశమునకు మూలపురుషుఁ డగు జెడీడయ్యా అను నాతఁడు 1758వ సంవత్సరమునందు పట్టీల మేజోళ్లు చేయునట్టి యంత్రము నొకదానిఁ గనిపెట్టి ప్రసిద్ధుఁడై విశేష ధనమార్జించెను. వాని తరువాత వానిపేరు వహించినవారెల్ల వాని యుద్దేశమును బలపఱచి వాని యైశ్వర్యమునుఁ బెంపుచేసి యుపయోగకారి యగునట్లు గావించిరి. జెడీడయ్యా తండ్రి వ్యవసాయకుఁడుగానుండి బిడ్డల విద్యాభివృద్ధికై కృషి చేసియుండలేదు. అయినను వారెల్లరు నభివృద్ధిఁ గాంచిరి. తనతండ్రికి జెడీడయ్యా ద్వితీయపుత్రుఁడు. పొలములోఁ దండ్రికిఁ దోడ్పడుచుండువాఁడు. అతఁడు బాల్యమునందె యంత్రగతిశాస్త్రమునం దభిమానము గలవాఁడై యాకాలమునందలి వ్యవసాయమున కుపయోగించు మోటుపనిముట్లను బాగుపఱచి యధికోపయోగకరము లగునట్లుగాఁ గావించెను. తన పెదతండ్రి చనిపోయినతరువాత నార్మాంటను మండలములోని బ్లాకువెల్లనుచోటఁ గలపొలమును వశపఱచుకొనియెను. తరువాత డెర్బీలో నిజారులు మేజోళ్లు మొదలగువాని నమ్మునట్టి యొకవర్తకుని కొమార్తెను బెండ్లిచేసికొనియెను. పట్టీల మేజోళ్లు చేయుటకనేక ప్రయత్నములు చేయఁబడి వ్యర్థములగుచు పోయినవని తన బావమఱఁదిచే విని యెవ్వరెవ్వరెట్టిప్రయత్నములు చేసికృతార్థులుగాక పోయిరో వానినెల్ల గ్రహింపవలయునని కృషిచేసెను. అందుకువలసినయుపకరణములనుసమకూర్చుకొని క్రొత్తమాదిరులు కనిపెట్టి మేజోళ్ళు మొదలగువాని నల్లెడు నూత్నయంత్రము నభివృద్ధికిఁ దెచ్చి యావ్యాపారమునందు సుప్రసిద్ధుఁ డయ్యెను. ఆయంత్రమును దరువాత డెర్బీ పట్టణమునకుఁ గొనివచ్చి యచ్చట ననేకవిధము లగుపట్టీల మేజోళ్లు చేసి విక్రయించుచు విశేషధన మార్జించెను పిమ్మట ఆర్క్‌రైటు అనువానితోడ భాగస్వామిగాఁ జేరి డెర్బీషైరులోని క్రాంఫర్డు

నగరమున దూదియంత్రశాల నొకదాని స్థాపించెను. ఆర్కురైటుతో భాగము విడిపోయినతరువాత స్ట్రిట్టు కుటుంబమువారు మిల్ఫోర్డులో దూదియంత్రములఁ బెక్కింటిని స్థాపించిరి. తండ్రివలెనే కొడుకులును యంత్రగతిశాస్త్రమునందు నేర్పరులై యుండిరి. జెడీడయ్యా పెద్దకొడుకగు విల్లియమనువాఁడు తనంతట నడుచు కంచరగాడిదయంత్రమును గనిపెట్టెను. విల్లియముకొడుకగు ఎడ్వర్డు యంత్రశాస్త్రజ్ఞానము విశేషముగాఁ గలిగియున్నవాఁడు గావున బండ్లకు వ్రేలాడు చక్రములను గనిపెట్టెను. ఈ స్ట్రిట్టు కుటుంబములోనివా రెల్లఁ దమధనమును సద్వినియోగమునకుఁ దెచ్చుచుండిరి. తమ యంత్రశాలలోఁ బనిచేయు పనివాండ్ర స్థితిని జక్కఁజేయుటకై తోడ్పడి ఖ్యాతిఁ గాంచిరి. ఏసత్కార్య మెవ్వరు తలపెట్టినను విరివిగా ధనసహాయమును జేయుచు సర్వవిధములఁ దోడ్పడుచుండిరి. జోసెఫ్ స్ట్రిట్టు డెర్బీలో నొకసొగసయిన యారామమును నిర్మించి పౌరజనులకు దానము చేసెను. ఆయారామము నొసంగునపు డాతఁడీవిధముగాఁ జెప్పెను. నాజీవితకాలమున సూర్యుఁడు నామీఁదఁ బ్రకాశించుచుండెను. ఎవరిపాటువలన నేను సహాయమును బొంది యిట్టియభివృద్ధిఁ గాంచితినో, ఎవరిమధ్యను నేను నివసించుచుంటినో, అట్టివారి క్షేమాభివృద్ధులకొఱకు నాయైశ్వర్యములోఁ గొంత భాగము వినియోగింపకుండుట నా కృతఘ్నతను దెలుపునుగదా యనిపలికెను.

వర్తమానకాలమున నేమి భూతకాలమున నేమి ధైర్యశాలు రయినపురుషు లనేకులు తమశక్తులను జూపి పాటుపడి నేలమీఁదను సముద్రముమీఁదను నసమానపరాక్రమమును జూపి జమీందారు లైరి. యుద్ధమున నిర్వక్రపరాక్రమమును జూపి ప్రభుస్థానములం బడసిన వెల్లింగ్టన్, హార్డింజి, క్లైవు మొదలగు పూర్వపు ప్రభువులమాట నటుండనిచ్చినను నూతనముగా ప్రభుస్థానములకు వచ్చినవారలలో ననేకులు శాస్త్రములభ్యసించి న్యాయవాదులై విశేషధన మార్జించినవారుగా నున్నారు. అట్టివారు డెబ్బది మందికంటె నెక్కువగా నిప్పు డున్నారు. మాన్సుఫీల్డు, ఎర్స్కిన్, అనునిరువురు గొప్ప కుటుంబములోనివారు. అయినను ఎర్స్కిన్ తన కుటుంబములో నొక్కప్రభువయినను జనింపకుండినందులకు భగవంతునకు వందనము చేయుచున్నాఁడ ననిపలుకుచుండెను. మాన్సుఫీల్డుయొక్క పూర్వికులు బీదవారుగాను పలుకుబడి లేనివారుగా నుండిరి.

ఇతఁడు బాలుఁడుగా నుండినపుడు స్కాట్లాండునుండి లండనునగరమునకు నొక చిన్నగుఱ్ఱముమీఁద నెక్కి రెండునెలలు ప్రయాణముచేసి వచ్చెను. ఇతఁడు దేశభాషా పాఠశాలయందును శాస్త్రపాఠశాలయందును విద్యాభ్యాసముచేసి న్యాయవాది వృత్తియందుఁ బ్రవేశించి పిమ్మట ఇంగ్లాండునకుఁ బ్రధానన్యాయాధిపతియై యధిక ప్రఖ్యా

తుండయ్యెను. ప్రభుస్థానమునకు వచ్చినవారిలో నితరులు వర్తకుల యొక్కయు, మతాచార్యులయొక్కయు, చిల్లరదుకాణదారుల యొక్కయు, పక్షవాదుల యొక్కయు, విశేషకృషి చేయునట్టి నడిమితరగతివారియొక్కయు, బిడ్డలుగా నుండిరి. ఈవృత్తిగల వారినుండి హోవార్డు, కావెండిష్సు సంస్థానములు లేర్పడినవి. ఈసంస్థానాధిపతులకు మూలపురుషులు న్యాయాధిపతులుగా నుండిరి. ఐల్సుఫోర్డు, ఎల్లెంబరో, గిల్డుఫోర్డు, షాఫ్ట్సుబరీ, హార్డ్విక్కు, కార్డిగాన్, క్లారెండన్, కామ్డెన్, ఎల్సుమీర్, గాస్లిన్, మాత్రమేగాక ప్రస్తుతకాలమునందలి టెంటర్డను, ఎల్డను, బ్రోహామ్, డెన్మాన్, ట్రూరో, లింఢర్స్టు, లియొనార్డ్సు, క్రాన్వర్తు, కాంబెల్, చెమ్సుఫోర్డు మొదలగు జమీల స్థాపకులుగూడ న్యాయాధిపతులుగ నుండిరి.

లింఢర్స్టుప్రభువు తండ్రి పటములకు రంగులు పూయువాఁడుగ నుండెను. లియొనార్డ్సు తండ్రి సువాసనద్రవ్యముల నత్తరువుల నమ్మువాఁడుగ నుండెను. ఎంగు ఎడ్వర్డు సూగ్డెనను వాఁడు మొట్టమొదట పత్రములు మొదలగువాని వ్రాయుటకు యోగ్యతాపత్రికఁ బడసిన గ్రూమనువాని కార్యస్థానమున జాబులు గొనిపోవు బాలుఁడుగా నుండెను. ఇంగ్లాండునకు చాన్సెలరు ప్రభువుగానుండిన యాతఁ డాకార్యస్థానముననున్న కాలముననే న్యాయశాస్త్రముయొక్క ప్రాథమికజ్ఞానమును బొందెను. టెంటర్డను ప్రభువుయొక్క ప్రథమదివసంబులు కడునిర్భాగ్యకరము లయినవిగా నున్నవి. అట్టి దుస్థితిని గుఱించి యాతఁ డెన్నఁడును సిగ్గుపడి యుండలేదు. ఎందుచేతననఁ బాటు వలనను, పఠనమువలనను, ప్రయోగకౌశల్యమువలనను దా నట్టి యున్నతపదవికి వచ్చి యుండెను. ఒకానొక సమయమునం దాతఁడు తన కొడుకగుచార్లెస్సనువాని క్యాంటర్బరీ దేవాలయమున కెదుటనున్న యొక చిన్నకుటీరము కడకుం గొనిపోయి వానికి దానిం జూపి 'ఓచార్లెస్సా! ఈచిన్నయంగడిని జూడుము; దీనిం జూపించుటకే నేను నిన్నిచ్చటకుఁ దోడ్కొని వచ్చితిని; ఆయంగడిలో నే నీ తాతగారు పెన్నీ పుచ్చుకొని క్షౌరము చేయుచుండువాఁడు; అదియే నాజీవితములోఁ బరువుగల ప్రతిబింబముగా నున్న'' దని పలికెను. టెంటర్డను ప్రభువు బాలుఁడుగా నుండినపుడు ప్రార్థనాలయములో గాయకుఁడుగా నుండెను. తనకుం గలిగిన యాశాభంగమువలన నాతని జీవితోద్దేశము మార్పుఁ జెందుట వింతయైన సంగతిగా నున్నయది. టెంటర్డను ప్రభువవలెనె ఇంగ్లాండునకు ముఖ్యన్యాయాధిపతులుగా వచ్చిన పెడసరియైన కెన్యోన్ ప్రభువు యొక్కయు దృఢగాత్రుఁడయిన యెల్లెంబరో ప్రభువు యొక్కయు జీవితములు సుప్రఖ్యాతములయినవిగా నున్నవి. మఱియు నాయున్నతపదవికి వచ్చిన క్యాంబెల్

ప్రభువును వారల కేవిషయమునను దీసిపోవువాఁడు కాఁడు. ఇతఁడు బహుసంవత్సరములు వార్తాపత్రికలకు సమాచారములు దెలియఁజేయు వృత్తియం దుండెను. ఆపనియం దుండినపుడె న్యాయశాస్త్రపఠనముఁ జేయుచు న్యాయవాది వృత్తికై కృషి చేసి యుండెను. అతఁడు మొట్టమొదట మిక్కిలి కష్టదశయం దుండినను క్రమక్రమముగాఁ బాటుపడి తుద కత్యుత్కృష్టదశకు వచ్చినవాఁ డయ్యెను.

ఎల్డనుప్రభువుయొక్క జీవితముగూడ మనము జ్ఞాపక ముంచుకొనవలసిన దృష్టాంతములలో నొకటిగా నున్నయది. అతఁడు న్యూకాసిల్ పట్టణమున బొగ్గు సిద్ధము చేయువానియొక్క పుత్త్రుఁడుగా నుండెను. అతఁడు శ్రమపడిపాఠములు వల్లించుటకు మాఱుగాఁ గొంటెవాఁడై చెడుపనులు చేయువాఁడుగ నుండెను. ఒకప్పుడింగ్లాండునకు చాన్సెలరు ప్రభువుగానుండిన యీతఁడు పాఠశాలయందుఁ జదువునప్పుడతిదుర్మార్గుఁడుగా నుండి భయంకరములగు కొట్లాటలయందుఁ బ్రసిద్ధుఁడైయుండెను. తోఁట దొంగతనమునందాఱితేఱినవాఁడై యుండెను. వీనితండ్రి తోలుదోల్తి కాఫీ, తేయాకు మొదలగు చిల్లరసరకులమ్మువాని దుకాణములో నప్పగింపఁదలంచెనుగాని తరువాతఁ దానుజేయు బొగ్గుపనియందే ప్రవేశపెట్టుటకు నిశ్చయించుకొనెను. అప్పటకి నతని పెద్దకొమారుఁడైన విల్లియము (స్టోవెల్లుప్రభువు) ఆక్సుఫోర్డుపట్టణమున విద్యార్థివేతనమును బొందియున్నవాఁడుగావునఁ దనతండ్రికి "జానును నావద్దకుఁ బంపవలసినది; వానికి నేను మంచితెరవును జూపఁగలను." అనిజాబు వ్రాసెను. ఆప్రకారము తండ్రితన రెండవకొమారుఁడైన యీజానును ఆక్సుఫోర్డునకుఁ బంపించెను. అచ్చటనాతఁడు తనసోదరునియొక్క పలుకుబడినిబట్టియు, తనకుంగల శ్రద్ధనుబట్టియు సాంగత్యమును సంపాదింపఁగలిగెను. సెలవుదినములలో నింటికడనుండినపుడు దురదృష్టమువలన (దురదృష్టమేల? అదృష్టమనియే చెప్పవలయును) నొకస్త్రీని మోహించి యామెను దగుల్కొని దేశమువిడచి పాఱిపోయి వివాహముచేసికొనియెను. ఇంకనాతఁడు బాగుపడఁడని వానిబంధుమిత్త్రాదులెల్లరును దలంచిరి. ఆతఁడు వివాహము చేసికొనునప్పటికి నిల్లుగాని వాకిలిగాని లేకయుండెను. అప్పటికినొక్క పెన్నియైన సంపాదించియుండలేదు. అదివఱకు తనకుంగల పనిసహితముఁ బోఁగొట్టుకొనెను. అందువలన నాతనిమనస్సు న్యాయశాస్త్రపఠనమునకై మరలెను. "నేను తొందరపడి వివాహముచేసికొన్నాను; నేనుప్రేమించినస్త్రీయొక్క సంరక్షణార్థము బహుకష్టపడి పనిచేయవలెనని నా నిశ్చయము." అనిజాను తన మిత్త్రునికి జాబువ్రాసియుండెను.

జానుస్కాట్టు లండనునగరమునకువచ్చి కర్సిటరుసందులోని యొక చిన్నయిల్లు

దీసికొని న్యాయశాస్త్రమభ్యసించుచు నచ్చటనివసించియుండెను. జాగరూకతయు దృఢనిశ్చయమును గలిగి కృషిచేసెను. అతఁడు తెల్లవాఱుటకుఁ బూర్వము నాలుగు గంటలు వేసినతరువాతనిద్రనుండి మేల్కొనుచు రాత్రులుప్రొద్దుపోవువఱకునిద్రకుఁబోక శ్రమపడి పనిచేసెను. నిద్రరాకుండుటకై తడితువాలు తలకుఁజుట్టుకొని చదువుకొనుచు వచ్చెను. ఒకప్లీడరువద్దఁ జదువుకొనుటకు శక్తిలేనంత బీదవాఁడయినందున లిఖితము లయిన దృష్టాంతములయొక్క మూఁడు గొప్పసంపుటములకు (కాగితములను రెండుగా మడచి కుట్టినపుస్తకములు) ప్రతులు వ్రాసెను. చాలకాలమునకు నీతఁడు చాన్సెలరు ప్రభువయినతరువాత నొకప్పుడు కర్సిటరు సందుగుండా పోవునపుడు తనకార్యదర్శితో "ఇదియ నాచిన్నకుటీరము. చేపలను గొనుట కాఱుపెన్సులు చేతఁ బట్టుకొని యీ వీధియందు పెక్కుమాఱులు దిరిగినటుల నా కిప్పటికిని జ్ఞాపక ముండె" నని చెప్పెను. న్యాయశాస్త్ర పరీక్షం గృతార్థుఁ డయినవెనుకఁ బనిలేక చాలకాల ముండెను. ప్రథమ సంవత్సర మీతని యార్జనము తొమ్మిది షిల్లింగులు మాత్రమే యై యుండెను. నాలుగు సంవత్సరములు లండను కోర్టులలో (న్యాయస్థానములు) పనిచేసినను లాభకారిగాఁ గానిపించలేదు. ఏవిధమయినపనియు లభించనందున నిరుత్సాహుఁడై లండను నగరమును విడిచి రాజధానిలోని మఱియేపట్టణమునకయినఁ బోవనిశ్చయించుకొనెను. లాయరుగా నుండినను బ్రయోజనము గానరాకుండెను.

జానుస్కాట్టు న్యాయశాస్త్రమునఁ దనకుఁ గలప్రజ్ఞావిశేషమును జూపుటకుఁ దగిన సమయము రాఁ దటస్థించినది. ఒక వ్యాజ్యెములోఁ ద న్నేర్పాటు గావించు కొనిన కక్షిదారుని కోర్కెకుఁ బ్రతికూలముగా న్యాయ శాస్త్రాంశమును గుఱించి న్యాయాధిపతి యెదుటఁ జర్చించెను. కాని న్యాయాధిపతి వానికిఁ బ్రతికూలముగఁ దీర్పు చెప్పెను. తరువాత ప్రభుసభకు నప్పీలు చేయఁబడెను. థర్లో ప్రభువు స్కాట్టు పెట్టిన న్యాయశాస్త్రాంశమును జక్కఁగాఁ జర్చించి స్కాట్టు పక్షము తీర్పు చేసెను. అప్పటినుండి స్కాట్టుయొక్క ప్రఖ్యాతి దేశ మంతట వ్యాపించెను. ఆతని పనియు దినదినాభివృద్ధిఁ గాంచెను. ముప్పదిరెండు సంవత్సరముల వయస్సు వచ్చునప్పటికి రాజునకు కౌంసెల్ గా నేర్పాటు కాఁబడెను. క్రమక్రమముగాఁ దన కృషివలనను దెలివివలనను చాన్సెలరు పదవికి వచ్చెను. ఆపదవియం దిరువదియైదు సంవత్సరము లుండెను.

'హెన్రి విక్కర్ స్లెత్' అనువాఁడు వెస్టుమోరులాండు మండలమున కర్కుబై లాన్సడే అనుగ్రామమునందలి యొకశస్త్రవైద్యుని కుమారుఁడుగా నుండెను. ఇతఁడు

వైద్యశాస్త్ర మభ్యసింపఁదలఁచి యెడింబరో పట్టణమునకు వచ్చి మిక్కిలి శ్రద్ధాభక్తులతోఁ బాటుపడి యావిద్యయందుఁ బ్రవీణుండయ్యెను. ఇతఁడు తిరిగి తనస్వగ్రామమునకు వచ్చి తన తండ్రి చేయుపని తానవలంబించి యుక్తముగాఁ బనిచేసెను గాని యాపనియం దాతనికంతఁగా నిష్టము లేకపోయెను. అతఁడు శారీరశాస్త్రమునందు విశేషప్రజ్ఞానము సంపాదింపఁ దలంచెను. కుమారుని యుద్దేశము కొనసాగింపఁ దలంచి కేంబ్రిడ్జి నగరమునకు నాతనిఁ బంపించెను. అతఁ డక్కడ వైద్యశాస్త్రమునందు గొప్పపరీక్షలం దేఱుటకై బహు కష్టపడి కృషి చేసెను. అట్లు చేసినందున దేహారోగ్యము చెడిపోయెను. హెన్రి దేహారోగ్యమును బడయుటకుఁగాను ఆక్స్‌ఫోర్డు ప్రభువుతోడఁ బ్రయాణముల వైద్యుఁడుగా నుండి కూడఁ దిరుగుటకై యంగీకరించెను. ఈతఁడు విదేశయాత్ర చేయునపుడు ఇటాలియా భాషయం దభిమానము గలిగి యాభాష నభ్యసించెను. పూర్వమునందువలె వైద్యమునం బ్రేమ లేకుండుటయె గాక దాని విడనాడుటకై నిశ్చయించెను. అతఁడు కేంబ్రిడ్జికిఁ దిరిగివచ్చిన తరువాత శాస్త్రపట్టము నొందెను. సైన్యమునందుఁ బ్రవేశింపఁ దలంచి యాశాభంగమును బొంది తుదకు న్యాయశాస్త్ర మభ్యసించెను. వైద్యశాస్త్రమునఁ బండితుఁ డగుట కెట్లు శ్రమపడెనో న్యాయశాస్త్రవిషయమునఁగూడ నట్టిపాటు పడెను. ఇరువదియెనిమిది సంవత్సరములు ప్రాయము వచ్చునప్పటికి న్యాయపరీక్షలం గృతార్థుఁ డయ్యెను. అప్పటికి నాతఁడు మిక్కిలి దైన్యస్థితియం దుండెను. మిత్రుల సహాయమువలనఁ బోషించుకొనుచుండెను. పనిలేక మూఁడుసంవత్సరము లమితకష్టముల నొందెను. ప్రాణము విసుగుఁ జెందెను. అనంతరము క్రమక్రమముగాఁ బనులు రాఁ దటస్థించెను. స్వల్పవిషయములం జేసినకృషి ఫలింపఁగాఁ బ్రఖ్యాతి యంతట వ్యాపింప నారంభించెను. కొలఁది కాలములోనే తాను జేసిన ఋణము లన్నిటిని దీర్పఁగలిగెను. మబ్బు విడిపోయిన ట్లాతనిఁ జుట్టుకొనియున్న దారిద్ర్యము విడిచిపోయిన తోడనే సుప్రసిద్ధమయిన కీర్తినిఁ గాంచెను. న్యాయాధిపతియై ప్రభుసభలోఁ గూరుచుండఁ గలిగెను. లాంగుడేలునకు బేరను (జమీందారుఁడు) గాఁ గలిగెను. ఇతఁడు తనకుంగల యోరిమివలనను, పట్టుదలవల్లనను, నిరంతర పరిశ్రమమువలనను, ఇట్టి యున్నతపదవికి వచ్చియుండెను.

ఈప్రకారముగా బీద లనేకులు బాల్యమునందు దారిద్ర్యముచేత బహుకష్టము లనుభవించి (కూటికి గుడ్డకు సహితము మొగమువాచి) తమ ప్రజ్ఞావిశేషమువలనను నిరంతరకృషివలనను నున్నతపదవులకు వచ్చి జమీందారులై పార్లమెంటులోని ప్రభుసభలో సభ్యులై దేశమునకు మహోపకారులై బ్రిటీషు రాజ్యమున కంగరక్షకులై యశమును గాంచియుండిరి.

# పదునాలుగవ ప్రకరణము.

సింహగిరి శ్రీనగరమున కుత్తరమున నుండెను. తొల్లి నారాయణుఁడు నరసింహావతార మెత్తి లోకకంటకుఁడగు హిరణ్యకశిపునిఁ దెగటార్చి ముజ్జగములకు భయప్రదాన మొనంగియు దుష్టదానవుని మరణానంతరమునఁ గూడఁ గోపావేశ ముపశమింపక పోవుటచే లోకముల నెల్ల భస్మపటలము గావింప నుంకించెననియు బ్రహ్మాదిదేవతలు భయకంపితులై వాని పాదరాజీవములకు మ్రొక్కి యవతార ముపసంహరింపు మని ప్రార్థింప నాతఁడు కృపాళువై యాగిరివద్దనే తన యవతారమును జాలించెననియు స్థలమహాత్మ్యము నెఱిఁగిన కోవిదు లాకాలమునఁ జెప్పుచువచ్చిరి. అందుచేత నాగిరికి సింహగిరి యను పేరు గలిగె.

శ్రీనగరప్రాంతమున నిప్పుడు సింహగిరి యను పేరం బరగు కొండయు లేదు. చుట్టుప్రక్కలగల కొండల కట్టిమహిమలు గలవని చెప్పుకొనువారును లేరు. ఆగిరిలో నొకగుహ గలదు. అది యెక్కువనిడివియు తక్కువ వెడల్పు గలదై కారుచీకటులకు నెలవై భయంకరమై యుండును. ఆసొరంగమునఁ జొచ్చిన జంతువు లన్నియు మృతినొందవని జనులు చెప్పుకొనుటయేగాని బ్రతికి వచ్చెనని యెన్నఁడు చెప్పుకొనియెఱుఁగరు. ఆబిలము మాపులు నక్కకూఁతలతో ప్రతిధ్వను లిచ్చుచుండును గాని పగలు నిశ్శబ్దమై యుండును. జనసంపర్కము రోసి యూరుబైటనే వసియింప నిచ్చగించు దిగంబరయోగులు క్షపణకులు మొదలగు మహాత్ము లప్పుడప్పుడు దానియందు విడియుటయు రెండుమూఁడు దినము లందుండి చెక్కుచెదరక యవ్వలకుఁ బోవుటయుఁ గలదు. మృత్యుముఖముఁ బోలు నాబిలము సొచ్చి వా రెట్లు బ్రతికి బైటఁ బడిరని కొందఱు పౌరులకు సందియ మప్పుడప్పుడు తోఁచుచువచ్చెను. కాని యందుఁ బ్రవేశించినవారి మహిమయే వారిం గాపాడుచువచ్చె నని పెద్దలు తెలియఁజెప్పి యట్టివారి సందియములఁ బాపుచువచ్చిరి.

అట్లు హేమచంద్రుఁడు సోదరవియోగమునకుఁ గూర్చి కొండొకతడవు విలపించి ...య్యుని నిజవృత్తాంతము స్వయముగ వినఁగోరి మంత్రి పురోహిత సమేతుఁడై హరిశర్మ ...కుఁ బోవ పయనమయ్యెను. అగుటయు నప్పుడు మణివర్మ పరిచారకు నొక్కనిం ...చి "యోగీ మహారాజుగారు సింహగిరికిఁ బోవుదురు. అరదము నాయత్తము చేయు ...సూతునకుం జెప్పు" మని పనిచె. ఆమాటలు విని నరపాలుఁడు మణివర్మను జూచి

‘‘యార్యా! పోవలసినతావు మహాపురుష సమక్షము. మనల నచ్చటికిం గొంపోవు పని భ్రాతృ మరణము. కావున నిది యరదంబులు నందలంబులు నెక్కి యూరేఁగఁదగిన సమయము గాదు.’’ అని పాదచారియై మణివర్మయు, మాధవసేనుఁడు, నిగమశర్మయు వెంటరా నిరువురు పరిచారకులు ముందు నడచి మార్గమునుండి జనులం దొలంగింప సింహాగిరికిం జనిరి. కాలి నడకను జనుచున్న మహారాజును గనుంగొని పౌరు లచ్చెరువడి యాందలంబు డిగి యెఱుంగని యాగర్భశ్రీమంతుని నడపించుచున్న మహాకార్యమేమై యుండునని విచారించి కారణ మెఱుంగఁ జాలక నిలువంబడి చూచుచుండిరి. అవ్విధంబున కొంతసేపు నడచినడచి రాజు పరివారసమేతుఁడై సింహాగిరి సమీపమునకు వచ్చి గుహాద్వార సమీపమున మూఁగియున్న వందలకొలఁది జనులను జూచెను. ఆజన సమూహములో నొకఁడు మహాప్రభూ! నాకుఁ గుష్ఠవ్యాధి యనియు మఱియొకఁడు నాకు రాజయక్ష్మము పిన్ననాఁటనుండియుఁ బీడించుచున్న దనియు వేరొకఁడు నాకుఁ గన్నులు లేవు దృష్టి దయసేయు మనియుఁ బ్రార్థించుచుండెను. ఆకేకలు విని రాజు మంత్రులతో ‘‘యీమూఁగిన జనంబునుం జూడ లోకములో నున్నరోగు లందఱు నిచ్చటికే వచ్చినట్లు గనఁబడుచున్నది. ఈకేక లామహాత్ముని జపతపంబులకు నిశ్చయముగ విఘ్నముఁ గలిగించును. ఇతఁడు వీరితో నెట్లు వేఁగుచున్నాఁడో గదా’’ యని పలికి యామందలోఁ జొరఁబడి లోనికిం జనఁజాలక యచట నిలిచె.

ఇంతలో సేవకులు రోగుల నొత్తిగించి దారి సేయుటయు నిగమశర్మ మునుముందు నడచి తెరువుఁ జూప రాజు భృత్యామాత్య సమేతుఁడై గుహాద్వారమువద్దకుం జనియె. చని కృష్ణాజినముపై బద్ధపద్మాసనము వేసికొని కూర్చున్నవాని రవంతయే నెడములేకుండ మే నెల్ల విభూతి పూసికొన్నవాని శతరుద్రాక్షమాలికలు వ్రేలుచున్న మెడగలవాని సగము నెరసిన వెండ్రుకలు గల గడ్డము వాని భక్తిమై యోంహర యోంహర యని శివ నామస్మరణము సేయువాని శాంతరసమున కునికిపట్టగువాని హారిశర్మ యనువానిఁ జూచి వెల్లి విరిసిన భక్తిరసము పెంపున హేమచంద్రుఁడు బ్రాహ్మణునకు సాగిలంబడి మ్రొక్కెను. అమాత్యులు పురోహితుఁడునుం గూడ నమస్కరించి యథారాజా తథా ప్రజా యనువాక్యము సార్థకము చేసిరి. హారిశర్మ కన్నులు మూఁసి మహేశ్వరధ్యానమునం దుండుటచేత రాజు నమస్కరించుటయు మంత్రులు మ్రొక్కుటయు నెఱుంగనే యెఱుంగఁడు. నిగమశర్మ హారిశర్మ శిష్యులం జూచి ‘‘మహారాజుగారి రాక నెఱిఁగింప వచ్చునేని మీగురువుల కెఱిఁగింపుఁ’’ డనికోరెను. రా జాపలుకులు విని వలదు వలదు తపోనిష్ఠు లగువారికి విఘ్నములు గలిగించు టనుచిత మనివారించెను. అనంతరము

కొంతవడికి హరిశర్మ తపస్సు చాలించి కన్నులు తెరచి గుహ నలుదెసలు పరికించి కట్టెదుట నిలిచియున్న యపూర్వపురుషులం జూచి మీ రెవ్వ రని పూర్వపరిచితుఁ డగు నిగమశర్మ నడిగెను. అతఁడును "స్వామీ వీరు కాశ్మీరదేశాధీశ్వరు లగుహేమచంద్ర మహారాజుగారు. మిమ్ము దర్శింపఁ గోరి యిచ్చటకు విచ్చేసియున్నవా" రని ప్రత్యుత్తర మిచ్చెను. అది విని హరిశర్మ "ఓహోహో! ఇతఁడే నా శ్రితజనచింతామణి. ఇతఁడే నా పండితజనకమలాకరప్రభాకరుఁడు. సత్పురుష సందర్శన మగుటచే నీదినము కదా సుదినముసుఁడీ" యనికొండొక ప్రశంసించి వారికందఱకు వ్యాఘ్రచర్మములు వేయించి కూర్చుండఁ బనిచి వెండియు నిట్లనియె. "మీరు రాక రాక వచ్చి మా కతిథులైరి. మీకు మే మేమిసపర్యలు చేయఁగలము? రత్నకంబళములపై నాసీను లగువారికిఁ బులితోళ్ళు, మౌక్తికహారంబులు ధరించువారికి రుద్రాక్షమాలికలు, మంచిగంధము పచ్చ కప్పురము పూసికొనువారికి బూడిదయు మరువము దమనముఁ దాల్చువారికి మారేడు దళములు సమర్పించుట మీవంటివారి నగౌరవించుటయే. కావున మా యనాదరణము నకు మమ్ము మీరు మన్నింతురుగాక!

అనవుఁడు హేమచంద్రుఁడు విప్రునకుం దనయెడ గలగౌరవమునకు సంతసించి వినయంబును భక్తియు మనంబున సందడింప నాతనితో నిట్లనియె. "సరిసరి మీవలనా మేము సపర్యల నపేక్షించుట. మీపాదరజంబు మాకిరీటంబుల నంటనిచ్చుటయే మమ్ము గౌరవించుట. మీయడుగుదామరల సేవింపనిచ్చుటయే మ మ్మాదరించుట. మీవలన నమోఘంబు లగుమీయాశస్సుల నపేక్షింతుముగాని రత్నకంబళములు మౌక్తికహారంబులు హరిచందనంబులు నపేక్షింపము. మీ బూదిపిండికట్లు మోక్షమార్గంబున కెత్తిన సోపానంబులు. మీ రుద్రాక్షమాలికలు ముక్తికాంతము వలచివైచిన దామకములు. మామౌక్తికహారములు స్వయముగా కంఠమునకుఁ దగిలించుకొనిన యురులు. ఉదయము మొదలు సాయంకాలమువఱకు రాజనీతిపేర జగద్వంచనము చేయురాజులు సంసారపు సంకెళ్ళు విడఁగొట్టుకొని జీవన్ముక్తులైన మీవంటి మునిరాజుల యెదుట నిలువనైన నర్హులె? మీ దర్శనముచేత నేనును నాపితృదేవతలు పదితరంబులవారును నావంశస్థులును బవిత్రుల మైతిమి. మీరాకచేత కాశ్మీరదేశమే యనుగ్రహింపఁబడినది." అని రాజు ప్రశంస సేయ నిగమశర్మయు రాజు పలికిన దంతయుం సత్య మనిచెప్పి తనకుం దోఁచినట్లు తానును బ్రాహ్మణుని కొంతసేపు కొనియాడి తనయేలికవచ్చినపని విప్రునకు విన్నవింపఁ దలఁచి వినయముతో "మహారాజుగారి సోదరుఁడు చిత్రభానుఁడు హరిద్వారమువద్ద కాలధర్మము నొందెనని విని యది నిక్కవమో లోకప్రమాదమో తెలియఁగోరి

యూయెన యిటవచ్చె" నినపలికెను.

ఆపలుకు చెవిని బడినతోడనే హారిశర్మ మొగము చిట్లించి కన్నులు మూసికొని "హరహరా! ఆమందభాగ్యుని దురవస్థ మరల జ్ఞప్తికిఁ దెచ్చుకొనవలసివచ్చెనా?" యని రెండుకన్నులనుండి రెండు బాష్పబిందువులు విడిచి యొక్కనిముస మూరకొని హేమచంద్రు నుద్దేశించి "రాజా నీసోదరివృత్తాంతము స్వయముగ నాముఖంబున వినఁ గోరి వచ్చితివి గావున నిదిగో చెప్పెదవినుము. సహజకోమలము లగుమానసములు చాలకాలముక్రిందట జరగిన వృత్తాంతములు జ్ఞప్తికివచ్చినను క్రొత్తగా నవుడు కన్నుల యెదుట జరగినట్లు భావించుకొని దుఃఖసంతప్తము లగును. నీయనుజాని చరిత్రము మిక్కిలి దయనీయ మగుటచే వానిపేరు దలపెట్టినంతనే నాకన్నుల నీరు వచ్చినది." అని పలికి వెనుకటి వృత్తాంతమును మరల జ్ఞప్తికిఁ దెచ్చుకొనుటకుఁ గాఁబోలు నాలు గైదునిముసము లూరకొని పైకి చూచి యిట్లని చెప్పఁదొడఁగె. నేను పరమశైవుఁడను. అందుచేత శివుని సాక్షాత్కరించుకొనఁ దలఁచి బాల్యకాలమున నాకు నాగురువుపదేశించిన పంచాక్షరీమహామంత్రమును పదిలక్షలసారులు పునశ్చరణచేసి యెంతకు మహేశ్వరుని ప్రత్యక్షము జేసికొనలేక తుదకొకనాఁడు మెడకు గండకత్తెర వేసికొని మహేశ్వరా! నీవు ప్రసన్నుఁడవు గావేని యిదే ప్రాణములు విడిచెద నని ప్రతినఁ జేసి భోజనము మాని కూర్చుంటి. నాఁటి యర్ధరాత్రమున భక్తవత్సలుఁ డగు మహేశ్వరుఁడు చిచ్చుకన్నుతోడను చిలువపేరుతోడను పులితోలుతోడను బూచులబలగముతోడను పూపచందురునితోడను బూదిరేకలతోడను తెల్లమేనితోడను నల్లమెడతోడను నాకు సాక్షాత్కరించి నన్నుం బుజ్జగించి కావలసిన వరము నడుగుమనియె. ఐహికము లగు ధనధాన్యాది సంపదలు గోరక కైలాసంబునఁ జూడఁ గోరుచున్నాఁడ. నన్నటకుం గొంపొమ్మని ప్రార్థించితి. అతఁడును వల్లె యని నన్ననుగ్రహించి రెండు పసిఁడిపాదుక లిచ్చి కైలాసమునుఁ జూడఁ గోరిక పుట్టినప్పుడు వీని నధిష్ఠింపుము. అవియే నిన్నటకుం దెచ్చునని చెప్పి వాని నిచ్చి యంతర్హితుం డయ్యె. అనేకదివ్యవత్సరంబులు తపంబులుచేసి చరితార్థులైనమహాయోగులకు దుర్లభుఁ డగుమహేశ్వరుఁడు నాకుం బ్రసన్నుఁ డగుటకు నాయందలి మహిమములు గాని వేరుగావు. శ్రితజనపారిజాత మగునమ్మహాదేవునకు నాపైఁ బొడమిన నిర్హేతుకజాయమానకృపయే కారణము.

ఆమఱునాఁ డుదయమున నేను కాల్యకృత్యముల నిర్వర్తించుకొని పరమేశ్వరుఁ డిచ్చినపాదుకలు దొడుగుకొని కైలాసంబునకుఁ బోవలయు నని మనంబున సంకల్పించి కన్నులు మూసికొంటి. ఆసంకల్పించుటయే యెఱుంగుదును గాని యవ్వల నేమైనదో

యొక్కముహూర్తమువలెను నెఱుంగ. ఒక్కనిముసములో నేను కైలాసంబున నుంటి.
అచ్చటి వైభవం బేమని వర్ణింపఁ? అందఱు మూఁడుకన్నులు గలవారె. అందఱు లేత
చందురుని దాల్చినవారె. అందఱు పులితోలు గట్టినవారె. అందఱు పాముకడియంబులం
బెట్టినవారె. పసిడిపావలు దొడిగి టక్కుటిక్కు మనినడచుచు నేను మహేశ్వరసన్నిధి
కరుగుచుండ నమ్మహాదేవుఁడు నన్నల్లంత దవ్వులఁ గని సబహుమానంబుగఁ దోడ్కొని
రమ్మని నందీశ్వరుం బుత్తెంచె. మధ్యమలోకంబునుండి వచ్చిన మనుష్యమాత్రుని
మహేశ్వరు నంతవాఁడం తగౌరవించుటం జేసి నాయందేదో గొప్పమహిమ యున్నదని
శంకరుం బరివేష్టించిన వేలుపు లందఱు దలంచిరి. నందీశ్వరుఁడు నన్నెదుర్కొని
కౌఁగలించుకొని చేయి పట్టుకొని దేవదేవుని సన్నిధికిఁ దోడ్కొని పోయెను. శంకరుండును
కృపారసపూరితంబు లగు చూడ్కులతో నన్నుం గనుఁగొని సేమమరసి దేవసేనా
పతియుఁ దనకుఁ గారాపు కుమారుఁడు నగుకుమారస్వామిని పీఠమునుండి లెమ్మని యాన
తిచ్చి యాపీఠమున నన్నుం గూర్చుండఁ బనిచె.

అది ప్రాతఃకాల మగుటచే శంభుని సేవింప నచ్చటికివచ్చిన మహేంద్రాది
దిక్పాలకులు తక్కినవేలుపులు ప్రమథగణంబులు నన్నుఁ జూడనారంభించిరి. అనంతరము
భర్గుఁడు కైలాసమంతయుఁ జూచిరమ్మని యానతిచ్చి నందీశ్వరుని తోడిచ్చి పంపెను.
నేను నందుఁగల వైచిత్ర్యంబుల నెల్ల మనసారఁ గనుంగొని మరలివచ్చి భవునకు
మ్రొక్కి నిలువ నతఁడు వత్సా! నీకేమి కావలయు నది కోరుమని యానతిచ్చె. అప్పుడు
నేను భయసంభ్రమంబులతో దేవా! మరల నరలోకంబున కరుగకుండ నిచ్చటనే యుండ
వలతు నంటి. అనవుఁడు చంద్రశేఖరుఁడు కుమారా! నరలోకంబు పాపభూయిష్టమై
యున్నయది. నీ వింకం గొంతకాల మందుండి పాపాత్ముల బవిత్రులుగఁ జేయవలయు.
అట్లు చేసి జీవన్ముక్తి నొంది యిచట నుందువుగాక యని సాదరంబునఁ బలికి వెండియు
నన్ను నరలోకంబునకుఁ బొమ్మని యానతిచ్చె.

## పదునెనిమిదవ ప్రకరణము.

"అయ్యా! ఈ ప్రసంగమునుఁ బట్టి నన్ను నే గొనియాడుకొనుచున్నవాఁడ నని మీరు తలంపఁగలదు. హరిద్వారమువద్దకు నేను రావలసిన కారణంబును మీ కెఱుంగఁ జేయక తప్పదు. గావున దాని నానుపూర్విగ నెఱింగించితిని." అని హరిశర్మ పలుకుచుండ వానిమాటకడ్డమువచ్చి నిగమశర్మ "మేలు మేలు మిమ్ము మీరు బొగడుకొనుచున్న వారని యెట్టిచెనఁటియైన యనజాలునే. జగంబులు మీ మహిమంబుల వేనోళ్ళం బొగడుచుండ మీరె కొండాడుకొనవలయునా? మే మట్లు తలంచుకొనువారము గాముసుఁడీ" యని వాక్రుచ్చి చిత్రభానుని వృత్తాంతము నెఱిఁగింపు మని వానిం గోరెను. హరిశర్మ చేసిన యాత్మప్రశంస విని మణివర్మ "ఏమిది? ఇతఁడు ప్రస్తుతములైనయంశములను మిక్కిలి పెంచి చెప్పుచున్నాఁడు. చిత్రభానుని వృత్తాంతము చెప్పుటకన్న తనమహిమములు చెప్పుకొనుటయే యీతనికి ప్రస్తుత మనితోఁచెఁ గాఁబోలు" నని తనలో విచారించుకొని యూరకుండెను. హరిశర్మ నిగమశర్మ పలుకుల నాలకించి తనయందు వారికి భక్తితాత్పర్యంబులు మందగింపక యెప్పటియట్లు యున్నవని తెలిసికొని చిత్రభానుని వృత్తాంతము నిట్లని చెప్పఁ దొడంగె.

అట్లు భగవానుఁ డగు నిందుశేఖరుని చేత నాజ్ఞాపితుఁడనై వెండియుఁ బసిఁడి పావలఁ దొడిగికొని బ్రహ్మకపాలంబువద్ద భూలోకముఁ బ్రవేశించితిని. ఆతావు చేరిన పిదప మహేశ్వరుఁ డిచ్చినపాదుకలకు తొంటి యద్భుతశక్తి పోయినది. అందుచేత నేను పాదచారినై మార్గమధ్యమున నా శిష్యు లగు భైరవుని గాలకంఠునిఁ గలసికొని యెడనెడ జుట్టుప్రక్కలనున్న పుణ్యక్షేత్రముల సేవించుచు దివ్యతీర్థముల మునుఁగుచు హరిద్వారము చేరితిని. నే నెక్కడికిఁ బోయినను గ్రామమధ్యమున వసించుట కిష్టము లేనివాఁడనగుటచే హరిద్వారమునఁగూడ నూరు వెలుపల నొక పెనమఱ్ఱిక్రింద విడిసితిని. అది భాగీరథీతీరముననే యుండుటంజేసియు చాలనేల నావరించుటంజేసియు బాటసారులకు నత్యంతోపయుక్తముగ నుండును. ఆమఱ్ఱివృక్షముక్రింద విడిసి యచ్చట నొకశిష్యు నుండుమని రెండవశిష్యుఁడును నేనును గంగాస్నానమున కరిగితిమి అప్పుడు

త్రోవలో నొక మారేడుచెట్టుక్రింద మూలుగుచు నట్టినేలం బొరలుచు బాధపడుచున్న యొకమనుష్యునిఁ గాంచితిమి. కౌపీనం బొక్కటి దక్క వానిమేనిమీఁద వస్త్రము లెవ్వియు లేవు. మంటికుండ లొండు దప్ప పాత్రములు లేవు. అతఁ డెప్పుడు ప్రతి నొందునా యెప్పుడు పొడుచుకొని తినఁగలుగుదుమా యనికని పెట్టుకొనియున్న కాకులు గ్రద్దలుతప్ప వేఱుచుట్టములు లేరు. వాని ముఖలక్షణముల నవలోకింప యతఁడు సత్కులీనుఁ డనియు మిక్కిలి గారాబునం బెరిగియుండఁ బోలుననియు మహారాజు కుమారుఁడైన నై యుండవచ్చుననియు నాకును నావెంటనున్న కాలకంఠునకుం దోఁచినది. ఆపన్నుల సంరక్షణమునందును భగవత్కైంకర్యమునందును శరీరము వినియోగింప దీక్షఁబూనిన వాఁడ నగుటచే నే నప్పుడ శిష్యసమేతుఁడనై యయ్యనఘ సన్నిధిం బోయి కూరుచుండి నీ కేమి గావలయునని బిగ్గరగ నడిగితిని. అతఁ డప్పుడు కన్నులు దెరచి నావంకఁ దేఱి పాఱజూచి నోట మాటలేమిం దనకోరిక చెప్పలేక నోరు తెరచెను. అతనికి దాహము గావలయుఁ గాఁబోలు ననుకొని నే నప్పుడ కాలకంఠునిఁ బంచి గంగాజల మించుక తెప్పించి మెల్లమెల్ల వాని నోటం బోసితిని. ఆజలబిందువులు ద్రావి యతఁ డించుక సేదదేరిన పిదప "నాయనా! నీ వెవ్వరి వాఁడవు నీ కింతగతి ప్రాపించుటకుఁ గారణ మేమి? నీకిప్పుడు గలబాధ యెద్ది" యని యడిగి వాని దేహతాపము నుపశమింపఁ జేయుటకై యుత్తరీయపు కొంగుతో నించుక విసరు మని కాలకంఠునిం బనిచితిని. అతఁడు నటు సేయ నారోగి మఱింత సేదదేరి మిక్కిలి హీనస్వరముతో సంగ్రహముగా దన వృత్తాంతము నిట్లని చెప్పె. "స్వామీ! మీరెవ్వరో నే నెఱుఁగను గాని నాపాలి దైవంబ వని భావించుచున్నాఁడ. నే నింకఁ బ్రతుకుట యబద్ధము. అయినను నిన్నటి నుండి నో రాడుకొని పోవుచున్నది. కీళ్ళలో పటుత్వము లేమి గంగకుఁ బోయి జలంబు తెచ్చుకొనఁజాలనైతి. దారిం బోవువారిఁ బిలుచుటకైన నోపిక లేదయ్యె. మీయను గ్రహమున నిప్పుడు ప్రాణ మించుక చల్లఁబడినది. నాకథ సంగ్రహముగాఁ జెప్పెద వినుఁడు. "నేను కాశ్మీరమహీపాలుఁ డగు హేమచంద్రుని తమ్ముఁడను. చిత్రభానుఁడను. నేను తనకుం ద్రోహము దలపెట్టితి నని మాయన్న నన్ను దేశంబునుండి వెడల నడచె. అది మొదలు దారపుత్రుల విదర్భ కంపి యేకాకినై యనేక దేశంబుల గ్రుమ్మరి కుడిచిన చోటఁ బండుకొనక పండుకొన్నచోటఁ గుడువక వ్యాధిగ్రస్తుఁడనై తుద కీకాశికి వచ్చితిని. దైవవశమున మాయన్నను మీరు కనుగొందురేని తనయెడ నెన్నఁడు నేను ద్రోహము చేసియెఱుంగ ననుఁడు. తాను చేసినబోగినై యాలుబిడ్డల కెడఁబాసి యొక

చెప్పుక్రింద నిక్కలేక మృతినొందుచుంటి ననుఁడు. మందభాగ్యులగు నా బిడ్డల కరుణింపు మనుఁడు. నాపైఁ గోపమున వారి నిరాకరింపవల దనుఁడు. ఒకవేళ నే నేయపరాధంబు నైన తనయెడఁ జేసితి నేని క్షమింపుమనుఁడు. తనపాదపద్మములకుఁ గడసారి మ్రొక్కితి ననుఁడు. తనకొడుకుల నిరువుర ముద్దాడితి ననుఁడు'' అని చెప్పి యొక్కనిముస మూఁరకొని ''స్వామీ నా కాయాసము వచ్చుచున్నది. నే నింక మాటలాడఁజాల'' నని యూఁరకొని కన్నులనుండి సంతతధారగా బాష్పములు విడువఁజొచ్చె. అనంతర మొకదిన మతఁడు జీవించెను; కాని మరల మాటాడలేదు. మఱునాఁడు మధ్యాహ్న మతఁడు పరలోకగతుఁడుగా ననాథప్రేతసంస్కారము మిక్కిలి పుణ్యప్రద మను శాస్త్రోక్తియందు నమ్మికఁ గలవాఁడ నగుటచే నేను నాశిష్యులం బురికొల్పి వాని కగ్ని సంస్కారంబు కావించితిని. మరణకాలమునందు నా కతఁడు చెప్పిన పలుకులు విన్న వించి కృతకృత్యుఁడ నయితిని. కాని మీ కధికమనస్సంతాపము గలిగించితి గదా యని చాల వగచుచున్నాఁడ. ఏ కారణముననైన మనుష్యుల దుఃఖింపఁ జేయుట మా యాశ్ర మంబున కనుచితము. అదియునుఁ గాక బంధుమరణముచేత దుఃఖపడుచున్న వారి సమీపమున నే నుండఁజాల'' నని హరిశర్మ వెండియు నేదో చెప్పఁబోవుచుండ హేమచంద్రుఁడు దుఃఖావేశపరవశుఁడై గోడకుఁ జేరఁబడి మొగంబున నుత్తరీయాంచలము వైచికొని తమ్మునిఁగూర్చి బిట్టువగచెను.

మణివర్మయు మాధవసేనుఁడు రాజునుఁ బట్టుకొని దుఃఖోపశమన వాక్యంబులు బలికిరి. ధైర్యము విడిచి యంగలార్చు రాజు దుఃఖము నుపశమింపఁ జేయఁదలఁచి హరిశర్మయు నిట్లనియె. ''రాజా! నీ శరీరములు వినశ్వరము లనియెఱింగియు నీ వింత విచారింపనగునె. వినశ్వరంబు లగుపదార్థములఁగూర్చి విచారించుట వివేకులకు ధర్మము కాదని భగవంతుం డగు శ్రీకృష్ణుం డర్జునున కుపదేశింపలేదే. భగవద్గీతలు పిచ్చికూత లని దుర్వాదములు సేయుబౌద్ధులు భగవంతుని మాటలపై విశ్వాసముంచరు గాని యాస్తికుల మగుమనము విశ్వాసముంచి జ్ఞానవంతులము కావలదె. ఆత్మ నిత్యము దేహ మనిత్యము. ఇది యెఱిఁగి నడచుకొన్నవాఁడే వివేకి. అందుచేత నీవు విచారింపఁ జెల్లదు. అని బలుకుటయు హేమచంద్రుఁడు కన్నీరు దుడుచుకొని ''స్వామీ నాతమ్ముని మరణ కాలంపు బలుకులు ములుకులై నన్నుం బీడించుచున్నవి. వాని చరమావస్థం దలఁచు

కొన్న నా కడుపు చుమ్మలుచుట్టుచున్నది. రాజ్యాంతే నరకం ధ్రువ మనుమాట సత్యము. నీచమతి నిరపరాధు(డగు సోదరుని నేలపాలు జేసికొంటి. విమర్శించి కార్యంబుల(జేయని వారికి(బ్రాపించు గతు లిట్టివియే గదా! ఈ భ్రాతృద్రోహి మీవంటి మహాత్ముల పవిత్రచరణంబులను ముట్టందగండు. నా చేసిన దోసంబునకు శాపం బేదేని నిచ్చి నన్నుం దుదముట్టించి నా యలమటం దీర్పందగవే'' యని ప్రార్థించి వాని యడుగులపయిం బడె.

అడుగులవ్రాలిన నేలరేని గుచ్చియెత్తి కొలవేల్పు ''చాలు చాలు రాజా! చాలు నీ బేలతనంబులు. నీగురువులు నీకు(రాజనీతి నుపదేశించుటయే గాని బ్రహ్మవిద్యోపదేశంబు చేయరని తో(చెడిని. నీమనోవైకల్య మడగువఱకు నీకు మేము తత్త్వోపదేశంబు చేయ దల(చుకొన్నారము. ఇకనీకు నమ్మకంబయగు నేని మాకడ కప్పుడప్పుడు వచ్చు చుండునది.'' అని మందలించి మంత్రిపురోహితులం జూచి ''అయ్యా! ఈతనివైఖరి చూడ నాత్మహత్య జేసికొనువాడపోలె కనంబడుచున్నాడు. తొల్లి యొక్కనర పాలు(డు తిద్దయు సొగసులాడియగు తనరెండవయిల్లాలు చెప్పిన కొండెములు విని పట్ట మహిషివలన దనకు(గలిగిన జ్యేష్ఠకుమారుని నిరపరాధుని నిష్కారణముగ వధియించి పిమ్మట కొంతకాలమునకతండు నిర్దోషియనివిని యాదుఃఖముపట్టజాలక తన్నుదా బొడుచు కొని ప్రాణములు విడిచె. కావున నీతనిదెస మీర ప్రమత్తులై యుండునది'' అనిహితోప దేశంబు చేసి తన కనుష్ఠానకాలము మీరుచుండుటచే వారి నవ్వలకుం జనుమని వీడు కొనియె. హేమచంద్రుండు వారిశర్మకుం బ్రణామంబు చేసి సెలవు(గైకొని సపరివారముగ మరల( బాదచారియై మందిరంబునకుం జని సోదరవియోగమును గూర్చి పరిపరివిధంబుల విలపింప(జొచ్చె.

రాజునకు మాధవసేనునకు నిగమశర్మకు వారిశర్మపై నింతింత యనరాని భక్తి కుమార మణివర్మకు మాత్రము వారిశర్మ సంభాషణంబులు వినినది మొదలు కొన్నియను మానంబులు పొడకట్టె. సందర్భము పొసంగియుండకపోయినను వారిశర్మ తనప్రశంస నెందుక(జేసికొనుటయు దుఃఖముచేత మనోవైకల్యము నొందిన మహారాజునకు నుదాహరణ పూర్వకముగా నతిహీనం బను నేరుపెట్టి యొకదుష్కథ చెప్పుటయు మణివర్మకు వానిపై(గల గౌరవంబును కొంత తగ్గించెను. తన మనంబునకుం బొడకట్టిన

యనుమానంబుల రాజునకు విన్నవింపఁ దలఁచియు దగిన యదనువచ్చినప్పు డట్లు చేయుద మని యతఁ డూరకొనిరి.

హేమచంద్రన కరవిందాదేవియుఁ దక్కిన యంతఃపురపరిచారకులు నెట్టెటో దుఃఖోపశమనంబుఁ జేసిరి. వారి యుపచారవాక్యములవలన రాజునకుఁ గొంతబాహ్య దుఃఖముకొంత యడంగిన నంతస్తాపము మానదయ్యె. అందుచేత నతఁడు దినమున కొక్కొకసారియైన హరిశర్మయున్న నెలవునకుం బోయి వారివలన వేదాంతవిద్య నుపదేశము నొందుచువచ్చె. తఱచుగ నతఁ డొంటిగఁ బోవుచుండుటఁ జూచి మణిశర్మ బ్రాహ్మణుఁ డెంతయోగ్యుఁ డైనను వానికడ కేకతంబుగఁ బోవుట రాజున కుచితంబు గాదని మందలించుచువచ్చె. హరిశర్మ భగవంతుఁడే యనిమనంబున దృఢవిశ్వాసము నెలకొనియుండుటచే రాజు వానిమాటలు పెడచెవినిఁ బెట్టెను. హరిశర్మయు రాజును మిక్కిలి గౌరవించుచు వానిమీన నీగసైన వ్రాలనీయకఁ జీకటిపడువఱకు వానిం దన కడ నుండనీక యొకవేళ నట్లుండెనా భైరవకాలకంఠులను సాయమిచ్చి పంపుచు కన్న బిడ్డనట్లుఁ గాపాడుచుండె.